నవశక్తి

Vol. 1, no. 42

(Oct. 12, 1938)

బెజవాడ, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 42

(Oct. 12, 1938)

Bejavāḍa, 1938

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పత్రిక

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 1. | బుధవారము | 12-10-38 | బెజవాడ | సంచిక 42

జపాన్ బాంబుల ఫలితం



నిలువ నీడ లేని చైనా యిల్లాలు

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా రూ 3—0—0
అర్ధసంవత్సర చందా 1—10—0
విడిప్రతి 0—1—0

★ ★ ★

అడ్వర్టైజుమెంటు రేటులు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)
కాలంలో 1" మొదలు 20" వరకు ప్రతి అంగుళానికి రూ. 0—6—0
20"—100" వరకు .. 0—4—0
100" పైగా .. 0—3—0
పాతిక పేజీకి 3—0—0
సగము పేజీకి 6—0—0
ఒక పేజీ మొదల్లు 15 పేజీల వరకు పేజీ ఒకటికి 10—0—0
15 పేజీలకు పైగా పేజీ 1కి 7—8—0

ఈ వరకు అంగీకరించిన కంట్రాక్టులకు ఈ రేట్లు వర్తించవు.

ఈ రేట్లలో కన్సెషన్సు, కమిషన్సు ఏమీ ఉండవు.

★ ★ ★

చందాదారులను చేర్పించాలి:

సెప్టెంబర్‌లో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"లు పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీ సభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తి చేస్తారని నమ్ముతున్నాం.

అక్టోబరు నెల మొదటి వారములో

	కోటా	చేర్పించినది
విశాఖపట్టణము	10	0
తూ. గోదావరి	50	0
ప. గోదావరి	70	5
కృష్ణా జిల్లా	80	4
గుంటూరు	40	9
నెల్లూరు	35	0
రాయలసీమ	10	2
ఇతరస్థలాలు	5	1
	300	21

చైనా స్వాతంత్ర్య భానోదయం

అక్టోబరు 10 వ తేదీ చైనా రిపబ్లిక్ వార్షికోత్సవం

— శ్రీ కొండేపూడి లక్ష్మీనారాయణ



చైనా రిపబ్లిక్ ప్రధమ అధ్యక్షుడు
సన్ యట్ సేన్

"ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
నర జాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం!"

ఇందలి "చారిత్రిక యదార్ధ తత్వం" చైనా ప్రజలకు తెలిసినంత అనుభవపూర్వకంగా ఇతరులకు తెలియదు. మొదటినుంచీ చైనా దేశ చరిత్రంతా సుడిగుండాలతోనే ప్రవహిస్తోంది, కాని అక్టోబరు 10 వ తేదీ (1911) మాత్రం చైనా చరిత్రలో ముఖ్యమైనదని చెప్పాలి. ఆనాడు చైనాలో రిపబ్లిక్ (ప్రజాతంత్ర ప్రభుత్వ) స్థాపనకు విప్లవం బయలుదేరింది. అంతకు పూర్వపు చరిత్ర తెలిసికోవాలంటే "అట్టడుగున పడి కాన్పించని కధలన్నీ కావాలిప్పుడు." అవన్నీ త్రవ్వి పోయకుండా ఈ చైనా రిపబ్లిక్ వార్షికోత్సవానికిఅక్టోబరు 10—, సంబంధించినవి మాత్రమే స్మరించుచూ చైనా రిపబ్లిక్ వర్ధిల్లు గాక యని దీవించువాం!

1894 సం॥నాటికే చైనాలో, పాతపద్ధతులు పోయి సంస్కరణ రావాలనే వాంఛ ప్రబలిపోయింది. అదివరకున్న సంస్థలు, విద్యావిధానం, నాగరికత, ఇవి ప్రజల పరాధీనతను బాపలేక పోయాయి. జీవిత విధానమే పూర్తిగా మారిపోవాలనిపించింది. అప్పుడు పరిపాలన చేస్తూన్న డవేజర్ మహారాణికి కూడా కొన్ని సంస్కరణలు తీసుకొని రావాలనే అభిలాష కలిగింది. కాని విదేశస్తుల రాపిడికి భయపడి ఆమె ఏమీ చేయలేకపోయింది. దారి తెన్ను తోచక ఈ నిబిడాంధకారంలో వెలుగుకోసం కళ్ళు చిల్లులు పడేటట్లు చూస్తున్న చైనా ప్రజలకు డా॥ సన్‌యట్‌సేన్ ఒక దివ్య తార వలె కన్పించాడు. నూతనాశయాలతో 1894 లో అతడు స్థాపించిన "చైనా రివైవల్ సొసైటీ" చాలమందిని, ముఖ్యంగా యువకులను ఆకర్షించింది. ఈ సంస్థ నానాటికీ ఎక్కువ ప్రజాదరణను సంపాదిస్తూ, వర్ధిల్లుతూ వచ్చింది. 1911 సం॥ నాటికి జాతీయ విప్లవ శక్తులకు కేంద్ర సంస్థగా మారిందని చెప్పవచ్చు. ఇది వరకున్న పేరు మార్చి "జాతీయ ప్రజా సంఘ" మనే పేరు పెట్టబడింది.

సన్‌యట్‌సేన్ లేవదీసిన ఈ ప్రజా ఉద్యమానికి పూర్వం, పరపీడనకు భయపడి విదేశస్తులను దేశంలో లేకుండా చేయాలని ఇంకొక ఉద్యమం కూడా తల ఎత్తింది. అదే "బాక్సరు," ఉద్యమం అని పిలువబడేది. ఇది మొట్టమొదట హత్యలు చేయడంతో ప్రారంభమైంది. చైనాలో మెల్లమెల్లగా విజృంభించుతూన్న విదేశస్తులందరూ ఈతిరుగుబాటుదార్లను అణచవలసినదిగా డవేజర్ రాణికి హెచ్చరించారు. అక్కడికీ ఆమె కొందరిని శిక్షించింది. కాని దీనివలన ఉద్యమం ఆగలేదు సరికదా హెచ్చిపోయింది. 1900 సం॥లో పెద్ద విప్లవం లేచింది. దీనిని రూపుమాపదలచుకున్న జర్మనీ, ఇంగ్లండు మొదలైన విదేశస్తులందరూ రాణీ (ముఖ్యపట్టణమైన పీకింగు) మీదికి దండెత్తి రాణిని బెదరించి, సంధికి వచ్చేటట్లు చేసికొన్నారు, ఆ సంధి ఫలితంగా "బాక్సరు" ఉద్యమం పూర్తిగా అణచివేయ బడింది.

బాక్సరు ఉద్యమం అంటే అణచివేయబడింది గాని ప్రజలలో స్వాతంత్ర్యాగ్ని చల్లార లేదు. మొనార్కీ (రాజు పరిపాలన చేసే పద్ధతి) పూర్తిగా పోవాలనే పట్టుదల హెచ్చిపోయింది. ఇవన్నీ సన్‌యట్‌సేనుకు మరింత బలాన్ని చేకూర్చాయి. 1908 లో రాణి చనిపోయింది. ఒక పసిపిల్లవాడిని సింహాసన మెక్కించారు. చైనాలో శాంతి లేదు. అదే మంచి సమయమనుకొని, ప్రజాప్రభుత్వ స్థాపనార్ధం, సన్‌యట్‌సేన్



జంగ్—కై—షేక్

జాతీయ సంస్థ 1911 లో విప్లవం తీసుకువచ్చింది. ఈ విప్లవం సరిగా అక్టోబరు 10వ తేదీని ప్రారంభమైంది. 1912 జనవరి నాటికి విజయవంతమైంది. ఈ నూతన రిపబ్లిక్‌కు డా॥ సన్‌యట్‌సేన్ ప్రధమ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. 1912 ఫిబ్రవరిలో రాజును పదభ్రష్టుని గావించారు.

ఫేసిస్టులు, సామ్రాజ్య పిపాసులు అయిన విదేశస్తులు తమ మీదనే కన్నువేసుకు కూర్చున్నప్పుడు ప్రజా తంత్ర ప్రభుత్వాన్ని స్థాపించడం మాటలు కాదు. స్థాపించిన తర్వాత దాన్ని నిలబెట్టుకోవడం మరింత కష్టమైన పని. ఏ ముహూర్తాన స్థాపించుకున్నారోగాని చైనా వారికి నాటినుండి నేటి వరకూ తమ రిపబ్లిక్ యొక్క ప్రాణం నిలబెట్టుకోడానికి పోట్లాడడంతోటే సరిపోతోంది.


ఈ నూతన చైనా రిపబ్లిక్ మీద దండయాత్ర సాగించిన వారిలో ప్రథముడు యాన్. ఇతడు డవేజర్ రాజ్యంలో ఒక సైన్యాధిపతి. రాణి మరణానంతరం తాను సింహాసన మధిష్టించాలనుకున్నాడు. తిరుగుబాటు తెచ్చాడు. ఈ అంతఃకలహం జపానుకు మంచి అవకాశము కల్పించింది. తమలోని కలహాల నవకాశంగా తీసుకొని పరదేశస్తుడు ఆక్రమించడం సన్‌యట్‌సేనుకు ఇష్టం లేదు. యాన్‌ను రిపబ్లిక్‌కు ప్రెసిడెంటును చేస్తే వూరుకుంటాడనుకున్నాడు, కాని లాభం లేక పోయింది. యాన్‌ను ఎదుర్కోక తప్పింది కాదు, చివరకు ప్రజా బలానికి యాన్ లొంగి పోయాడు.

తరువాత ప్రపంచ యుద్ధంలో 1915 లో చైనా కూడ పడి నలిగిపోవలసి వచ్చింది. జపాన్ దాడిని తప్పించుకోడానికే చైనా అందులో తల దూర్చింది. కాని యుద్ధానంతరం జపాన్ దాడి తప్పిందికాదు.

1917 లో రష్యాలో సోవియట్ ప్రభుత్వం ఏర్పడడం చైనాకు ప్రాణం పోసినట్లయింది. రష్యా సన్‌యట్‌సేనుకు సహాయం చేసింది. 1924 లో సన్‌యట్‌సేన్ ప్రథమ జాతీయ కాంగ్రెసును (కొమింటాంగ్)ను సమావేశ పరిచాడు. అందులో రిపబ్లిక్ పరిపాలనా విధానాన్ని గురించిన ఒక ప్రణాళిక ప్రవేశ పెట్టాడు. ఇది పూర్తియైన సోషలిస్టు ప్రణాళిక కాక పోయినా పరదేశస్థులు దండెత్తినప్పుడు లొంగి పోకుండా నుండేటట్లు ప్రజలలో ఐక్యతను పెంపొందింప జేసేదిగావుంది. అంటే సామ్రాజ్య వ్యతిరేక యునైటెడ్ ఫ్రంటుకు పునాదిగా వుంది.

1925 లో సన్‌యట్‌సేన్ మరణించాడు. జంగ్-కై-షేక్ కనక 1929 లో జపాన్‌వారికి లొంగి కమ్యూనిస్టులపై దండెత్తకుండా వుండి వుంటే, సన్‌యట్‌సేన్ ప్రణాళికను చక్కగా అమలు జరిపి వుంటే, జపాన్‌కు ఈ నాడు చైనాలో అడుగు పెట్టడానికైనా వీలుండేదికాదు.

ఏది ఎట్లున్నప్పటికీ, నేడు చైనాకు సహాయం చేయడం, స్వాతంత్ర్య ప్రియులకు శాంతిని కోరే వారికి ముఖ్య కర్తవ్యం. ఈ విషయంలో, బానిసత్వంలో నున్నప్పటికి మనం కూడా చేతనైనంత సహాయం చేస్తూనే ఉన్నాము. చైనా నిధి వసూలుచేసి పంపాము. వైద్య సహాయ దళాన్ని-డా. అటల్ నాయకత్వాన పంపాము. చైనా స్వాతంత్ర్యము రక్షింప బడేటంత వరకు చేయగలిగినంత సహాయాన్ని తప్పక చేస్తాము. సామ్రాజ్య తృష్ణ అంతమొందాలని ఎలుగెత్తి చాటుతాము. అందుకు అన్ని దేశాలు సంపూర్ణ స్వాతంత్ర్యం పొందాలని అంటాము. మరల ఇంకొక సారి, చైనా రిపబ్లిక్ చిరస్థాయి యగు గాక అని ఆశీర్వదిస్తాము.



12—10—38 బుధవారం

బొంబాయి కాంగ్రెసు పోకడ.

బొంబాయి రాష్ట్రకాంగ్రెసు మంత్రివర్గంచే ప్రతిపాదింపబడి ఇప్పుడు శాసన సభలో చర్చలోనున్న కార్మికతగాదాబిల్లుపట్ల అసమ్మతిని తెలుపుచూ బొంబాయిరాష్ట్ర మంతటా అక్టోబరు 17 వ తేదీని కార్మికులు జనరల్ స్ట్రయికు చేయవలసిందని బొంబాయి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు తీర్మానించింది. కార్మికుల యీ ప్రయత్నాలకి అన్ని కాంగ్రెసు సంఘాలూ సహాయ పడవలసిందని కాంగ్రెసు సంఘాలను కోరింది.

తరువాత బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు సంఘం సమావేశమై యీ బిల్లును సమర్థించింది. ఇందు కనుకూలంగా ప్రచారం ప్రదర్శనాలూ చేయవలసిందని అన్ని కాంగ్రెసుసంఘాలకు సర్క్యులర్లు పంపింది.

బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు సంఘం న్యాయ దృష్టి తోప్రవర్తించి యుండినచో యీ విధంగా తీర్మానించి యుండెడిదికాదు. యీ బిల్లు కార్మికులకు అనుకూలమయినదా గాదా అనే అభిప్రాయాన్ని కార్మికులనుండి కనుగొని యుండవలసినది. ఈ విధంగా చేసి యున్నచో బొంబాయి మంత్రివర్గం చేసియుండవలసిన పనిని రాష్ట్ర కాంగ్రెసు సంఘం పూర్తి గావించి యుండెడిది. కార్మికులకు హానికరమని కార్మికులు ప్రకటించినచో యీ బిల్లును ప్యాసు చేయకూడదని కాంగ్రెసు మంత్రివర్గానికి, కాంగ్రెసు పార్టీకి హుకుం పంపుట గాని. లేనిచో కార్మికులకు అనుకూలంగా ఉండే రీతిని మార్పు చేయుంపట గాని చేసియుండవలసినది. కాని ఈ విధంగా చేయక కాంగ్రెసుసంఘం ముందుగానే నిశ్చయానికి వచ్చింది. ఆ నిశ్చయానికి అనుకూలంగా పని చేయవలసిందని సర్క్యులర్లు కూడా క్రింది కాంగ్రెసు కమిటీలకు పంపించింది.

యీనాడు అంతర్జాతీయ పరిస్థితులు చాలా క్లిష్టముగా నున్నాయి. హిందూ దేశముపై ఫెడరేషన్ రుద్దాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చూస్తున్నారు. ఆ తేదీ కూడా నిశ్చయం చేయబడింది. కాని ఎంతకాలమైతే కాంగ్రెసు మంత్రులు, కాంగ్రెస్ కమిటీలు ప్రజానుకూలంగా పనిచేస్తూ ఉంటాయో అంతకాలమూ కూడా ప్రజా సంఘాలు కాంగ్రెసు మహాసభ ఆజ్ఞలను పాలించే సేనయుగా పని చేస్తాయి. ఎంత కాలమైతే యీ పరిస్థితులు సాగుతూంటాయో అంతకాలమూ కూడా, బ్రిటిష్‌వారు ఫెడరేషన్‌ను భారతదేశముపై రుద్దలేరు.

ప్రజా సంఘాలకు, కాంగ్రెసుకు మధ్యనున్న యీ మైత్రిని చెడగొట్టుటకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మన కాంగ్రెసు మంత్రులచేతనే మన కాంగ్రెసు వెనుక సేనలవలె పనిచేసే ప్రజాసంఘాలను తుత్తునియలుచేసి. కాంగ్రెసును బలహీన పరచి, ఫెడరేషను అమలుజరిపి తమ ఆశలు నెరవేర్చుకొందామని చూస్తున్నది.

కార్మిక తగాదా బిల్లు పట్ల కాంగ్రెసు మంత్రివర్గపు వైఖరి ఇందుకే తోడ్పడు చున్నది. దీనిపై బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు కమిటీ యొక్క నిశ్చయం వల్ల, ప్రజా పోరాట ఫలితంగా కాంగ్రెస్ సంపాదించిన పలుకుబడి సన్నగిలుతుంది. ఇదే గాదు. ఇతర సామ్రాజ్య వ్యతిరేక శక్తులలోకూడా యిది చీలికల కవకాశ మిస్తుంది. జాతీయోద్యమం బలహీనమౌతుంది. దీనివల్ల సామ్రాజ్యవాదులే లబ్ధి పొందుతారు.

జర్మనీలో సోషల్ డెమోక్రేట్లు అధికారంలో నున్నప్పుడు ఇదేవిధంగా జరిగింది. దీని ఫలితంగా క్రూర ఫాసిస్టుపరిపాలన తయారైంది. చీనాలో కొమింటాంగ్ ప్రభుత్వం కూడా యిదే విధంగా ప్రవర్తించింది. దాని ఫలితంగా దుర్భర దాస్యం చీనా దేశానికి ప్రాప్తమైంది. జపాన్ చీనాను ఆ రోజులలో తినివేసింది. యిప్పుడు వారందరూ విరోధుల నెదిరిస్తున్నారు. ఆ చరిత్రలనుండి మన కాంగ్రెసు వాదులందరూ గుణపాఠాన్ని నేర్చుకోవాలి. ప్రజాసంఘాలను గాని ప్రజా ఐక్యతను గాని చీలగొట్టే కార్యాలకు కాంగ్రెసు దిగరాదు.

కాంగ్రెసువారు మంత్రి పదవులను స్వీకరించిన తరువాత ఎన్నికల ప్రణాళికను శక్తివంతముగా అమలు జరుపలేక పోతున్నారు. దీనికి కారణం ప్రజాసామాన్యానికి, కాంగ్రెసు మంత్రులకు మధ్య సంబంధం సన్నగిలడమే. కాంగ్రెసు కమిటీలయినను యీ సంబంధాన్ని కలిగించుటకు తగు యంత్రాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజలు సాగించే పోరాటాలను కాంగ్రెసు సంఘాలు తీసుకొని నడిపించుటైనా లేదు. వీటన్నిటికి తోడు ప్రత్యేక ప్రయోజనాలు (Vested interests) యొక్క ఒత్తిడి కాంగ్రెసు నాయకవర్గంపై హెచ్చింది.

ప్రజాభిప్రాయాన్ని కాంగ్రెసుకమిటీలు,తద్వారా కాంగ్రెసుమంత్రులు తెలుసుకొనుటకు అవకాశమిచ్చే విధానాన్ని కాంగ్రెసుసంస్థ ఏర్పాటు చేయకపోవుటచే మంత్రులను నడిపించవలసిన కాంగ్రెసు కమిటీలు మంత్రుల ఆజ్ఞానుసారమే పనిచేయవలసి వస్తోంది.అందుచే ప్రజలను నడిపించవలసిన రాష్ట్రకాంగ్రెసుసంఘాలకును ప్రజలకును మధ్య పరస్పర అభిమానమున్నా సంబంధం సన్నగిలుతోంది.యీలోపాన్ని దిద్దుకొనుటకు కాంగ్రెసువాదులు ప్రయత్నించకపోతే యీ సంబంధం నానాటికి తగ్గి నశిస్తుంది.

బొంబాయి కార్మిక తగాదా బిల్లును కాంగ్రెసు మంత్రులే ఉపపాదించుటను చూచి పెట్టుబడిదారీవర్గం ఆనందిస్తోంది. దీనికి వ్యతిరేకంగా పోరాడే ప్రజాశక్తిని అణచివేయుటకు కాంగ్రెసు సంస్థలను ఇంకా వినియోగించుకోవాలని చూస్తోంది. యీ ప్రయత్నం సఫలీకృతం అయి ప్రజలు—కాంగ్రెసూ,దూరమయ్యే అవకాశానికై సామ్రాజ్యవాదులు ఎదురు చూస్తున్నారు.

యీ విధంగా ప్రజలనుండి కాంగ్రెసు దూరమవడం వల్ల కాంగ్రెసు కార్యక్రమంలో పెడ మార్గం ఏర్పడు తోంది. బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు కమిటీ యొక్క నిశ్చయం కూడ యిట్టి లోపాల ఫలితమే.

ఈ లోపాలన్నీ కలసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని భగ్నం చేయడానికి పునాదు లవుతాయి. వీటి నరికట్టడానికి అందరం కృషి చేయాలి.

ఇందుకు ఒకటే మార్గం. కాంగ్రెసు సంఘాలకు ప్రజా సంఘాలకు ఐక్యతను స్థాపించాలి. ఇది క్షణంలో జరగదు. ఇందు కొరకు కూడా ఎంతో ప్రయత్నం చేయాలి. కాంగ్రెసు ప్రాథమిక సంఘాలు ప్రజల సమస్యలను తీసుకొని వాటి నివారణకై ప్రజాసంఘాలు సాగించే పోరాటాలకు దోహద మివ్వాలి. స్థానిక సంఘాలు, తమ ఒత్తిడి ద్వారాను—ప్రజా ఆందోళన ద్వారాను, రాష్ట్ర కాంగ్రెసు సంఘాలను, కాంగ్రెసు మంత్రి వర్గాలను పెడ మార్గంనుండి సరి దిద్దాలి. కాంగ్రెసు మంత్రులచే ప్రజా వాంఛలను నిర్వర్తింప చేయాలి. ప్రజలకు, కాంగ్రెసు మంత్రులకు మధ్య సంధాన కర్తలుగా మారాలి. అప్పుడే ప్రజలందరూ కాంగ్రెసు సంఘాలకు తమ సమస్యలను నివేదిస్తారు. కాంగ్రెసు పరిపాలన యొక్క అవశ్యకతను గుర్తిస్తారు. ఆనాడే కాంగ్రెసు ప్రజా హక్కులను నిర్వహించే నాయక మణిగా మారుతుంది.

అంటే కాంగ్రెసు మంత్రులకు ప్రజలకు మధ్య కేవలం పోస్టాఫీసులవలె కాంగ్రెసు సంఘాలు తయారు అవడం కాదు. ప్రజల సమస్యలకై పోరాడుతూ, వాటిని అమలు జరుపుటలో కాంగ్రెసు మంత్రులకు కలుగుతూ ఉన్న ఆటంకాలను ప్రజలకు తెలుపుతూ వాటిని తొలగించుటకు ప్రజల నుండి ప్రదర్శనాలు, మొదలగు పోరాటాలను సాగింపజేయాలి. అప్పుడే జాతీయోద్యమం బలపడి సామ్రాజ్యవాదుల బలం క్షీణిస్తుంది.

ప్రజా సంఘాలు కూడా స్వతంత్ర కార్యా చరణకు దిగాలి. తమ పోరాటాలు సక్రమమయినవని కాంగ్రెసు సంఘాలకు నచ్చచెప్పాలి. వారిని కూడా తమ పోరాటాలకు సహాయ కారులను చేసుకొని జాతీయ విద్రోహ శక్తులను రూపుమాపాలి. ప్రజా సంఘాల స్వతంత్ర కార్యా చరణ లేనిదే కాంగ్రెసును జాతీయ ఐక్య సంఘటనగా మార్చడం దుర్లభం. యీ ప్రజా పోరాటాలను నడిపేటందుకు దేశమందలి అతివాదులందరూ ఏకమయి పని చేయాలి.

బొంబాయి రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, బొంబాయి బిల్లుకు అసమ్మతిగా రేపు 17 వ తేదీని ఏర్పాటు చేసిన జనరల్ స్ట్రయికు యిట్టి స్వతంత్ర కార్యా చరణకు ఉదాహరణము. ఇది బొంబాయి కాంగ్రెసు నాయక వర్గమును పెడ మార్గమునుండి సరి దిద్ద గలుగుతుందని ఆసిస్తున్నాము. దీనిని జయప్రదం గావించటానికి బొంబాయిలోని అతివాదు లందరూ ఏకము కావాలి. భారతదేశమందలి అతివాదులందరూ ఊత మివ్వాలి.

ఇది చైనా ప్రజల నిశ్చయం

"జపాన్ వారిని తరిమివేశే వరకూ నిద్రపోము!"

(అన్నా లూ యీ స్ట్రాంగ్)

చైనా జపాన్ యుద్ధంలో చైనా ప్రజలే తప్పక జయిస్తారని చెప్పడానికి 3 ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, చైనా ప్రజలు జపాన్ దాడికి పూర్తిగా లొంగి పోతారని జపాన్ ప్రభుత్వం ఆశించింది; కాని నేడు వారు హోరా హోరీగా యుద్ధం చేస్తున్నారు. రెండవది, ఈ యుద్ధంవల్ల చైనాలో ఒక కొత్త జాతీయైక్యత ఏర్పడింది. మూడవది, చైనాలో రైతులు సహితం నేడు రాజకీయ చైతన్యాన్ని పొందు తున్నారు. దీన్ని బట్టి, చైనా శాశ్వతమైన స్వపరిపాలన స్థాపించుకొన గలదని స్పష్టపడ గలదు.

"స్వాతంత్ర్య పిపాస నశిస్తే, మిగిలినవన్నీ నశించినట్లే; ఇది నశించక పోతే, యేదీ నశించదు!" ఈ వాక్యంలో ఉన్న అర్థం నేడు ప్రతి చైనా దేశస్థుణ్ణీ ఉద్రేక పూరితునిగా చేస్తోంది. చైనా ప్రజలు యుద్ధం చేస్తూన్న కొద్దీ వారి ఉత్సాహం మిన్ను ముట్టుతోంది. కాని జపాన్ సైనికులు యుద్ధం చేస్తూన్న కొద్దీ వారిబలం క్షీణిస్తోంది. దీనికి కారణం యేమంటే, చైనా ప్రజలు దోచుకొన బడేవారు; జపాన్ దేశస్థులు దోపిడీ చేసేవారు;

సుమారు వంద సంవత్సరాలు చైనా ప్రజలు సామ్రాజ్య తృష్ణకు గురిఅయినారు. గత 6 సంవత్సరాలలో ఒక రాష్ట్రం తరువాత ఒక రాష్ట్రం చొప్పున జపాన్ సైనికులు ఆక్రమించు కొంటూన్నప్పటికీ, ఓపికతో నిల బడ్డారు. సుమారు ఒక సంవత్సరం నుంచి అనేక లక్షల మంది ప్రాణాలు పోయాయి; అనేక వేల చదరపు మైళ్ళ విస్తీర్ణం గల ప్రదేశాలు శత్రువుల వశమయాయి; అసంఖ్యాకులయిన ప్రజలకు నివసించడానికి యిళ్లు లేని గతి పట్టింది. మానవ చరిత్రలో, ఏ దేశానికీ యింత ఘోర విపత్తు సంభవించి యుండలేదని చెప్ప వచ్చును. ఇట్టి నష్టాలు మరొక దేశంలో జరిగితే, పతనం తప్పని సరిఅయి ఉండేది. కాని, యీ నష్టాలన్నీ చైనా ప్రజలను అంత కంతకు ఉద్రేక పూరితుల్ని చేస్తున్నాయి.

అసలు రహస్యం

చైనాదేశాన్ని, ప్రజలను ఎరిగినవారికి యీ ఉద్రేకంలో ఉన్న రహస్యం తెలుసు. "ఓపికతో సహించ గల వాని కోపం హద్దులేనిది!" అనేది చైనాలో ఒక సామెత. చైనా ప్రభుత్వానికి సలహా యిచ్చే ఒక ఉన్నతోద్యోగిని నేను యెరుగుదును. అతని పేరు నేను బహిరంగపరచకూడదు. అతడు నాతో ఒకసారి యీ విధంగా అన్నాడు:

"ఈ యుద్ధంలో జపాన్ 10 లో 9 పాళ్ళు గెలు[illegible]స్తుంది. కాని, యీ పదవ పాలు ఆ దేశాన్ని ఓడించ గలుగుతుంది. అది యేదంటే, చైనా ప్రజల ఆత్మ విశ్వాసం, వారి పట్టుదల. జపాన్ ప్రభుత్వానికి వీటి అర్థం తెలియదు. చైనా దేశస్థుడు యుద్ధం చేయడా[illegible] నికి ఇష్టపడకపోతే, ఉరి తీసినప్పటికీ, అతడు యుద్ధా[illegible] నికి పోడు. కాని, యుద్ధం చేయాలని నిశ్చయించు కున్నాడా, యుద్ధరంగంలో శత్రువుల్ని చీల్చి చెండాడ[illegible] గలడు!" [యుద్ధపు ప్రారంభ దశలో, జపాన్ సైనికులు వస్తూంటే కొందరు చైనా వర్తకులు 'సన్మాన సంఘాలు'గా యేర్పడి ఆహ్వానించేవారు. కాని, సైనికులు వెళ్ళిపోగానే, అట్టి దేశద్రోహుల్ని ప్రజలు పట్టుకొని ఉరి తీసేవారు!]

దేశద్రోహులకు శిక్ష

ఈ జాతీయ చైతన్యం చైనాలో నేడొక కొత్త స్వరూపాన్ని పొందింది. షాంటూంగ్‌రాష్ట్రానికి ముఖ్య పట్టణం ఆయిన సీనాన్ నగరాన్ని 'హాన్-పూ-ఛూ' అనే గవర్నరు గత డిసెంబరు నెలలో జపాన్ వారికి యుద్ధం చేయకుండానే స్వాధీనపరిచాడు. అప్పుడు నేను హాంకో నగరంలో ఉండేదాన్ని. అతడు చేసిన యీ ద్రోహానికి ప్రజలలో ప్రజ్వరిల్లినకోపాగ్ని వర్ణింప శక్యం కానిది. హాన్-పూ-ఛూ ఆ రాష్ట్రంలో రాష్ట్ర స్వపరిపాలన హక్కును కలిగి యుండేవాడు. కేంద్ర ప్రభుత్వం అతన్ని యేమిచేయాలో తెలియక తబ్బిబ్బు పడింది. కాని, తరువాత, అతన్ని ఎరస్టు చెయ్యవలసిందని జంగ్-కై-షేక్ ఉత్తర్వు చేశాడు. అవలీలగా అతన్ని ఎరస్టు చేశారు. 'దేశద్రోహులను ఉరితీయాలి!' అనే నినాదం అప్పుడు దేశమంతటా మారుమ్రోగింది. నిర్దాక్షిణ్యంగా అతన్ని ఉరి తీసింది ప్రభుత్వం.

సంధి షరతులు

కొన్నాళ్లు యుద్ధం సాగిన తరువాత జపాన్ ప్రభుత్వం చైనా ప్రజలకు సంధిషరతులు కొన్ని సూచిస్తూ ఒక జర్మన్ రాయబారిని పంపించింది. ఆ షరతుల ప్రకారం చైనా యొక్క విదేశ రాజ్యాంగ వ్యవహారాలు జపాన్ స్వాధీనంలో ఉండాలి. చైనాలో జపాన్ పోలీసులే శాంతి భద్రతలను కాపాడాలి. చైనాయందలి సహజ సంపదలపై జపాన్ ప్రభుత్వానికే పెత్తనం ఉండాలి; జపాన్ సైనిక దళాలు చైనా అంతటా యేర్పాటు కాబడాలి.

ఈ షరతులు చూచి చైనా ప్రజలు యుద్ధం చేయక మరేమి జేస్తారు? సంధి పత్రాన్ని జర్మన్ రాయబారి అయిన వాన్ ట్రూట్‌మన్ తీసుకొని వచ్చి చైనా అధ్యక్షుడైన జంగ్-కై-షేక్, అతని సతీమణి మ్యేడమ్ జంగ్-కై-షేక్‌కు చూపించాడు. జంగ్-కై-షేక్ సతీమణి సంధి షరతులు ముందుగానే తెలుసుకొని, జర్మన్ రాయబారిని యీవిధంగా పలకరించింది: 'ఏమండోయ్, ట్రూట్‌మన్ గారూ! మాకు మీరు ఎంత మంచి అదృష్టాన్ని ప్రసాదించడానికి వస్తున్నారు! ఈ మధ్యాహ్నమే మేము 4 జపాన్ యుద్ధ విమానాలను పడగొట్టాము!'

ఇట్టి ఆహ్వానంతో అతడు కంగారుపడ్డాడు. తెచ్చిన సంధి పత్రాన్ని ఆమె చేతి కిచ్చాడు. (ఆమె భర్తకు చైనా భాష తప్ప మరొక భాష రాదు) ఇస్తూ, ఆ షరతుల పైన నేనెట్టి వ్యాఖ్యానం చేయదలచుకోలేదు. [illegible] నాకు కూడా ఆ విధంగానే తోస్తోంది [illegible] అంటూ ఆమె ఆ కాగితాలను నిర్లక్ష్యంగా అవతల పడవేసింది. తరువాత, చిరునవ్వుతో జర్మన్ రాయబారిని యీ కుశలప్రశ్న అడిగింది: 'అయితే, వాన్ ట్రూట్‌మన్ గారూ, ఎంతో ముద్దు వచ్చే మీ పిల్లలు కుశలమా?' ఒళ్ళు మండుకుపోయి, జర్మన్ రాయబారి వెళ్ళిపోయాడు.

చైనా ప్రజ లందరూ సంధి షరతులను యిట్టి తిరస్కార భావంతోనే నిరాకరించారు.

దేశాభిమానం

రెండు వేల సంవత్సరాలనుంచి మాతృసేవ, పితృసేవ మొదలయిన సంకుచితా దర్మాలతో పెరిగిన చైనా యువకులు వందలాదిగా సైన్యంలో చేరుతున్నారు. Eighth Route Army అనే కమ్యూనిస్టు సైనిక దళం గ్రామాలలో సంచారం చేసినప్పుడు 15, 16 సంవత్సరాల బాలురు సహితం దానిలో చేరే వారు. ఒక బాలుణ్ణి తల్లి నివారించడానికి ప్రయత్నించింది. అతని కుటుంబ బాధ్యతలను గురించి ఉపన్యసించింది. ఆ బాలుడు యీ క్రింది సమాధానం చెప్పాడు, "అమ్మా, దొంగలు మన యింట్లో పడ్డారు. వారితో పోట్లాడడమా, లేక లొంగి పోవడమా, అనేదే ప్రశ్న." ధనిక కుటుంబాల నుంచి కూడా బాలురు, యువకులు ఉత్సాహంతో వచ్చి, సైన్యంలో చేరు తున్నారు. ఇంటి వద్ద నుంచి ఒక బాలుడు పారిపోయి వచ్చి, తన తండ్రికి యీ క్రింది విధంగా ఒక హాంకో వార్తా పత్రికలో ప్రకటించాడు: "అత్యంత ప్రియమయిన ఓ తండ్రీ! నేను నీ మీద ప్రేమ లేక యిల్లు విడచి పెట్టలేదు; దేశం యెడల అంత కంటే యెక్కువ ప్రేమ ఉండడం వల్లనే!"

సూఛో నగరంలో దేశ ద్రోహం చేసిన [illegible]ని అతని భార్య ప్రభుత్వ పోలీసులకు పట్టి జెప్పింది. చైనా సైనికులు ఉండే రైళ్ళను గురించి అతడు జపాన్ ప్రభుత్వానికి ఆచూకీ యిచ్చాడు. ఇందువల్ల జపాన్ యుద్ధ విమానాలు బాంబులు వర్షించగా, అనేక వేల తూటాలతో ఉన్న కార్లు భస్మం అయాయి. దానిపై అతని భార్య అతన్ని ప్రభుత్వ పోలీసులకు పట్టి యిచ్చింది. వారు అతన్ని తుపాకితో కాల్చి చంపేశారు. ఇరుగు పొరుగువారు తరువాత ఆమెను "నీ కేమీ విచారం లేదా?" అని ప్రశ్నించారు. ఆమె యీ విధంగా జవాబు చెప్పింది:

"ఏ మాత్రం నాకు విచారం లేదు! ఒక్క భర్తను మాత్రం నేను పోగొట్టుకొన్నాను; కాని, నా దేశస్థులను అనేక మందిని కాపాడలేమా, కాబట్టి, నాకు పరిపూర్ణమైన మనశ్శాంతి గలదు."

హ్యాంకౌ వంటి దక్షిణ రాష్ట్రాలలో అనేకమంది స్త్రీలు సిపాయిలకు మేజోళ్ళు కుట్టి ఉత్తర దిశకు పంపుతున్నారు. ఛాంగ్-షా వద్ద [illegible] జిల్లాలో ప్రజ లెవరూ పండగలు చేయకూడదని ఉత్తరువు చేయబడింది. వీటి కయ్యే ఖర్చు సైనికుల కుటుంబాలకు పంపబడుతోంది. హాంకో నగరమంతటా అనాథ బాలబాలి[illegible]

(మిగతా 7వ పేజీలో)

వారం రాజకీయాలు

రాజాజీకి 124 A సెక్షన్‌పై ఎంత ప్రేమ!

ఇండియాలో పరిశ్రమల అభివృద్ధి.

ఢిల్లీలో జరిగిన కాంగ్రెసు పరిశ్రమల మంత్రుల సమావేశం ఈనెల 3వ తేదీతో పూర్తి అయింది. వివిధ రాష్ట్రాలలో ఉన్న పరిశ్రమల మంత్రులు ఒకచోట సమావేశమై, దేశంలో ప్రఖ్యాతిగాంచిన శాస్త్రజ్ఞులతోను, వ్యాపారస్థులతోను ఇండియా యొక్క ఆర్థికాభివృద్ధిని గురించి సంప్రతించుట కిదే మొదటి పర్యాయం. ఇంతవరకూ ఇట్టి సమావేశము జరగక పోవుటకు కారణం, రాష్ట్ర పరిపాలనలో కాంగ్రెసుకి ఎట్టి అధికారం లేకపోవడమే. ఇప్పుడు 11 రాష్ట్రాలకు 8 రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రి వర్గాలు ఉండడం వల్ల జాతీయ పరిశ్రమల పోషణకు కొంతవరకైనా ప్రయత్నాలు జరుగు అవకాశం చిక్కింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సుభాష్‌బోసుగారు ఇండియాలో జాతీయ పరిశ్రమల ప్రాముఖ్యతను గురించి ఉత్సాహ పూరితంగా ఉపన్యసించారు. దేశం యొక్క అపారమైన పేదరికాన్ని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే, పారిశ్రామికాభివృద్ధి, దానితోబాటు ఒక నిర్ణీత ఆర్థిక విధానం అవసరమని ఆయన నిరూపించారు. సమావేశంలో కొన్ని తీర్మానాలు ప్యాసు చేయబడ్డాయి. దేశమంతటికీ ఒక నిర్ణీత ఆర్థిక విధానాన్ని ఏర్పాటు చేయుట: ఇనుము, ఉక్కు, బొగ్గు, నూనె మొదలైన పెద్ద పరిశ్రమలు, సాధారణ పరిశ్రమలు, గృహ పరిశ్రమలు, ఈ మూడు తరగతుల పరిశ్రమలను దేశంయొక్క అవసరాలను బట్టి యిబ్బందులను బట్టి అభివృద్ధి చేయుటకు పూనుకోవాలనీ; తక్షణమే యంత్రాలు, మోటారుకార్లు, ద్రావకాలు, భూమి యెరువులు, లోహాలు మొదలైన ప్రధాన పరిశ్రమల నిర్మాణానికి ప్రయత్నించాలనీ, తీర్మానించ బడింది. ఈ ప్రధాన పరిశ్రమల సాధ్యాసాధ్యములను గురించి సాకల్యమైన విచారణ జరిపి, 4 నెలలలో నివేదిక యిచ్చుటకొక ప్లానింగ్ కమిటీ నియమించ బడింది. ఈ నివేదికను చర్చించి, ఇతర అఖిల భారత సమస్యలను గురించి ఆలోచించుటకు ఒక పెద్ద అఖిల భారత జాతీయోప సంఘం నియమించబడు తుంది. దీనిలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, సంస్థాన ప్రతినిధులు, ఛేంబర్ ఆఫ్ కామర్సు ప్రతినిధులు, అ. భా. గ్రామ పరిశ్రమోద్ధరణ సంఘ ప్రతినిధులు, మొదటి ప్లానింగ్ కమిటీ సభ్యులు మెంబర్లుగా ఉంటారు. ఈ జాతీయోప సంఘం వివిధ పరిశ్రమలను గురించి వివరాలు సంపాదించుట; ఏయే పరిశ్రమలు స్థాపించుటకు అవకాశమున్నదో ఆలోచించుట: అవియే పద్ధతుల మీద నిర్మించబడాలో నిర్ణయించుట; అవి అభివృద్ధి చెందడానికి ఏయే సౌకర్యాలు అవసరమో తెలియజేయుట మొదలైన అంశాలను గురించి రిపోర్టు చేయాలి.

ఇండియాలో స్వదేశీ పరిశ్రమల అభివృద్ధిని వ్యతిరేకించే జాతీయ వాది ఎవడూ ఉండడు. ఢిల్లీ సమావేశంలో ఆమోదించబడిన తీర్మానాలను అన్ని సామ్రాజ్య వ్యతిరేక రాజకీయ పార్టీలు మెచ్చుకొని తీరుతాయి. వాటిని ఆచరణలో పెట్టగలిగితే దేశమందలి నిరుద్యోగ సమస్య కొంత వరకైనా పరిష్కరించబడ గలదు. కాని, ఈస్కీము అంత సులభంగా ఆచరణలో పెట్టడానికివీల్లేదు. నూతన రాజ్యాంగ చట్టంలో, పెద్ద పరిశ్రమలు, ప్రధాన పరిశ్రమలు తగినంత అభివృద్ధిని పొందడానికి వీలు లేకుండా అనేక కట్టుదిట్టాలు చేయబడ్డాయి. కొన్ని సందర్భాలలో అసలు యెట్టి అభివృద్ధియు సాధ్యం కానేకాదు. ఉదా. కోస్తా వ్యాపారం. దేశం మొత్తంమీద పరిశ్రమలు వృద్ధి చెందాలంటే, విదేశ పరిశ్రమల పోటీ నుండి రక్షించబడాలి కాని. ఇండియా శాసనంలో బ్రిటిష్ పరిశ్రమలకు, కంపెనీలకు విస్తారమైన రక్షణలియబడ్డాయి. అంతేకాదు. విదేశ సరకులపై దిగుమతి సుంకాలు విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. ధనసహాయంగా స్వదేశీ పరిశ్రమలకు సహాయం చేద్దామా అంటే, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై యిప్పటికంటె పన్నులు అధికంగా విధించాలిగాని మరొక ఉపాయం లేదు.

ఇన్ని చిక్కులున్నప్పటికీ, వివిధ రాష్ట్రాలయందలి కాంగ్రెసు మంత్రులు జాతీయ పరిశ్రమల అభివృద్ధికై ఒక స్కీమ్‌వేయుట, దానిని అమలు పరచుటకు ప్రయత్నాలు చేయుట ప్రశంసనీయము. అయితే ఒక్క విషయాన్ని గురించి మాత్రం ఆశాభంగం కలుగుతోంది. గిరిగారి వంటి పారిశ్రామిక మంత్రులు కార్మిక శాఖకు కూడా మంత్రులై యుండి, జాతీయ పునర్నిర్మాణానికి అత్యంతావసరమైన కార్మికుల జీతముల విషయంలోను, పనిచేసే గంటల విషయంలోను, ఇతర సౌకర్యాల విషయంలోనూ ఎట్టి విధానాన్ని అనుసరించాలో చర్చించక పోవడం మిక్కిలి విచారించ వలసిన విషయం. జాతీయోద్యమానికి కార్మికులిచ్చిన దోహదం అప్పుడే వీరు మరచిపోయారా?

బెంగాల్ రాజకీయ ఖైదీలు.

బెంగాల్ రాజకీయ ఖైదీల విడుదల సమస్యను గురించి మహాత్మునికీ, బెంగాల్ హోమ్ మంత్రి అయిన నజీముద్దీన్‌కూ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రకటించ బడ్డాయి. ఇప్పటివరకూ జరిగిన రాయబారాలు విఫలమైనట్లే ఎంచుకో వచ్చును. 18 నెలల కంటె తక్కువ శిక్ష అనుభవించ వలసినవారు 3 నెలల లోపుగాను, అంతకుమించి శిక్ష అనుభవించ వలసిన వారందరూ 1 సంవత్సరం లోపుగాను విడుదల చేయబడాలని గాంధీగారు కోరారు. నజీముద్దీన్ యిందుకు సమ్మతించ లేదు. హత్యానేరమునకుగాని, యితర దౌర్జన్య నేరాలకుగాని శిక్షింపబడిన వారు యెక్కువగా ఉన్నారనీ, వారిని "సాధ్యమైనంత త్వరలో" విడుదల చేస్తామనీ; వారి విషయమైనా ఒక సలహా సంఘం విచారణచేసి, వారి సిఫార్సులపై బెంగాల్ ప్రభుత్వం తన యిష్టము వచ్చిన నిర్ణయానికి వస్తుందనీ నజీముద్దీన్ సమాధానమిచ్చాడు.

బెంగాల్ జైళ్ళలో నేడు 200 మందికి పైగా రాజకీయ ఖైదీలు ఉన్నారు. వెంటనే వీరి నందరినీ విడుదల చేయాలని దేశం యావత్తూ కోరుతోంది. తమకు హింసా పద్ధతులలో ఎట్టి నమ్మకం లేదని వీరు స్పష్టంగా తెలియచేశారు. హింసా పద్ధతులంటే గిట్టని మహాత్ముడు వీరి నిశ్చయాన్ని పూర్తిగా విశ్వసించాడు. ఇంత వరకూ విడుదల అయిన రాజకీయ ఖైదీలు గాని, డిటెన్యూలు గాని హింసాయుత పద్ధతులను చేబట్టలేదు. అనేక ఉపన్యాసాలలోనూ, పత్రికలలోను తమ తమ రాజకీయాభిప్రాయాలు, కార్యక్రమాలు బహిరంగంగా వెల్లడించారు. ఇట్టి పరిస్థితులలో, వీరిని యింకా జైళ్లలోనే ఉంచి, వీరిపై కసి తీర్చుకోవాలని బెంగాల్ ప్రభుత్వం కోరుతోంది. ప్రజలలో మహాత్ముని యొక్క, సుభాష్‌బోసు యొక్క పలుకుబడిని తగ్గించే ఉద్దేశం నజీముద్దీన్‌కి ఉన్నదని స్పష్టమౌతోంది.

కాంగ్రెసు రాష్ట్రాలలో రాజకీయ ఖైదీలెవరో, సామాన్య ఖైదీలెవరో భేదం చూపబడింది. హింసాయుత నేరాలకు శిక్షింప బడినప్పటికీ, కాంగ్రెసు మంత్రివర్గాలు అనేకమంది రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. కొన్ని రాష్ట్రాలలో రాజకీయ ఖైదీలకు ప్రత్యేక తరగతి ఏర్పాటు చేయబడింది. కాని, బెంగాల్ మంత్రివర్గం జాతీయ విద్రోహులతో కూడుకొని యుంది. అధికారానికి రాకపూర్వం రాజకీయ ఖైదీల విడుదలను గురించి ఎన్నెన్నో వాగ్దానాలు చేసి, యిప్పుడు వాటిని మంటలో కలుప బోతున్నారు. అయినప్పటికీ విచారించ నవసరం లేదు. ప్రజాందోళన ద్వారా ఎంతటి నిరంకుశ ప్రభుత్వాన్నైనా కొంగదీయవచ్చు. మహాత్ముతికి సాధ్యంకాని పని ప్రజాందోళన వల్ల తప్పక సాధ్యం అవుతుంది.

కాని, మహాత్ముని అభిప్రాయం వేరుగా కనపడుతోంది. పత్రికలు గాని, ప్రజలుగాని బెంగాల్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించి "యిబ్బంది పెట్టవద్ద" (embarrass) ని ఆయన విజ్ఞప్తి చేశారు. సహనభావంతో మెలగ వలసిందని కోరారు. కాని, దండం సెంట్రల్ జైలులో ఉన్న రాజకీయ ఖైదీలు గాంధీజీకి, సుభాష్‌బోసుకు లేఖలు వ్రాస్తూ: ఇక సంప్రతింపులు మానవలసిందనీ, ప్రజాందోళన ప్రారంభించ వలసిందనీ కోరారు.

ఈ కోరికలో న్యాయం, రాజకీయ దూరాలోచన ఉన్నాయి. కాంగ్రెస్ రాష్ట్రాలలో మంత్రి వర్గాలను "ఇబ్బంది పెట్టవద్ద"ని చెప్పడం విన్నాం. కాని, బెంగాల్ మంత్రివర్గం వంటి జాతీయ విద్రోహుల కూటం యెడల కూడా మహాత్మునిట్టి వైఖరిని ప్రదర్శించడం శోచనీయం.

వచ్చే అక్టోబర్లో ఫెడరేషన్.

రేపు 24 వ తేదీని వైస్రాయి ఇండియాకు తిరిగి వస్తాడు. 1939 వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఫెడరల్ శాసనసభను విధిగా యేర్పాటుచేసే నిశ్చయంతో వస్తున్నాడని సిమ్లా, బొంబాయి విలేఖరులు వ్రాస్తున్నారు.

ఇప్పటి కేంద్ర శాసనసభ గడువు అప్పటికి పూర్తి అవుతుంది. కాంగ్రెసును సంతృప్తి పరచుటకు వైస్రాయి ఏవో మార్పులు సూచిస్తాడని కూడా వార్తలు తెల్పుతున్నాయి. ఈ లోగా, రేపు వచ్చే వేసవిలో, ఒక కాంగ్రెసు వాదిని లామెంబరుగా నియమించాలని సిమ్లాలో ఆలోచిస్తున్నారట: ఆర్థిక సభ్యునిగా నియమిస్తే ముప్పు వాటిల్లగలదని భయపడు తున్నారట: గ్వాలియర్, కాశ్మీర్, బరోడా, మైసూరు, హైదరాబాద్ మొదలైన సంస్థానాల తరపున దివాన్లు సిమ్లాలో సమావేశమై, ప్రభుత్వ సభ్యులతో సభాషణలు గావిస్తున్నారు. వచ్చేనెల బొంబాయిలో వివిధ సంస్థాన ప్రతినిధుల కాన్ఫరెన్సు జరుగుననీ; ఫెడరేషన్ యెడల తమ వైఖరి అక్కడ నిర్ణయించ బడునని తెలుస్తోంది.

ఫెడరేషన్‌ను గురించి గత అ. భా. కాం. కమిటీలో తీర్మానించ బడింది. ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా హరిపూర్ కాంగ్రెసులో ప్యాసయిన తీర్మానాన్నే తిరిగి ఢిల్లీలో బలపరిచారు. ఇప్పటి కేంద్ర శాసనసభ యొక్క గడువు పొడిగిస్తే ప్రతిష్టంభన యేర్పడగలదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫెడరల్ విధానంలో కొన్ని క్లాజులు సవరణచేస్తే అంగీకరిస్తాం అనే గూఢార్థం యీ హెచ్చరికలో ఉన్నది. వైస్రాయి కూడా కొన్ని క్లాజులు మార్పు చేయడానికి పూనుకొన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాంగ్రెసు నాయకులు సామ్రాజ్యవాదుల వలలో చిక్కుకోకూడదు. ఢిల్లీ ఎ. ఐ. సి. సి. సభలో తీవ్రవాదులు వెల్లడించిన అనుమానాలు యదార్థం కాకుండా చూడాలి, నాయకులు, ప్రజలు ఫెడరేషన్ ప్రతికూల ప్రచారం ఆగిపోకుండా, నిరంతరం సాగించాలి. ప్రజాభిప్రాయమే నాయకులకు బలం.

రాజాజీ హయాంలో మళ్ళీ 124 A!

ఈరోడ్‌లో "విడుదలై" అనే తమిళ పత్రికా సంపాదకుని, ప్రచురణ కర్తను 124 A సెక్షన్ (రాజద్రోహం) క్రిందను, 153 A. సెక్షన్ (వర్గవైషమ్యం) క్రిందను పోలీసులు ఎరస్టుచేశారని తెలుస్తోంది. అగస్టు 19 వ తేదీని ఆపత్రిక హిందీకి వ్యతిరేకంగా వ్యాసం ప్రకటించి నందుకే యీ ఎరస్టులు జరిగాయని పత్రికలు వ్రాస్తున్నాయి.

మన రాజధానిలో కాంగ్రెసు మంత్రులు అధికారానికి వచ్చాక 124 A. సెక్షన్ ప్రయోగించుట కిది రెండవసారి. మొదట బాట్లీవాలాను రాజద్రోహ నేరం క్రింద ఎరస్టుచేసి 6 నెలల శిక్ష విధించి, తరువాత ప్రజాందోళన ఫలితంగా విడుదల చేసిన విషయం ఎల్లరికీ తెలిసిన విషయమే. కాని బాట్లీవాలా కాంగ్రెసువాది, "విడుదలై" పత్రికా సంపాదక ప్రచురణ కర్తలు కాంగ్రెసు వ్యతిరేకులు. అయినప్పటికీ ఈ రెండు సెక్షన్ల క్రిందా వారిని ఎరస్టు చేయడం కాంగ్రెసు తీర్మానాలకు, నీతికి విరుద్ధం. ఎందువల్ల నంటే "నిరంకుశ శాసనాలను రద్దు చేయాలి" అని కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలోను, ఎన్నికలైన తరువాత సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, అ. భా. కాం. కమిటీలలోను, కరాచీ కాంగ్రెసులో ప్యాసైన ప్రాథమిక హక్కుల తీర్మానంలోనూ స్పష్టంగా తెలియజేయ బడిఉంది. సరిహద్దు రాష్ట్ర కాంగ్రెసు మంత్రివర్గం 124 A. 153 A. 144 క్రి. ప్రొ. కో. మొదలయిన నిరంకుశ శాసనాలను రద్దు చేయాలని తీర్మానిస్తే, అక్కడి గవర్నరు తీర్మానాన్ని త్రోసివేశాడు. మదరాసులో హిందీ ప్రతికూల వాదులపై క్రిమినల్ లా అమెండ్‌మెంటు చట్టాన్ని అమలు పరుస్తూన్న రాజాజీ మంత్రివర్గం యొక్క చర్యను దేశంలో నాలుగుమూలలా అందరూ ఖండిస్తున్నారు.

ఇప్పుడు 124A. 153 A. సెక్షన్లు కూడా రాజాజీ హిందీ ప్రతికూల వాదులపై ప్రయోగించాడు: కాంగ్రెసు ప్రణాళికను, తీర్మానాలను యీ విధంగా రాజాజీ మంటగలుపు తున్నాడు. ఏ శాసనాలను యిదివరలో గుక్క తిప్పుకోకుండా ఖండించామో ఆ శాసనాలనే యిప్పుడు ప్రయోగించడం వల్ల కాంగ్రెస్ సంస్థ గౌరవానికి తీరని కళంకం ఏర్పడుతోంది. సత్యమూర్తిగారు ఈ మధ్యనే మదరాసులో ఉపన్యసిస్తూ, "బ్రిటిషు నిరంకుశాధికారుల కంటె కాంగ్రెసువాదులే ఎక్కువ బాగా యీ దేశాన్ని పాలించగలరని నిరూపించుటకు" ఢిల్లీ అ. భా. కాంగ్రెసు కమిటీలో ఆమోదించ బడిన "పౌరస్వేచ్ఛ"కు సంబంధించిన తీర్మానం వల్ల స్పష్టపడ గలదని శెలవిచ్చారు. తీర్మానంపై ఈయన విమర్శ సరియైనదో కాదో తెలియదుగాని, మన రాజధానిలో రాజాజీ మంత్రివర్గం అవలంబిస్తూన్న విధానం సరిగ్గా యింతేనని స్పష్టపడగలదు. ఆనాడు, మధ్యంతర మంత్రివర్గాన్ని స్వీకరించి, "రాజుగారి పాలన" చెక్కు చెదరకుండా ఉండుటకే యిట్లు చేశానని సమర్థించుకో బోయిన సర్. కె. వి. రెడ్డినాయుడుగారిని ఎడతెరిపి లేకుండా విమర్శించిన రాజగోపాలాచారిగారే, నేడు సామ్రాజ్యవాదులచే సృష్టింపబడ్డ నిరంకుశ శాసనాలను అమలు పరుస్తున్నారంటే కాంగ్రెసు మంత్రివర్గాలు ఎంత హీనస్థితికి పాల్పడుతున్నాయో గోచరిస్తుంది. ఈ విపరీత వైఖరిని అరికట్టాలంటే, కాంగ్రెస్ కమిటీలు, ఇతర సామ్రాజ్య వ్యతిరేక శక్తులు ఏకమై, రాజాజీ మంత్రివర్గం యొక్క చర్య యెడల అసంతృప్తిని వెల్లడించాలి. ఈవిధంగా కాంగ్రెసు గౌరవాన్ని కాపాడాలి.

సంస్థానాలలో ప్రజా ఉద్యమ విజృంభణ

స్వదేశ సంస్థానాలలో నేడు రాక్షసపరిపాలన తాండవమాడుతోంది. తమ జన్మహక్కైన బాధ్యతాయుత పరిపాలనకై ధైర్యంగా నిలబడి ప్రచారంచేసినందుకు సంస్థాన ప్రజలు, జైళ్ళకు, లాఠీలకు, తుపాకులకు గురి అవుతున్నారు. తిరువనన్తపురం సంస్థానంలో యింతవరకు 8 సార్లు ప్రజలపై తుపాకులు కాల్చబడ్డాయి. అనేకమంది మరణించారు. ఇంకా యెక్కువమంది గాయపడ్డారు. అయినా ఉద్యమం ఆగిపోలేదు. నాయకులను ఎరస్టు చేశారు. ఉద్యమం ఇంకా తీవ్రమవుతోంది. రిజర్వు పోలీసులతోను, మిలిటరీ దళాలతోనూ నిండిన మోటారు లారీలకు అడ్డుగా ప్రజలు రాళ్ళను, చెట్లను గుట్టలుగా వేసి, గోతులు త్రవ్వి ఆటంకపరుస్తున్నారు. త్రివాండ్రంలో బయల్దేరి చెంగన్నూరు వస్తూన్న మిలిటరీ లారీ బోల్తాకొట్టినదని వార్తలు తెల్పుతున్నాయి. అల్లెప్పీనుండి బయల్దేరిన లారీపై ప్రజలు రాళ్ళు రువ్వగా ప్రయాణం చేస్తున్న సైనికులందరికీ గాయాలు తగిలినవట. వారిని ఆసుపత్రిలో చేర్చారట. ఇంకా అనేక స్థలాల్లో యీవిధంగా పోరాటాలు జరుగుతున్నాయని పత్రికలవల్ల తెలుస్తోంది. ఈ హింసాయుత పద్ధతులను గాంధిజీ కఠినంగా నిరశిస్తున్నాడు. "సత్య-అహింస సిద్ధాంతాలనుండి యేమాత్రం తప్పినా, ఉద్యమం ధ్వంసం కాక తప్ప"దని ఆయన స్టేట్‌మెంట్‌లో ఉంది. అక్కడక్కడ ప్రజలు హింసాయుత పద్ధతులు చేబట్టి యుండవచ్చును. కాని వారు జరుపుతూన్న పోరాటం, క్రూర, నిరంకుశ పరిపాలనపై ఘోర దౌర్జన్యవిధానంపై. తిరువాన్కూరు సంస్థానంలో నేడు "ఫేసిస్టు పరిపాలనాపద్ధతి (Regime of fascism) అమల్లో ఉన్నదని టాగూర్ మహాశయుడు చెప్పాడు. "దీనికి కారకు లెవరయినప్పటికీ, ఈతగాడు యెట్టి స్వభావాన్ని కలిగి యున్నప్పటికీ, ప్రభుత్వం అవలంబిస్తూన్న పద్ధతులు ఏమాత్రమూ సమర్థించ దగినవి కావు." అని టాగూర్ వ్రాశాడు. తర తరాలనుంచి బానిసత్వంలో క్రుమ్మగ్గి, యిప్పుడే తల ఎత్తిన సంస్థాన ప్రజా పోరాటం క్రొత్త రూపాలు దాల్చుతోంది.

చైనా ప్రజల నిశ్చయం

(5 వ పేజీ తరువాయి)

కలు సహితం దేశాభిమానంతో నిండి యున్నారు. ఇంటింటికీ వారు వెళ్ళి, చందాలు వసూలు చేసి, నగరానికి వస్తూ పోతూ ఉండే స్వాతంత్ర్య సైనికుల ఫలహారాలకు ఆ చందాలు ఖర్చు చేస్తారు.

గ్రామాలయందలి రైతులు యుద్ధంలో తామెందుకు పాల్గొనాలి అని అడగరు. ఏవిధంగా పాల్గొనాలి: అని అడుగుతారు. ఏవిధంగా పాల్గొనాలో తెలుసుకొంటున్నారు కూడ. ఉత్తర రాష్ట్రాలలో, రైతులు రైతు దళాలలో చేరి యుద్ధం చేస్తూంటే. మిలటరీ రోడ్లు వేయడం, రైలు రోడ్లు బాగుచేయడం మొదలైన దేశోపకారమైన పనులు చేస్తున్నారు. హాంగ్ కాంగ్-క్యాంటన్-హాంకో రైలు దారిని ధ్వంసం చేయడానికి జపాన్ యుద్ధ విమానాలు మాటి మాటికి బాంబులు విసురుతూ ఉంటే, వెంటనే ప్రక్కనున్న గ్రామస్థులు గడ్డపారలు మొదలైన సాధనాలతో అక్కడికి వెళ్ళి రైలుదారిని బాగుచేస్తారు. ఆ తరువాత ఇనుప సామగ్రితో ఇంజన్ వచ్చి, రైలు మార్గాన్ని సరిచేసి, తిరిగి వెళ్ళిపోతుంది. 'నేలలో ఒక్క గొయ్యి చేయడానికి 20,000 యెన్నులు ఖర్చు చేయాలి; కాని, దాన్ని పూడ్చడానికి చైనా దేశస్థులు 10 డాలర్లు ఖర్చు చేస్తే చాలు!' అంటూ ప్రజలు ఉల్లాసంతో రైలు మార్గాలను బాగుచేస్తారు.

కమ్యూనిష్టు సైనిక దళం

ఉత్తర రాష్ట్రాలలో, ఒక వైపు యుద్ధం జరుగుతూంటే, చుట్టుపక్క గ్రామాలకు కమ్యూనిష్టు సైనిక దళ సభ్యులు పోయి, ప్రచారం సాగిస్తారు. పెద్ద పెద్ద బహిరంగ సభలు చేస్తారు. ఒకనాడు 'షాన్సీ' రాష్ట్రములో ఒక గ్రామంలో జరిగిన బహిరంగ సభకు 20 మంది దేశ ద్రోహులయిన జపాన్ ప్రభుత్వ బానిసలను చేతులూ, కాళ్లూ కట్టి, తీసుకు వచ్చారు. వెంటనే వారిని కాల్చి వేయవలసినదని ప్రజలందరూ కేకలు వేశారు. కాని, సైన్యాధిపతియొక్క సలహాపై విడచి పెట్టారు. ఉద్రేకం ఆపుకోలేక, ఒక ధనిక భూస్వామి సభికుల మధ్యకు వచ్చి, సైన్యాధిపతిని సంబోధిస్తూ యీ విధంగా అన్నాడు: "అయ్యా, నా యింటిలోని ధనాన్ని, నా భూమినీ, నా యిద్దరు కొడుకుల్నీ, నన్నూ మీ సైన్యానికి స్వాధీనం చేస్తున్నాను. తీసుకోండి. ఎందువలనంటే, యీ బానిసల మాదిరిగా బ్రతకడం కంటే, యుద్ధం చేస్తూ చావడమే మంచిది."

భవిష్యత్తు

జపాన్ సామ్రాజ్య వాదుల దాడిని ఎదుర్కొంటూ గావిస్తూన్న యీ స్వాతంత్ర్య పోరాటంలో చైనా ప్రజలు చేస్తూన్న త్యాగం, పడుతూన్న బాధలు వర్ణింపనలవిగాదు. పట్టణాలు, పల్లెలు జపాన్ బాంబులకు గురియై, భగ్నం అవుతున్నాయి. శత్రు సేనలు దాడి సాగేటప్పుడు, పారిపోయేటప్పుడు అమాయక ప్రజల యిండ్లు తగలపెట్టి పోతున్నారు. అయినప్పటికీ, గత ఏప్రియల్ మాసంలో చంగ్-కై-షేక్ సతీమణి నాకు యీ క్రింది విధంగా వ్రాసింది:

'మీరు చైనా విడిచిపెట్టి వెళ్లిన తరువాత చైనా ప్రజల ఉత్సాహం ఎంతో యెక్కువైంది. మా మత బోధనలు ప్రజలు సహించగలిగేటట్లు చేస్తున్నాయి. ఏమాత్రమూ వారు ఫిర్యాదు చేయడం లేదు. మా సైనికులు పూర్వం కంటె ఎక్కువ ఉత్సాహంతో యుద్ధం చేస్తున్నారు. మా దేశాన్నుంచి జపాన్‌వారిని తరిమివేసే వరకూ నిద్రపోము అని వారు నిశ్చయించుకున్నారు.'

'ఏయుద్ధంలోనైనా విజయం మొట్టమొదట ఎవరికి ఎక్కువ తుపాకులు ఉంటాయో వారిది; కాని, చివర రోజుల్లో ఏపక్షానికి యెక్కువ పట్టుదల, సహన శక్తి ఉంటుందో దానికే విజయం నిశ్చయం.' అని చైనా ప్రజలు నేడు విశ్వసిస్తున్నారు.

ప్రపంచానికి చైనా నేర్పుతున్న పాఠం

ప్రజలకు, సైన్యాలకు పరస్పర స్నేహం, ప్రేమ ఏర్పడాలి!
జాతీయైక్యతయే స్వాతంత్ర్య రక్షణకు ఏకైక సాధన!

[మాసి—ఛన్.]

ఏనాడు, 1931 లో జపాన్ సామ్రాజ్య వాదులు చైనాపై దండెత్తారో, ఆనాటినుండే చీనా రక్షణ ప్రధాన కర్తవ్యం అయిపోయింది. అంతకు ముందు చైనాలో సాగుతూన్న అంతర్యుద్ధాన్ని ఆపుచేసి, కమ్యూనిస్టు సేనలకీ జాతీయ సేనలకీ సఖ్యత కుదిర్చి, జపానును ఎదుర్కో వలసిందని 1932 లో చీనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. చీనాలో వివిధ రాజకీయ పక్షాలు, ప్రజలు ఏకమై జపాన్‌వారి దండయాత్రను అడ్డుకొన వలసిందని, చీనాను రక్షించవలసిందనీ, పదే పదే ప్రజలను కమ్యూనిస్టులు హెచ్చరించారు ప్రకటనలే గాదు, కొమింటాంగ్ ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విన్నవించారు చీనా రెడ్ (కమ్యూనిస్టు సేనలు) ఆర్మీకి పేరు మారుస్తామన్నారు. సోవియట్ చీనా పేరు మారుస్తామన్నారు. కొమింటాంగ్‌కు కమ్యూనిస్టులకు మధ్య జరుగుతూన్న అంతర్యుద్ధాన్ని ఆపుచేయ వలసిందని. 1935 ఆగస్టులో ఒకమాటు, డిశంబరులో ఇంకోమాటు చీనా కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రభుత్వం కలసి ఒక ప్రకటన చేశాయి. తిరిగి 1936 మే నెలలో ఇంకొకటీ, ఆగస్టులో ఇంకో ప్రకటన చేశాయి.

చీనాలో జాతీయ ప్రజా తంత్రాన్ని ఏర్పాటు చేసి ఐక్యతను ఏర్పాటు చేయవలసిందని కోరుతూ తీర్మానం ఒకటి చీనా కమ్యూనిస్టు పార్టీ కొమింటాంగ్ ప్రభుత్వానికి పంపింది. ఈ విషయమై విపులంగా సంప్రదించుటకు రాయబారులను కూడా కమ్యూనిస్టులు పంపారు. ఆఖరికి 1936 ఆఖరున, సియాన్‌లో జంగ్-కై-షేక్ పట్టుబడ్డాడు. అప్పుడు కొమింటాంగ్ ప్రతినిధులకు కమ్యూనిస్టులకు ఒక రాజీ కుదిరింది. దీని ఫలితంగా సియాన్ సమస్య శాంతియుతంగా పరిష్కారం అయింది. ఇరు పక్షాలకూ మధ్య సాగుతూన్న యుద్ధం ఆగిపోయింది. ఈ రాజీయే ఐక్య సంఘటనకు పునాది అయింది.

1937 ఫిబ్రవరి 10 వ తేదీని కొమింటాంగ్ సమావేశం అయింది. చీనా కమ్యూనిస్టు పార్టీ యీ దిగువ విషయాలను తంతిపూర్వకంగా కొమింటాంగ్‌కు తెలియపర్చింది. "అంతర్యుద్ధం ఆపు చేస్తామని వాగ్దానం ఇవ్వాలి. ప్రజాతంత్ర హక్కు లందరికీ ఏర్పాటుచేయాలి, ప్రజా ప్రతినిధి సభను ఏర్పరచాలి. జపానును ఎదుర్కోడానికి అతి త్వరితంగా సన్నాహాలు పూర్తిచేయాలి. ప్రజల ఆర్థిక స్థితిని బాగు చేయాలి. ఇవి కొమింటాంగ్ ప్రభుత్వం నెరవేరిస్తే రెడ్ ఆర్మీకి, సోవియట్ చీనాకి, పేరు మార్చి, ఆ ప్రాంతాలన్నిటిలోనూ ప్రజాతంత్ర విధానం ఏర్పాటుచేసి, భూములను వశం చేసుకోవడం ఆపుచేస్తాం అని కమ్యూనిస్టులు వాగ్దానం చేశారు." ఇదిగాక, రాజకీయ ఖైదీల విడుదలనుగూర్చి, ప్రజా ఉద్యమాన్ని పెంపొందించడాన్ని గూర్చి అవలంబించ వలసిన కార్యక్రమాన్ని గురించి అనేక సూచనలు చేశారు.

వాగ్దాన ప్రకారం కమ్యూనిస్టులు, రెడ్ ఆర్మీ పేరు మార్చారు. సోవియట్ చైనా పేరుమార్చారు. అప్పటికే పీపింగ్ టీన్‌స్టీన్‌లు జపాన్ వశమయాయి. యుద్ధరంగం అంతా చాలా భీకరంగా వుంది. కొమింటాంగ్‌కి కమ్యూనిస్టులకి ఐక్యతను గురించి జూలై 4 వ తేదీని కమ్యూనిస్టులు ఒక ప్రకటన చేశారు. 15 వ తేదీని కొమింటాంగ్ ప్రభుత్వానికి అందజేశారు. దీనితోపాటు రాజీ షరతులు మాట్లాడి వచ్చేటందుకు కొందరు రాయబారులను కూడా కమ్యూనిస్టులు పంపారు. జంగ్-కై-షేక్ సెప్టెంబరు 22 వ తేదీని ఒక ప్రకటన చేసి కమ్యూనిస్టు పార్టీని ఆమోదించారు. ఈ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీ జాతీయైక్యతను గురించి ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటన ఇరుపక్షాలనేగాక, చీనాజాతి నంతటినీ ఏకం చేసింది. ఈఐక్యతతో చీనా విప్లవంలో నూతన శకం ప్రారంభమయింది. చీనా రక్షణకి అమోఘమైన సావకాశాన్ని యీఘటన కల్పించింది. ఈ ఐక్యత ఫలితాలు అమోఘం. ఉత్కృష్టం.

1925 అనంతరం చీనా కమ్యూనిస్టు పార్టీకి కొమింటాంగ్‌కి మధ్యనున్న సంబంధాలవల్ల చీనా విప్లవోద్యమంలో చక్కని ఫలితాలు కలిగాయి. 1925-27 లో ఈ రెండు పక్షాలు కలసి, ఒక నిర్ణీత కార్యక్రమం ప్రకారం చీనా ప్రజల్ని నడిపించాయి. దీనివల్ల చీనా స్వాతంత్ర్యం ప్రజల సౌఖ్యం ప్రజా తంత్ర స్థాపన మొదలయిన హక్కులకై పోరాటం రెండు మూడు సంవత్సరాలలో చాలా విజయవంతంగా జరిగింది. ఈ హక్కులకై 40 సంవత్సరాలు సన్‌యట్‌సేన్ హోరాహోరి పోరాడి సఫలం గాకుండానే మరణించాడు. పై ఐక్యత ఫలితంగా నాన్‌కింగ్‌లో విప్లవ సేనల కేంద్రం ఏర్పాటు అయింది. ఉత్తర దేశంపై దండయాత్ర విజయవంతం అయింది. ఈ స్థితిలో విప్లవ పోరాటాన్ని ముందుకి సాగించడానికి ఇష్టంలేక విప్లవం అంతిమదశలోకి వస్తూంటే, కొందరు జాతీయైక్య సంఘటనను భగ్నం చేశారు. దానితో ఆ విప్లవం భగ్నమైంది, అధికారాన్ని ఒకేవర్గం, ఒకేపార్టీ స్వాధీనం చేసుకొన్నది. కొమింటాంగ్‌కి కమ్యూనిస్టు పార్టీకి మధ్య పెద్ద అఘాతం ఏర్పడింది. ప్రజలకీ ప్రభుత్వానికీ మధ్యకూడా చీలిక కలిగింది. పైనుండివిరోధులు యీసందుచూచుకొని చీనాపై దండెత్తారు ఇప్పుడు మళ్ళీ యీరెండు పక్షాలూ కలిశాయి. ఈ ఐక్యత తాత్కాలికమేనని తలుస్తూ, కొందరు ఇందలి ఉత్కృష్టతను గుర్తించడం లేదు. ఐనా చీనా విప్లవోద్యమములోనూ, కష్టాలలోనుండి బయట పడడంలో యీ ఐక్యత ప్రధాన పాత్రను వహించి తీరుతుంది.

ఇదేగాక ఇంకా ఎన్నో కొత్త ఘటనలు జరిగాయి. చీనా కమ్యూనిస్టు పార్టీ సూచించిన ఐక్య సంఘటనను ప్రజలంతా అంగీకరించారు. సియాన్ సమస్య శాంతియుతంగా పరిష్కారం అయి ఇరుపక్షాలకీ సంధి కుదరగానే, వివిధ రాజకీయ పక్షాలు, సంఘాలు, ముఠాలు, సేనలు, అన్నీ ఏకమైపోయాయి. జపానును ఎదుర్కోడానికి ఈ బలం చాలకపోయినా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలకీ మధ్య సంబంధం చాలా బాగుపడింది. అప్పుడే జపాన్ సేనలకు చీనా తీవ్రంగా అడ్డుతగలడం ప్రారంభమైంది. ఇది చాలదు. జపానును ఎదుర్కోడానికి, ప్రజలందరూ కూడా తయారై, పోరాటంలో పాల్గోవాలి. జాతీయైక్యత లేకపోతే ఇది సాధ్యం కానేకాదు. మంచూరియాను మ్రింగివేసిన జపాన్ బందిపోట్లు నేడు అడుగుముక్క తల క్రిందు లౌతున్నారు. రోజుకి 2, 2½ కోట్ల యన్నులు యుద్ధం కోసం ఖర్చు పెడుతున్నారు. ఇల్లా ఒక సంవత్సరం యుద్ధం జరిగితే జపాన్ ప్రభుత్వానికి వచ్చే రివెన్యూ కంటె 120 కోట్ల యన్నులు ఎక్కువ ఖర్చు పెట్టవలసి వస్తుంది. జపాన్ ధనమంతా చెల్లాచెదరై పోతుంది. ఈ ఐక్యతకి జాతీయంగానే కాకుండా అంతర్జాతీయ ప్రాముఖ్యత కూడ ఉంది. చీనా కమ్యూనిస్టు పార్టీ ప్రోద్బలం నల్ల ఏర్పడ్డ జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటనకి వివిధ దేశాలలోని, కార్మిక, కర్షకులు, కమ్యూనిస్టు పార్టీలు బ్రహ్మాండమైన సహాయాన్ని చేస్తున్నాయి. చీనా ప్రజల ఐక్యత యొక్క పలుకుబడి మూల మూలలా వ్యాపించింది. దీనినంతా చూస్తే, చీనా కొమింటాంగ్ కమ్యూనిస్టు పార్టీల ఐక్యత వల్ల కలిగిన ప్రజా విజృంభణ, చీనా నుండి జపాన్‌వారిని తరిమివేసి ప్రజాతంత్రముతో విరాజిల్లుతూ ఐక్య స్వతంత్ర్య చీనా స్థాపన అయి తీరుతుందని వేరే చెప్పాలా?

నిర్దిష్టమై బలవత్తరమైన ఐక్య సంఘటన అంటే ఏమిటి?

ఈ కర్తవ్యం నెరవేరాలంటే చీనాలోని జపాన్ వ్యతిరేక శక్తులన్నిటి మధ్య ఐక్యత ఏర్పడాలి. అది పెంపొందాలి. బలిష్ఠం గావాలి. అసలు ఐక్య సంఘటన అంటే కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్టు పార్టీల సఖ్యతయేనా? అవి యీ సంఘటనలోని భాగాలు మాత్రమే. ఐక్య సంఘటన చీనా ప్రజల మధ్య ఏర్పడాలి. కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్టు పార్టీలు యీ ప్రజా సంఘటనకి నాయకమణులు మాత్రమే. ఇప్పుడేర్పడిన ఐక్యత రెండు పార్టీల మధ్య మాత్రమే. ప్రజలందరూ ఇంకా ఏకం కాలేదు-వీరందరిని ఏకం చేయాలి. వారికి ఆయుధాలివ్వాలి జపానును ఎదిరించుటకు పని చేసేటట్లు చేయాలి. ఇది చాలా దుర్లభమైన సమస్య. ఉత్తర రంగంలోనూ, కియాంగ్‌సూ, చెకియాంగ్ రంగాల్లోనూ మేము అనేకచోట్ల ఓడిపోయాం. ఈ లోపాలను ఎలా దిద్దుకోవాలి అనేదే సమస్య. సన్‌యట్‌సేన్ యొక్క ఆశయాన్ని నెరవేర్చిననాడే యీ చిక్కులన్నీ విడిపోతాయి. ఆ మహానుభావుడు మరణించే ముందు ఒకటే అభిప్రాయాన్ని వెల్లడించాడు. "నా నలభయి ఏళ్ళ అనుభవాన్నీ బట్టి చూస్తే చీనా దేశీయులందరూ పాల్గొంటేనే గాని చీనా విప్లవం సంపూర్ణం గాదు" అన్నాడాయన. అయితే యీ ఆశయాన్ని ఇట్టి క్లిష్ట పరిస్థితుల్లో ఎందుకు నెరవేర్చడం లేదు? చీనాలో నిర్బంధ విధానం, ప్రభుత్వ ఆంక్షల ద్వారా ప్రజలలో కావలసిన ఉత్సాహాన్ని పురికొల్పలేము. ప్రజల్ని పురికొల్పి సాయుధ పోరాటంలోకి ప్రజలను తీసుకొని పోతేనేగాని. మేము నెగ్గడం కష్టమనీ, లేకపోతే అబిసీనీయాకి పట్టినగతే చీనాకి కూడా పడుతుందనీ కొమింటాంగ్ సోదరులకు మేము తెలియపరిచాం. మేమే కాదు, దేశీయులు కొందరు, కొమింటాంగ్‌లోని కొందరు సోదరులు కూడా యిల్లాగే చెప్పారు. కాని, దురదృష్టవశాత్తు మార్పులేమీ జరుగలేదు. అందుచే ప్రభుత్వమూ సైన్యాలూ ప్రజలకు దూరమయాయి. సేనాధిపతులకూ సేనలకూ, దూరమయింది. ఈ లోపాలను దిద్దుకొని ఐక్య సంఘటనలోనికి ప్రజల నందరినీ తీసుకొని రాకపోయినచో యుద్ధ రంగాలలో కష్టాలు తగ్గవు సరిగదా, ఇంకా హెచ్చుతాయి కూడా.

నిజంగా యీనాడున్న పరిస్థితు లేమిటి? సియాన్ ఘటనల అనంతరం చీనాలో అంతర్యుద్ధం మాత్రం ఆగిపోయింది. ఇరుపక్షాలూ కలసి జపానును ఎదిరిస్తున్నాయి. ఇది మినహా చీనా రాజకీయ కార్యక్రమంలోగాని, ఆర్థిక సమస్యలలోగాని, విద్యా విధానంలోగాని, మరి ఇతర విషయాలలోగాని ఏమీ మార్పురాలేదు. పది ఏళ్ళనాడు ఎట్లాగుందో ఇప్పుడూ అల్లాగే వుంది.

జపానుతో యుద్ధము సాగుతోంది. ప్రజలందరూ ఏకమైతేనేగాని నెగ్గేమార్గం లేదు. ప్రజల్నందరినీ ఒక రాజకీయ కార్యక్రమమే ఏకం చేస్తుంది. ఆ ఐక్యతను బలపరుస్తుంది. యీ బలం చీనాకు విజయాన్ని ప్రసాదిస్తుంది. పాత పద్ధతిని మానివేయాలి. అందుకు మేము వ్యతిరేకులం. ప్రజలపై నున్న నిర్బంధాన్ని రద్దుచేయాలి. ఇప్పుడే యీ యుద్ధంలోకి ప్రజలనందరినీ తీసుకువచ్చే యేర్పాట్లు చేయగలుగుతాం.

సన్‌యట్‌సేన్ ఆశయాలు. కమ్యూనిస్టు పార్టీ సూచనలు.

సన్‌యట్‌సేన్ నిర్వచించిన మూడు సూత్రాలపై మాతృదేశ రక్షణకై కమ్యూనిస్టు పార్టీ ఆగస్టు 1937 లో కొన్ని సూచనలు చేసింది.

"సన్‌యట్‌సేన్ నిర్వచించిన మూడు ప్రధాన సూత్రాలను నేడు చీనాలో అమలు

జరుపుట అత్యవసరం. అందుకై తీవ్రముగా కృషిచేయాలి" అని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది, కమ్యూనిస్టు లేమిటి; సన్‌యట్‌సేన్ ఆశయాలను అమలు జరపడానికి పూనుకోవడ మేమిటి? రెండింటికి ఎంతో వ్యత్యాసం వుందే, అని కొందరు అనుమానించ వచ్చు, ఈ అనుమానాన్ని వెలిబుచ్చుతూ మూ-చెన్లీ అనే ఆయన, ఈ రెండు ఆశయాలు పరస్పర విరుద్ధం అని వ్రాశాడు. అవి కేవలం మాట వరసకనే మాటలే. కమ్యూనిస్టులు కమ్యూనిస్టు సమాజం ఏర్పాటు చేసేటందుకే పని చేస్తారు. కాని యీనాడు సాగించేది జాతీయ స్వాతంత్ర్య పోరాటం. జాతీయ ప్రజాస్వామిక విప్లవం. అందుకనే నేడు కమ్యూనిస్టులు, జపాన్ వ్యతిరేక జాతీయ సంఘటన ఏర్పాటు చేయాలనీ, చీనాలో ఐక్య ప్రజాతంత్ర పరిపాలన ఏర్పాటు చేయాలనీ ప్రకటించారు. సన్‌యట్‌సేన్ నిర్వచించిన మూడు సూత్రాలను అమలు జరిపేటందుకు పూనుకోవాలని 10 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు కొమింటాంగ్ పార్టీలు కలిసి తీర్మానించుకొన్నాయి. 1925-27 లో ఇరుపక్షాలవారు కూడా ఆ ప్రకారంగా నడుచుకొన్నారు. కాని దురదృష్ట వశాత్తు 1927 లో యీ ఐక్య సంఘటన భగ్నము అయిపోగానే ఆ ప్రయత్నాలన్నీ మొండది పోయాయి.

ఈ పది సంవత్సరాలూ కమ్యూనిస్టులు ఈ సూత్రాలలోని విప్లవ స్వభావాన్ని అమలు జరుపడానికే కృషి చేశారు. ఒక్కక్షణం కూడా సామ్రాజ్య వాదులతో పోరాడకుండ వారు విశ్రాంతి తీసుకోలేదు. ఇది నిజమైన జాతీయత కాదా? ప్రజా ప్రతినిధులు గల సోవియట్‌లు గాదా? ప్రజాతంత్ర విధానమే. ఇక కర్షక విప్లవం ప్రజాసౌఖ్యం కోసం కాదనేవారెవరూ?

అయితే కమ్యూనిస్టులు, సోవియట్‌లు ఏర్పాటు చేయడం, భూములను వశం చేసుకోవడం ఎందుకు మానేశారు? అది తప్పని తలంచి కాదు. జపాన్ సామ్రాజ్యవాదుల దండయాత్రి వలన దేశములోని వివిధ వర్గాల మధ్య నున్న సంబంధంమారింది. జపాన్‌నుఎదుర్కొని పోరాడడానికి అందరూ ఏకంకావలని వచ్చింది. ఇదే సమయంలో, ఇతర దేశాలలో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడేటందుకు ప్రజాతంత్రవాదు లందరూ ఏకమవడం ప్రారంభించారు. చీనాలో నేడు జాతీయ ప్రజాతంత్ర ఐక్యసంఘటన అవుసరం. అందుచే నేడు కమ్యూనిస్టులు, సోవియట్ స్థాపన అనే నినాదానికి బదులు, "ప్రజాతంత్ర పరిపాలన స్థాపన కావాలి" అనే నినాదాన్ని ఇచ్చారు.

ఇక కర్షక విప్లవం సంగతి చూద్దాం. "వ్యవసాయం చేసే వాళ్ళకే భూమి ఉండాలి" అని వెనుక సన్‌యట్‌సేన్ ఉద్ఘోషించాడు. నేడు జపాన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగాజరిగే పోరాటంలోకి ప్రజలను ఎక్కువగా, ఇంకా ముందుకు తీసుకుపోవడానికై భూములను వశం చేసుకోడం మానేశాం. ఇంత మాత్రాన చీనాలో కర్షక సమస్యంతా నెరవేరిందని అర్థం కానే కాదు. తాత్కాలికంగా మా విధానాన్ని ఆపుచేసేటందుకు గల కారణాన్ని స్పష్టంగా మేం చెప్పనే చెప్పాం. మార్క్సు సిద్ధాంతాలను ఆధారంగా తీసుకొని చీనా కమ్యూనిస్టులు ప్రథమ దశలోని జాతీయైక్యతకై కార్యక్రమాన్ని సూచించారు. అది, సన్‌యట్‌సేన్ యొక్క మూడు సూత్రాలు-ఒకవంక జపాన్ సామ్రాజ్య వాదులు మా దేశాన్ని ఆక్రమించి మమ్మల్ని నాశనం చేయాలని చూస్తూన్న ఈ సమయంలో స్వదేశ స్వాతంత్ర్య రక్షణకై ఏకైక సాధనమైన జాతీయ ఐక్య సంఘటనా స్థాపనకై పూనుకోవలసిందని కమ్యూనిస్టులు కోరారు, సన్‌యట్‌సేన్ యొక్క మూడు సూత్రాలనీ కమ్యూనిస్టులు నమ్ముతున్నారా? లేదా? వారు వాటిని అమలు జరుపుతారా? లేదా? అనేది ప్రశ్నే కాదు. ఆ సూత్రాలలో నున్న భావాన్ని దేశమంతటా అమలు జరపాలి. ఇందులో ఏమీ ఆలస్యం ఉండకూడదు. ఈవిధంగానే కమ్యూనిస్టులు ఆగస్టు 15 వ తేదీని గావించిన ప్రకటనలోని విమోచనా కార్యక్రమంలో 10 విషయాలుగా ప్రకటించారు. ఇవి మార్క్సు సిద్ధాంతాన్ననుసరించి సన్‌యట్‌సేన్ ఆశయాలందటి విప్లవ స్వభావాన్ని కలిగి ఉన్నాయి. ఇది అసలు కార్యక్రమంలో ఓనమాలు వంటిదే. దీన్ని అమలు జరుపడంమీదనే,చీనా భవిష్యత్తు విమోచన ఆధారపడి ఉన్నాయి.

ఈ కార్యక్రమాన్ని అమలు జరుపాలంటే చీనాలో అధికారం గల పెద్ద రాజకీయ పక్షమైన కొమింటాంగ్ యొక్క అనుమతి లేనిదే దుర్లభం. కొమింటాంగ్‌లో నిజాయితీ అయిన వారందరూ, వారి నాయకులూ దీనిని అమలు జరుపుతారని మా దృఢ విశ్వాసం. లేకపోతే సన్‌యట్‌సేన్ యొక్క మూడు సూత్రాలు నామమాత్రంగానే పడి ఉంటాయి. అందులోని విప్లవ స్వభావాన్ని అమలు జరుపలేక పోతాము. అందుచే జపాన్‌వారిని ఓడించ లేకపోతాం. దానితో చీనా జాతి నాశనం తప్పదు. కొమింటాంగ్ సభ్యులు నాయకులు యీ స్థితికి కారకులు కాకూడదు. ప్రజలిందుకు అసలే ఒప్పుకోరు. సెప్టెంబరు 23 వ తేదీని జంగ్-కై-షేక్ ఒక సందేశంలో "మా విప్లవం వ్యక్తిగత అభిమానాల కోసం, వ్యక్తిగత ప్రగల్భాల కోసం సాగటం లేదు. మూడు సూత్రాల స్థాపన కోసమే సాగుతోంది. ఇప్పుడు సమస్య చావు బ్రతుకుల మీద ఉంది. వెనుకటివన్నీ తవ్వుకోటానికిది సమయం కాదు. దేశంలోని ప్రజలందరూ కోలుకోడానికి, దేశ స్వాతంత్ర్యాన్ని జీవాన్ని కాపాడేటందుకు ప్రజల నందరినీ ఏకం చేయడానికి శాయశక్తులా ప్రతి అవకాశాన్ని వినియోగించాలి." అని ప్రకటించాడు. ఇది నిజం. వెనుక ఎప్పుడో ఉన్న వ్యక్తి ద్వేషాలని, ముఠా ద్వేషాలని, అన్నిటినీ వెనక్కి నెట్టేసి, ప్రస్తుత కర్తవ్యం "మూడు సూత్రాలుకు అనుగుణంగా ఉన్న విప్లవ కార్యక్రమాన్ని" అమలు జరుపడానికి అందరం పూనుకోవాలి. చిక్కులలో నుండి చీనా బయట పడడానికి ఇదే మార్గం. ఆలస్యం అమృతం విషం.

కేవలం జాతీయ ప్రజాతంత్ర ఐక్య సంఘటనా ప్రభుత్వం ఉన్నంత మాత్రాన ఈ కార్యక్రమం నెరవేరదు. సైన్యాలు వెనుకటి లాగనే ఉన్నాయి. మార్పేమీ రాలేదు. సేనాధి పతులకు సైనికులకు సంబంధం లేదు. సేనలకీ ప్రజలకీ సంబంధం లేదు. ఈ స్థితిలో జపాన్ సేనలను ఓడించటం చాలా కష్టం. ఈనాడు సేనలు యుద్ధరంగంలో నిలచి పోట్లాడుతూ తమ పవిత్ర కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాయి. వారిని ప్రశంసించి తీరుతాము. సైన్యాల నిర్మాణంలోనే లోపం ఉండటం వల్ల జపాన్ దండును నాశనం చేసి సన్‌యట్‌సేన్ మూడు సూత్రాలను అమలు జరుప గలిగినంత శక్తివంతంగా లేవు. గత మాసాలలోని యుద్ధంలో నేర్చుకొన్న ముఖ్యమైన గుణపాఠం ఇది. "సైనికులకి సేనాధిపతులకి సంబంధం, అన్యోన్యత, బాగా వృద్ధిపొందాలి; సేనలకీ ప్రజలకీ పరస్పర స్నేహం, ప్రేమ ఏర్పడాలి." కాని ప్రస్తుతమున్న నిర్మాణం దీనికి విరుద్ధంగా ఉంది, సైనికులు నాయకుల ఆజ్ఞానుసారంగానే ప్రవర్తిస్తున్నారు. సేనాధిపతులు కూడా ప్రభుత్వాజ్ఞలకు అనుకూలంగానే ఉన్నారు. సాహసంతోనే అందరూ పని చేస్తున్నారు కాని ఈ పని ఇంకా చురుకుగా జరగాలి. సైనికులు నాయకులు కూడా ఈ చురుకుతనం అలవరచుకోవాలి. ప్రస్తుతం సేనల నిర్మాణం దీనికి అడ్డం తగులుతోంది. అందుచేత ఆ నిర్మాణం మారాలి. ఈ మార్పు కోసం ప్రస్తుతం జరిగే యుద్ధం ఏమాత్రం ఆపుచేయ కూడదు. ఒక మూలనుండి యుద్ధం జరుగుతూనూ ఉండాలి. ఇంకొక మూలనుండి యీ నిర్మాణం, మారుతూనూ ఉండాలి.

ఈ మార్పును తీసుకురావాలంటే సేనలలో రాజకీయ ప్రబోధం జరగాలి. తామెందుకు ఎవరితో పోట్లాడుతున్నామో సైనికులందరూ తెలుసుకోవాలి. వారి రాజకీయ ఉత్సాహం వృద్ధి కావించాలి. 1925—27 లో విప్లవం సాగినప్పుడు సేనా నాయకులకీ సేనలకీ మధ్యను, సైనికులకీ ప్రజలకీ మధ్యను చాల చక్కని సంబంధం ఉండేది. ఆనాటి విప్లవ స్వభావాన్ని మళ్ళీ నేడు ఏర్పాటు చేయాలి. స్పెయిన్ ప్రభుత్వం సాగిస్తూన్న పోరాటాన్ని చూచి మేం నేర్చుకోవలసిన వెన్నో విషయాలున్నాయి. స్పెయిన్ ఎంతో క్లిష్టమైన సమయంలో పని చేయవలసి వచ్చింది. అప్పటికే ఇంత విజయవంతంగా నిలబడ్డారు. చీనాలో అంతకంటె చాలా అనుకూలమైన పరిస్థితులే ఉన్నాయి. గాని నిక్కచ్చి అయిన ఐక్య సంఘటన ఇంకా ఏర్పడక పోవడంచేతను, కొత్త పంథాలో సైనికుల సంఖ్యను బలాన్ని తీవ్రతను, వృద్ధి పొందించుటకు, విప్లవ కార్యక్రమాన్ని అమలు జరుపుటకును, శక్తివంతమైన ప్రభుత్వం లేక పోవడంచేతనూ చీనా వెనుకాడుతోంది. చీనా ఈ లోపాన్ని దిద్దుకోవాలి. జపాన్ వ్యతిరేక పోరాటంలో చీనా రెడ్ ఆర్మీ యొక్క పాత్ర కొద్ది మాత్రమే. ఇప్పుడే జయాన్ని సమకూర్చ గలిగినంతగా పని చేయలేక పోతోంది. కాని వారిలోనున్న రాజకీయ చైతన్యం నిర్మాణ విధానం, ఈ రెండు విషయాలలోనూ వారు గుర్తించే బాధ్యతలు నిజంగా ఆదర్శప్రాయమైనవి. ప్రతి సైనికదళమూ అలవరుచుకు తీరాలి. నిజంగా రెడ్ ఆర్మీ ఇంత ఆదర్శప్రాయమైన స్థితిలోకి ఒక్కపూటలో వచ్చిందా? దానినెంతో మార్పు చేస్తేనే ఈనాడు ఈ స్థితికి రెడ్ ఆర్మీ రాగలిగింది. సైనికులకీ, నాయకులకీ మధ్య స్నేహం. ప్రజలకీ, సేనలకీ మధ్య సంబంధం ఏర్పాటుచేశాం. అల్లాగే తంటాలు పడి తక్కిన సైనికదళాలను కూడా మార్పు చేయాలి.

నేడు మాతృదేశ రక్షణకై చీనాలో కొమింటాంగ్ సోదరులతో కలసి మేం పోట్లాడుతున్నాం. మా విధిని నెరవేర్చు కొంటున్నాం.

ఈకృషి కించిన్మాత్రమే. జాతీయ ఐక్య సంఘటన ఇంకా వృద్ధికావాలి. తేజోవంతం కావాలి. బలవత్తరం కావాలి. సమిష్టిగా కార్యక్రమం నెరవేర్చడానికి పూనుకోవాలి. రాజకీయ నిర్మాణాన్ని సైనిక నిర్మాణాన్ని మార్చడానికి పూనుకోవాలి, ఇది ఈనాటి ప్రధాన కర్తవ్యం. సన్‌యట్‌సేన్ యీ మార్పులను తీసుకురావడానికే ప్రయత్నాలుచేసి అప్పుడు పునాదులు వేశాడు. దాని ఫలితంగానే గత విప్లవ పోరాటం సాగింది. నేడు బాధ్యత అందరిపైనా పడింది. ఇది ఇప్పుడు అనవసరం అని తోసివేయకుండా, అమలు జరిపేటందుకు కొమింటాంగ్గ పూనుకొంటుందని ఆశిస్తున్నాం. జంగ్-కై-షేక్‌యే స్వయంగా యీ మార్పులను చేయడానికి పూనుకుంటే చాలా బాగుంటుంది.

నేడు చీనా బ్రతుకంతా ఒడుదుడుకుల్లో ఉంది. ఇందులో నుండి గట్టెక్కుటకు చీనా ప్రజల నందరినీ ఏకం చేసేటందుకు ఆధారభూతమైన, కమ్యూనిస్టు పార్టీ కొమింటాంగుల ఐక్యతకై, చీనా స్వాతంత్ర్యం కోరే ప్రతి సైనికుడు కూడా పూనుకోవాలి. జపాన్ సామ్రాజ్యవాదులను చీనానుండి తరిమివేయాలి, పైన చెప్పిన కొద్ది మార్పులను చేసితీరాలి. ఇదే ఇప్పుడు చీనా విప్లవం యొక్క కర్తవ్యం.

ఇవి నెరవేర్చిననాడే జపాన్ సామ్రాజ్యవాదాన్ని పారద్రోల గలుగుతాం. అందుకై ప్రతి అవకాశాన్ని వినియోగించుకు తీరుతాము.

సవరణలు

గత వారము సంపాదకీయములో ఛాంబర్లేనుకు ముందు ఈడెను ప్రధాని అను అర్థము వచ్చేటట్లు వ్రాయబడింది. ఛాంబర్లేనుకు ముందు ప్రధాని బాల్డ్విను. ఈడెను కేవలము విదేశాంగ మంత్రి మాత్రమే. ముసోలినీ హిట్లరుల స్నేహము వాంఛించి, ఈడెనుచే రాజీనామా నిప్పించాడు ఛాంబర్లేను.

"పరిపాలనా విధానంలో జోక్యం" అను తీర్మానము అ. భా. కాం, కమిటీచే అంగీకరించబడినట్లు ప్రకటించబడింది. వర్కింగుకమిటీ అతివాదు లందరూ లేచిపోయిన పిమ్మట దీనిని ఉపపాదించనే లేదు.

పుట 8. మూడవ కాలం చివర డాక్టరు అహమ్మదు సవరణను వర్కింగు కమిటీ ఒప్పుకొన్నది అని ఉంది. ఒప్పుకో లేదు ఒప్పుకోనందునే దత్తు మజుందారు ఒక ప్రకటన చేయాలని వచ్చింది, అతివాదులు వెళ్ళిపోవలసి వచ్చింది.

ఈ తప్పులు పడినందులకు పాఠకులను క్షమాపణ గోరుతున్నాము.—(సంపాదకుడు)

అటవీ చట్టంలో తీవ్రమైన మార్పులు కావాలి.



అఖిల భారత రైతు సంఘ తీర్మానాలు.

23-9-38, 24-9-38 తేదీలలో ఢిల్లీలో సమావేశమైన అఖిల భారత రైతు సంఘ కార్యనిర్వాహక వర్గంలో అనేక తీర్మానాలు చేయబడ్డాయి; వాటిలో యీ క్రిందివి ముఖ్యమైనవి:

అడవి హక్కులు

1. ఫారెస్టు చట్టాలలో తీవ్రమైన మార్పులు తీసుకొని వచ్చి దుర్మార్గులైన ఫారెస్టు ఉద్యోగస్థుల బాధల నుండి రైతులను కాపాడుటకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకూ పూనుకొనకపోవడం యీ కమిటీవారికి ఆశాభంగం కలిగిస్తోంది. పుల్లరి రేట్లను రద్దు చేయుట; అడవులలో కలప, కట్టె మొదలైన సరకు తెచ్చుకొనుటకు సాంప్రదాయంగా చిరకాలము నుండీ రైతు లనుభవిస్తూన్న సాముదాయక హక్కు తిరిగి వారికి యిచ్చుట; కొండజాతి ప్రజలపై జరుగుతూన్న దౌర్జన్యాలను అరికట్టుట; వెట్టి చాకిరిని తక్షణమే శిక్షార్హము చేయుట—ఈ పనులు త్వరలో చేయకపోతే, అటవీ సత్యాగ్రహం ప్రారంభించుటకు అనేక రైతు సంఘాలు పూనుకొనుననియూ, ఈఉద్యమానికి అ. భా. రైతు సంఘంవారు సహాయపడుదురనియు రాష్ట్ర ప్రభుత్వాలను యీకమిటీవారు హెచ్చరించుచున్నారు. ఆవిధంగా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోర్కెలను మన్నించకపోతే, రాష్ట్ర రైతు సంఘాలు యిప్పటినుంచీ అటవీ సత్యాగ్రహం ప్రారంభించుటకు తగిన సన్నాహాలన్నీ చేయవలసినదని యీ కమిటీవారు కోరుచున్నారు.

భూమి శిస్తు

2. గత 18 మాసములలో, అనగా రాష్ట్ర శాసన సభలకు భూమిశిస్తు బాధపై పెత్తనం వచ్చినప్పటి నుంచీ, కాంగ్రెసు మంత్రివర్గాలు' ఇతర మంత్రివర్గాలు భూమి శిస్తు విధానంలో మార్పు లేవీ తీసుకొని రాక పోగా పూర్తియైన నిర్లక్ష్యభావాన్ని కనుపరచినందుకు యీ కమిటీవారు మిక్కిలి ఆందోళన పడుచున్నారు. వచ్చే ఆదాయ వ్యయ పట్టికను శాసన సభలో ప్రవేశపెట్టి వప్పుడుగాని, అంతకు పూర్వంగాని యీ మంత్రివర్గాలు స్పష్టమయిన మార్పులు ఏ వేవి చేయదలచుకొన్నదీ, ముఖ్యంగా, చిన్న రైతులకు భూమిశిస్తు లేకుండాను, పెద్ద రైతులకు వారి ఆదాయముపై పన్ను కట్టే విధానమును ప్రవేశ పెట్టవలెనని యీ కమిటీవారు కోరుచున్నారు.

సత్యాగ్రహ పోరాటాలు

3. ఆంధ్రరాష్ట్రంలో చిన్నేల మొదలైన ప్రదేశాలలోను, బీహారు, సంయుక్త పరగణాలలోను, సరిహద్దు రాష్ట్రంలోను, బరోడా సంస్థానంలో లావెట్ అనే ప్రదేశంలోను వందలాది రైతులను జమీందార్లు వారివారి భూముల నుండి తరుముటకు అనేక దౌర్జన్యాలు చేస్తూంటే, రైతులు తమ భూములు విడిచిపెట్టక, కుటుంబాలతో సహా లాఠీలకు, జైళ్ళకు, తుపాకి గుండ్లకు గురియై, ధైర్య సాహసములతో సాగిస్తూన్న సత్యాగ్రహ పోరాటాల యెడల ఈ కమిటీవారు తమ సంతసమును తెలియజేయు చున్నారు.

కరవులు

4. బెంగాల్, బీహార్, యు. పి., ఒరిస్సా రాష్ట్రాలలో వ్యాపించియున్న వరదలవల్లను, పంజాబ్, బికనీర్, ఆంధ్ర, గుజరాత్, ఢిల్లీ, సి. పి. రాష్ట్రాలలో ఆవరించియున్న కరవు బాధవల్లను చెప్పరాని అనేక బాధలు అనుభవిస్తూన్న రైతాంగము యెడల ఈ కమిటీవారు తమ హృదయ పూర్వక సానుభూతిని ప్రకటిస్తూ; ఇట్టి బాధలు రాకుండా చేయాలంటే ఆనకట్టలు మొదలైన నీటి పారుదల సౌకర్యాలు కలుగ జేయాలనియు; ఇందుకు అవసరమైతే ఇండియా మొత్తంమీద పెద్ద ఋణం చేయవలసి యున్నదనియు; రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇట్టి ప్రాజెక్టు స్కీములు తయారుచేసి 3 సంవత్సరాలలో వాటిని నెరవేర్చ వలెననియు ఈ కమిటీవారు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను కోరుచున్నారు.

వరదలవల్ల, కరవులవల్ల, బాధపడుతూన్న వారికి ప్రభుత్వాలు పన్నులు రెమిషన్ యివ్వాలనియు; అడవులను నరికించాలనియు; క్షామ నివారణ పనులు ప్రారంభించాలనియు, తక్కావీ అప్పులు రైతుల కీయాలనియూ ఈ కమిటీవారు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుచున్నారు.

ఋణసహాయం

5. అనేక రాష్ట్ర మంత్రివర్గాలు తమ తమ ఎన్నికల ప్రణాళికకు విరుద్ధముగా రైతుల ఋణాలపై "మారటోరియం" ప్రకటించక పోవడమేగాక, 27-3-38 వ తేది (అఖిల భారత ఋణ నివారణ దినోత్సవం) ని, 1-9-38 వ తేదీ (అ. భా. రైతు దినోత్సవం)ని దేశంలో అన్ని వైపులా ప్రజలు తీవ్రమైన ఆందోళన చేసినప్పటికీ మంత్రివర్గాలు పెడచెవినిబెట్టి, రైతుల ఋణబాధను తొలగించుటకు తగిన చర్య తీసుకొన కుండుటను చూచి యీ కమిటీవారు మిగుల ఆశాభంగం పొందుచున్నారు. మదరాసు, బొంబాయి, యు. పి. రాష్ట్రాలలో ప్రభుత్వం కొన్ని శాసనాలు చేసినప్పటికీ, వాటి ప్రయోజనం రైతులు పొందలేకుండా ఎన్నో షరతులు బిగించబడి నందున ఋణదాతలు రైతులను పూర్వంకంటె ఇప్పుడు అధికంగా పీడించుకొని తింటున్నారు. కాబట్టి కొమిల్లా మహాసభలో ఆమోదింపబడిన తీర్మానానుసారం, దేశమందలి వివిధ రైతు సంఘాలు రైతుల భూములు ఋణదాతల స్వాధీనంలోకి పోకుండా తగిన కట్టుదిట్టములు చేసుకొన వలసినదిగా ఈ కమిటీవారు కోరుచున్నారు.

జమీందార్లతో ఒడంబడికలు

6. బీహార్, బొంబాయి రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు జమీందార్లతో చేసుకొన్న ఒడంబడికలను యీ కమిటీవారు ఖండించుచున్నారు. ఈ ఒడంబడికలవల్ల, ఆరాష్ట్రాలలో మొట్టమొదట ప్రవేశ పెట్టబడిన రైతాంగపు బిల్లులు జమీందార్లకు, భూస్వాములకు ఎక్కువ లాభకారిగా తయారయ్యాయి. యు. పి., మదరాసు మొదలైన రాష్ట్రాలలో కూడ యిట్టి ఒడంబడికలు జరిగే సూచనలు కనపడుతూన్నందున, కాంగ్రెసు ప్రతికూలురును, సామ్రాజ్యాను కూలురును అయిన జమీందార్లతో కాంగ్రెసు నాయకులు చేసుకొనే ఒడంబడికలు పూర్తిగా కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికకు విరుద్ధమనినీ; ఆయా రాష్ట్రాలలో రైతు సంఘాలు యిట్టి ఒడంబడికలను రద్దు చేసుకొనేటట్లు కాంగ్రెసు మంత్రులపై ఒత్తిడి తీసుకొని రావలెననినీ; ఫెయిజ్‌పూర్ కాంగ్రెస్‌లో ఆమోదింపబడిన తీర్మానానుసారం కాంగ్రెసు మంత్రులు కొత్త రైతాంగచట్టాలు అమలు పరిచేవరకూ రైతు సంఘాలు తీవ్రమైన ఆందోళన సాగించవలసిన దనినీ యీ కమిటీవారు హెచ్చరించు చున్నారు.

కొద్ది మాసాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు యిట్టి శాసనాలు చేయకపోతే, రైతులు ప్రత్యక్ష పోరాటానికి దిగవలసి యుంటుందనియు; అప్పుడు జమీందార్లు శిస్తు తగ్గించుట, రైతులకు భూమిపై శాశ్వతహక్కు, మొదలైన సదుపాయాలను రైతులకు కల్గించక తప్పదనియు ఈకమిటీవారు తెలియజేయుచున్నారు.

మార్కెటింగు సౌకర్యాలు

7. విదేశాల నుంచి పత్తి, గోధుమలు, బియ్యం మొదలైన వ్యవసాయ దినుసులపై ప్రభుత్వం విస్తారమైన దిగుమతి పన్నులు విధించినందున, దేశంలో పండే సరకుల ధరలు విపరీతంగా పడిపోవుచున్నవి. కాబట్టి యీ కమిటీవారు ప్రభుత్వము యొక్క విధానాన్ని ఖండిస్తూ, భారతీయ మిల్లు యజమానులు విదేశ సరకును దిగుమతి చేయకుండా ఉండే ఏర్పాటు కాంగ్రెసు చేయజాల కుండుటను చూచి విచారపడు చున్నారు. జనపనార, వేరుశనగ, ఇతర నూనె దినుసుల ధరలను హెచ్చించుట కెట్టి ప్రయత్నాలూ కాంగ్రెసు చేయలేదు. వ్యవసాయ దినుసులను హెచ్చు ధరలకు అమ్మించుటకై ప్రత్యేకమైన ఓపెన్ మార్కెట్లను ఏర్పాటు చేయుట; ఆ దినుసులను రకంవారీగా ప్రత్యేకించుట; నమోనాలకై కొన్నిటిని వేరుపరచి వాటిని వ్యాపారస్థులకు చూపుట; యీ దినుసులను జాగ్రత్తగా పార్సెల్సు కట్టుట; ధరలు విపరీతంగా పడిపోవు సమయాలలో గొడౌన్లలో నిల్వచేయుట; మారకపు విధానంలో మార్పులు చేయుట; యీ మొదలైన పనులన్నీ ప్రభుత్వమే పూనుకొన వలెనని ఈ కమిటీవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిక చేస్తున్నారు. అప్పుడే, వ్యవసాయ దినుసుల ధరలు హఠాత్తుగా పెరుగుట, హఠాత్తుగా పడిపోవుట ఉండకుండా పోవును.

పరిపాలనా విధానం

8. పరిపాలనా విధానంలో ఈ క్రింది మార్పులు చేసి, పల్లెటూళ్ళ యందలి రైతులకు పట్టణాలలోని కార్మికులకు కొంతవరకు పన్నుల భారాన్ని తగ్గించ వలెనని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఈ కమిటీవారు హెచ్చరించు చున్నారు:

1. నేటి భూమిశిస్తు విధానాన్ని రద్దు చేయుట.

2. కల్లు, సారాయి, నల్లమందు మొదలైన మత్తు పదార్థాలపై వచ్చే పన్నులను రద్దు చేయుట.

3. జాతీయ పరిశ్రమలకు దిగుమతి పన్నుల ద్వారా యిస్తూన్న రక్షణకు బదులు ప్రభుత్వం అత్యవసరమైన సందర్భాలలో ఉచిత ధన సహాయం చేయుచూ, స్వదేశీ సరకుల ధరలు, కార్మికుల వేతనములు వీటిని కాపాడుటకు పూనుకొనుట.

4. ఇన్‌కంటాక్సు యొక్క భారాన్ని యిప్పటికంటె ఎక్కువ చేయుట; పెద్ద ఆస్థిపరులు చనిపోయినప్పుడు వారి వారసులపై పన్ను విధించుట (Death duties); స్వయంగా సంపాదించని ఆస్థులపై పన్ను; ఈ విధానాన్ని వ్యవసాయ రాబడులకు కూడా వర్తింపజేయుట.

5. భారతదేశపు సైన్యమునకయ్యే ఖర్చు 100 కి 50% తగ్గించుట.

6. సివిలియన్ ఉద్యోగస్థుల జీత భత్యాలను తగ్గించుట.

7. ప్రభుత్వానికి నేలవచ్చే రాబడిసొమ్ములో అధిక భాగాన్ని పల్లెటూళ్ళ ప్రజలకై వినియోగించుట.

8. రైల్వేలమీద, రోడ్లమీద, కోస్తా నౌకలమీద ప్రభుత్వం ఇప్పటికంటె యెక్కువ అధికారం సంపాదించుట.

9. రిజర్వు బ్యాంకి వ్యవహారములలోను, మారకపు విధానంలోను ప్రభుత్వం యిప్పటికంటె అధికంగా, భారతీయుల శ్రేయస్సు కొరకు జోక్యం కలిగించుకొనుట.

10. అన్ని విదేశ ఋణాలను రద్దుచేయుట.

ఇతర తీర్మానాలు

ఇవిగాక, కేంద్ర శాసన సభలో యీమధ్య ప్యాసైన సైనిక బిల్లును ఖండిస్తూ ఒక తీర్మానము; పంజాబులో రైతు సత్యాగ్రహులపై పంజాబ్ ప్రభుత్వంవారు జరిపిన క్రూర హింసా విధానమును నిరసిస్తూ మరొక తీర్మానము; సోవియట్ రష్యాపై యుద్ధము చేయుటకు ఫేసిస్టు రాజ్యాలతో గ్రేట్ బ్రిటన్ కలిసిపోయి ఇండియాను ఆ యుద్ధంలో బలి యిచ్చుటకు సామ్రాజ్యవాదుల యెత్తులను ఖండిస్తూ, అట్టి సామ్రాజ్యవాద యుద్ధంలో రైతులు పాల్గొన వద్దని హెచ్చరిస్తూ మరొక తీర్మానము; ఫెడరేషన్ విషయమై కొందరు కాంగ్రెసు నాయకులు బ్రిటిష్ ప్రతినిధులతో సంభాషణలు, రాజీలు సాగిస్తూ, తద్వారా ఇండియాను బ్రిటిష్ వారి యుద్ధాలకు బలి అయ్యే అవకాశాలను కల్పిస్తూన్నందుకు అట్టి ప్రయత్నాలను తీవ్రముగా తిరస్కరిస్తూ మరొక తీర్మానము; కాంగ్రెసు విధానమునకు విరుద్ధంగా, సరిహద్దు కాంగ్రెసు మంత్రివర్గం శాంతియుతంగా సత్యాగ్రహం చేస్తూన్న ఘలాధర్ రైతులపై తుపాకులు, లాఠీలు, జైలు శిక్షలు మొదలైన నిర్బంధ విధానంతో దౌర్జన్యం సాగిస్తూన్నందుకు తీవ్రమైన అసంతృప్తిని ప్రకటిస్తూ యింకొక తీర్మానము; తోరూ నవాబు యొక్కయు, సరిహద్దు కాంగ్రెసు మంత్రివర్గం యొక్కయు, గుండెలలో హడలు పుట్టేటట్లు ఎట్టిచర్య అవసరమైతే అట్టిదాన్ని తీసుకొన వలసినదిగా సరిహద్దు తీవ్రవాదులను రైతులను హెచ్చరిస్తూమరొక తీర్మానము; ఇందు విషయమైనసరిహద్దు రాష్ట్ర కాంగ్రెసు కమిటీవారితో సంప్రతింపులు జరుపుటకు ప్రొఫెసర్ రంగా, మున్షీ అహమ్మద్ దీన్, ఫకీర్‌చంద్, బంకిం ముఖర్జీ గార్లతో కూడిన కమిటీకి అధికారమిస్తూ యింకొక, తీర్మానము; అస్సాం, సరిహద్దు, ఒరిస్సా రాష్ట్రములలో శాసన సభలవారు ఆమోదించిన రైతాంగపు బిల్లులకు ఇంతవరకూ అనుమతి యివ్వని వైస్రాయి, గవర్నర్ల చర్యను ఖండిస్తూ యింకొక తీర్మానము అఖిల భారత రైతు సంఘ కార్యనిర్వాహక వర్గము వారిచే ఆమోదింపబడెను.

ఋణ నివారణ చట్టం
పరస్పర విరుద్ధమైన కోర్టు తీర్పులు.

మదరాసు వ్యవసాయదారుల ఋణ నివారణ చట్టం యొక్క చిత్తు ప్రతి ప్రకటింప బడగానే రాష్ట్ర రైతు సంఘంవారు అందలి లోపాలను ఎత్తిచూపుతూ, దీర్ఘమైన విమర్శను గావించారు. దేశంలో అన్ని మూలల నుండి ఈ లోపాలను గురించి వ్యాఖ్యాలు ప్రకటింపబడి ఉన్నాయి కాని మదరాసు మంత్రివర్గం ఆ లోపాలను సవరించక పోగా, చట్టమందలి షరతుల్ని మరింత బిగించారు. దీని ఫలితం ఏమంటే, ఋణ నివారణ చట్టం యొక్క ప్రయోజనం రైతు లెక్కువగా పొందలేకున్నారు. వరవడులు పుట్టడంలేదు. ఋణదాతలు నోట్లు తిరగ వ్రాయించు కొంటున్నారు.

అక్టును గూర్చిన విమర్శనలలో ఒకటి, అక్టులోని షరతులు, వివరణలు అస్పష్టంగా ఉన్నాయని. ఈ మధ్య రాజధానిలో వివిధ కోర్టులు కొన్ని షరతులపై పరస్పర విరుద్ధమైన తీర్పులు యిస్తున్నాయి. "వ్యవసాయదారు" నిర్వచనాన్ని గురించి, "ఈయవలసిన ఋణా"న్ని గురించి పరస్పర విరుద్ధమైన కోర్టు తీర్పులు వెలువడ్డాయి. "ప్రామిసరీ నోట్ల"ను గురించి యిప్పుడు ఇదే విధమైన తీర్పులు ఈయబడుతున్నాయి. గత నెల 20 వ తేదీని కుంభకోణం సబ్ జడ్జీ ఈ ఆక్టు క్రింద తీర్పు యిస్తూ "ఈ ఆక్టు ప్రామిసరీ నోట్ల"కు వర్తించదని చెప్పాడు. దీనికి విరుద్ధంగా, అమలాపురం సబార్డినేట్ జడ్జీయు, కర్నూలు జిల్లా జడ్జీయు ప్రోనోటు బాకీలు కూడా ఆక్టు షరతుల క్రిందికి వస్తాయనినీ, మదరాసు శాసన సభ యీ చట్టాన్ని ప్యాసుచేయుటకు పూర్తి అధికారం ఉన్నదనినీ తీర్పులిచ్చారు.

ఈ ప్రోనోటు బాకీల విషయం అత్యంత ప్రాముఖ్యమైనది. రాణిపేట ప్రముఖ న్యాయవాది అగు యస్. వైద్యనాధన్‌గారు వ్రాసినట్లు "రాష్ట్ర మందలి ఋణాలు అధికంగా ప్రోనోట్ల రూపాన, తనఖా పత్రాల రూపాన ఉన్నవి." కాబట్టి, ఈ విషయంలో ఎట్టి తీర్పు లివ్వక, హైకోర్టువారు ఆ కేసులను తమకు పంపవలసినదిగా అడ్వొకేట్ జనరల్‌కు ఆర్డర్లు పంపవలెనని; చట్టంలోని షరతులకు సరియైన నిర్వచనం యిచ్చుటకు మదరాసు ప్రభుత్వం, అడ్వకేట్ జనరల్ ఇండియా చట్టం యొక్క 225 వ సెక్షను ప్రకారం పూనుకోవలసి యుంటుందనినీ హెచ్చరిస్తూ కుంభకోణం న్యాయవాది సంఘం కోరింది. కాని, యీ కోర్కెలను అడ్వకేట్ జనరల్ నిరాకరించినట్లును, ఈ విషయంలో హైకోర్టువారు ముందుకు వచ్చి, యికముందు చేయబడే దావాలన్నియు ఒకేరోజున విచారించుటకు ఏర్పాట్లు చేస్తూన్నట్లును తెలుస్తోంది.

అయితే, హైకోర్టుకు పోవుట కందరికీ సమర్థత ఉండదు. వెంటనే మదరాసు ప్రభుత్వం సరియైన నిర్వచనం యిచ్చుట అవసరం. దీనికై బార్ అసోసియేషన్లు, కాంగ్రెసు—రైతు సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపుకోవలసి యుంటుంది. ప్రజలలో ఆందోళనకూడా ప్రారంభించాలి.

కృష్ణవరం మొఖాసాదార్ల దౌర్జన్యం

నూజవీడు తాలూకా, కృష్ణవరం గ్రామం నుండి నైజాం యిలాకా మల్లవల్లి గ్రామ పొలిమేరకు పోయే డొంకనూ, కృష్ణవరం గ్రామానికి దక్షిణవైపున సగ్గొర్రు గ్రామానికి పోయే కాలిబాటనూ కృష్ణవరం మొఖాసాదారుగారు ఆక్రమించుకొన్నారు. ఈ రెండు పోరంబోకులూ 1902, 1928 సంవత్సరాలలో తయారైన గ్రామ ప్లానులలో కూడా నమోదైఉన్నవి. ఇంతవరకూ సదరు ఆక్రమణలను రివెన్యూ డిపార్టుమెంటువారు తొలగించలేదు. ఇదిగాక, గ్రామ స్మశానమును ప్రస్తుతమున్న చోటునుండి మరొక చోటికి మార్చవలసినదని మొఖాసాదారుగారు రైతులను బలవంత పెడుతున్నారు. మూడు మాసాలక్రిందట గంపా సుబ్బయ్య అనే బీద రైతు తాలూకు రెండు తాటిఆకుల యిండ్లను మొఖాసాదారు ఏజంటు చాపర్ల పిచ్చయ్యగారి నౌకరు పీకివేయించాడు. 23-9-38 వ తేదీని శ్రీ కాట్రగడ్డ వెంకట నారాయణరావు ఎం. ఎల్. ఏ. గారునూ, తాలూకా రైతు—కాంగ్రెసు సంఘముల వారునూ కృష్ణవరము వెళ్ళినప్పుడు రైతులు తమ కష్టాలను చెప్పుకున్నారు. కృష్ణా జిల్లా రైతు సంఘంవారు యీ పోరంబోకు ఆక్రమణలను గురించి జిల్లా కలెక్టరుగారికి వ్రాయగా, భూమి ఆక్రమణ చట్టం ప్రకారం తగు చర్య తీసుకొంటున్నామని తెలియ పరిచారు. ఇది ప్రజాందోళన ఫలితమేనని చెప్పవలసి యుంటుంది.

మైలవరం రివెన్యూ ఇన్స్పెక్టరుగారి చర్యపై విచారణ.

4-10-38 వ తేదీని బెజవాడలో బెజవాడ తహసిల్దారుగారు మైలవరం రివెన్యూ ఇన్స్పెక్టరు గారిమీద నందిగం గ్రామ హరిజను లిచ్చిన పిటీషను (28-9-38 నవశక్తిచూడుడు) గురించి విచారణ ప్రారంభించారు. విచారణ పబ్లిక్ కోర్టు హాలులో కాకుండా తహసిల్దారు గారి ప్రయివేటు రూమ్‌లో రహస్యంగా జరిపారు. 6 గురు పిటిషనర్లు విచారించబడ్డారు. రివెన్యూ ఇన్స్పెక్టరుగారు తమను డబ్బు యివ్వమన్నట్లూ; యిస్తేనేగాని గవర్నమెంటు శాంక్షను చేసిన భూమిని చూపించనని చెప్పినట్లూ; దానిపై తాము పదిరూపాయలు, కట్టెల మోపులు యిచ్చినట్లూ వారు సాక్ష్యంచెప్పారు. విచారణ రివెన్యూ ఇన్స్పెక్టరుగారి యెదుటనే జరిగింది.

లంచగొండి నేర విచారణ

శ్రీపుల్లాభొట్ల సుబ్బయ్యగారు అప్పరుగుడివాడ సెక్షన్‌లో ఓవర్సీయరుగా నున్నపుడు లంచము తీసికొన్నాడని గుడివాడ తాలూకా కురుమద్ధాలి గ్రామ రైతుసంఘమువారి రిపోర్టును గురించి కృష్ణా యీస్టరన్ డివిజను యెక్జిక్యూటివ్ యింజనీయరుగారు రెగ్యులర్ విచారణ గతనెల 17 వ తేదీని ప్రారంభించినారు. వోవర్సీయరుగారు వకీలును పెట్టగా, డిపార్టుమెంటల్ విచారణలో వకీలు వీలులేదని రైతు సంఘము వారన్నారు. కాని యింజనీయరుగారు వకీలు ఉండవచ్చునన్నారు. అంతట రైతు సంఘమువారునూ వకీలు తెచ్చుకొనుటకు వ్యవధి కోరగా మరుసటి దినమునకు (అనగా సెప్టెంబరు 18 వ తేదీ) వాయిదా వేసిరి. 18 వ తేదీన రైతు సంఘము తరపున శ్రీ త్రిపురనేని శివప్రసాదరావు గారునూ, శ్రీ కాశీనాధుని పూర్ణమల్లికార్జునుడు యం. యల్. సి. గారునూ వకీళ్లగా దయచేసిరి. కురుమద్ధాలి గ్రామ రైతుసంఘ అధ్యక్ష కార్యదర్శులు శ్రీ [illegible] పల్లి [illegible] శ్రీ [illegible] వెంకట [illegible] బాపయ్య గార్లు విచారింపబడిరి. కాని యెక్జిక్యూటివ్ యింజనీయరుగారు 23-9-1938 తేదీగల తమ ఉత్తర్వులో తమచే యిక ముందు జరుపబడనున్న విచారణలో వకీళ్లుగాని, మరి యితరులుగాని హాజరగుటకు వీలులేదనియు, ఓవర్సీయరు, విచారింపబడు సాక్షి మాత్రమే ఉండ వీలగుననినీ విచారణ తేదీ త్వరలో తెలిపెదమనినీ, గ్రామ రైతుసంఘము వారికినీ కృష్ణాజిల్లా రైతు సంఘము వారికినీ తెలియపరచారు.

ఈనెల 8 వ తేదీ మరల విచారణ ప్రారంభించారు. రైతు సంఘమువారి తరపున ఒక సాక్షిని విచారించినారు. ఓవర్సీయరు క్రాసు పరీక్ష చేసినారు. కాని రైతు సంఘము తరపున యెవరినీ హాజరు కానియ్యలేదు. ఓవర్సీయరు తరపు సాక్షులను క్రాసు పరీక్ష చేయ వీలు లేదన్నారు. కనుక అట్టి పాక్షిక విచారణవల్ల ప్రయోజనం లేదని రైతు సంఘమువారు వెళ్ళిపోయినారు.

యిట్టి విచారణలవల్ల రైతులకు న్యాయము జరుగజాలదనినీ, నిష్పాక్షిక విచారణ జరుపవలెననినీ, యిట్టి విచారణలకు సంబంధించిన రూల్సు పంపవలసినదిగానున్నూ మద్రాసు గవర్నమెంటు వారికి జిల్లా రైతు సంఘము వారు వ్రాసినట్లు తెలుస్తున్నది. ఈ యెగ్జిక్యూటివ్ యింజనీయరుగారే యింకొక విచారణలో సాక్షుల స్టేటుమెంట్లకు నకళ్లు యివ్వజాలనని తెల్పినారు. లంచగొండ్లను గూర్చిన విచారణలలో ప్రభుత్వోద్యోగులు అవలంబించు యిట్టి విధానము రైతులకు అసంతృప్తి కలిగించుచున్నది.

వెల్లటూరు గ్రామ కర్ణంపై కేసు

బెజవాడ తాలూకా వెల్లటూరు గ్రామకర్ణం వెణుతురుమిల్లి వెంకటేశ్వరరావుగారిపై మామూళ్ళు తీసుకుంటున్నారనే కేసు మోపబడింది. శిస్తులకు రశీదులు ఇవ్వకుండా, ఇచ్చినను తెల్ల కాగితాలపై సంతకం లేకుండా మొద్దు అంకెలు వేసి ఇచ్చుట, పట్టాకు 4-0-0, 2-0-0, 1-0-0, 0-8-0 ఈ విధంగా తాహతును బట్టి ఆఖరు కిస్తీలో జమాబంది మామూళ్ళు తీసికొనుట మొదలైనవి వీరిపైమోపబడిన నేరాలు. ఈ మామూళ్లు తీసికొనుట వల్లనే రిక్త హస్తాలతో గ్రామంలోకి ప్రవేశించిన వీరు ఇప్పుడు 10 వేల రూపాయల ఆస్థిపరుడైనాడని రైతులు తెల్పుచున్నారు. వీరిపై కేసును ఇదివరలో బెజవాడ తహసీల్దారుగారు విచారించి కొట్టివేసిరి. తిరిగి ఇప్పుడు జిల్లా కలెక్టరుగారి ఆర్డరుపై వీరిపై కేసు పునర్విచారణ జరుగుచున్నది. కరణంగారికి మద్దతుగా మున్సిఫు, ఫారెస్టు పంచాయితీ ప్రెసిడెంటు ఉన్నటుల్ల తెలియుచున్నది. కేసు గనుక ఋజువు అయితే ఇట్టి గ్రామోద్యోగులను డిస్మిసు చేయవలసినదే. గాని లేనియెడల గ్రామాలలో పార్టీలను పెంచి గ్రామైక్యతకు భంగం కల్గించిన వారగుదురు.

త్వరలో [illegible] అప్పుడే ఉంది

జక్కోస్లొవేకియా

జక్కోస్లొవేకియా

[illegible]

పూర్వ కథ

పార్వతీ దేవదాసులు చిన్ననాటనుండీ స్నేహంగా పెరిగారు. దేవదాసు తలిదండ్రుల తిరస్కారం వారి ప్రేమకు విఘాతం తెచ్చింది. దేవదాసు తలిదండ్రుల తిరస్కరించ లేక ఆమెను వివాహమాడడానికి సాహసించలేక పోయాడు. పార్వతిని రెండో పెళ్లివాడైన 40 యేండ్ల భువన చౌదరికిచ్చి పెళ్లి చేయ నిశ్చయించారు.

దేవదాసుకు మనస్సు మనస్సులో లేదు. చదువుకు కలకత్తాకు పోయిన వాడు తిరిగి యింటికి వచ్చేశాడు. తనను పెండ్లి చేసుకోమని పార్వతిని అడిగాడు. కాని ఆమె రోషంతో తిరస్కరించింది.

కలకత్తాలో దేవదాస్ తన దుఃఖాన్ని పోగొట్టుకోడానికి స్నేహితుడు చున్నీతో వేశ్య—చంద్రముఖి—ఇంటికి పోతాడు. చంద్రముఖి, దేవదాసును ప్రేమిస్తుంది. దేవదాసు ఒక నోటు చేతిలో పెట్టి ప్రేమను తిరస్కరించి పోతాడు.

పార్వతి కాపురానికి వెళ్ళింది. అత్తవారి భాగ్యానికి ఆశ్చర్యపడింది. భువన చౌదరి ప్రథమ కళత్రానికి ముగ్గురు సంతానం. ఒక కూతురు ఇద్దరు కొడుకులు. కూతురు యశోద అలిగి ఇంటికి రాలేదని, పెద్దకుమారుడు మహేంద్రునివల్ల తెలిసికొంది పార్వతి.

పార్వతి ఒకనాడు భర్తతో ముచ్చటిస్తూ యశోద విషయం కదలించింది. ఆమెను తీసుకొని వచ్చుటకు మహేంద్రుని పంపుతారు.

యశోద ఇంటికి రాగానే పార్వతి ఎంతో మర్యాదచేసి, తన నగలన్నీ ఆమె కర్పించింది. ఎంతో కోపంతో వచ్చిన యశోద నిలువునా నీరైపోయింది. చిన్న కొడుకు వినోదలాల్ పరీక్షలై యింటికి వచ్చినాక మరల చదువుకు పోలేదు.

కలకత్తాలో దేవదాసుకు చున్నీలాల్‌తో స్నేహం నానాటికి వృద్ధికావచ్చింది. త్రాగుడుకు కూడా అలవాటు పడ్డాడు. చంద్రముఖి కోరిక ప్రకారం చున్నీ ఒకనాడు దేవదాసును మరల ఆమె ఇంటికి తీసుకుపోయాడు. అక్కడత్రాగి స్పృహతప్పి పడిపోయిన దేవదాసుకు చంద్రముఖి పరిచర్య చేసి నిద్రపుచ్చుతుంది.

ఆ తరువాత

౧౨

దేవదాసూ, అతని అన్న ద్విజదాసూ, ఇంకా గ్రామస్థులు కొందరూ జమీందారు నారాయణ ముఖర్జీకి అగ్నిసంస్కారం చేసి ఇంటికి తిరిగి వచ్చారు. ద్విజదాసు బిగ్గరగా ఏడుస్తూ ఉన్నాడు. అతని స్థితి పిచ్చివానిలాగ ఉన్నది. గ్రామస్థులు అయిదారుగురు కూడా అతన్ని పట్టుకుని ఆపలేకుండా ఉన్నారు. దేవదాసు శాంతంగా స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు. అతని నోట మాటా లేదు: కంట తడీ లేదు. ఎవ్వరూ వచ్చి అతన్ని పట్టుకోవటమూ లేదు—ఓదార్చాలనే ప్రయత్నమూ లేదు. మధుసూదన ఘోషు మాత్రం ఒకమాటు అతని దగ్గరికి వచ్చి—"ఏమి చేస్తాం, నాయనా: నొష్ట రాసింది—" అంటూ ఏమేమో చెప్పబోయాడు. కాని దేవదాసు చెప్పనివ్వకుండానే ద్విజదాసు వంక వేలు చూపించి—"అక్కడ" అని అన్నాడు. ఘోషు మహాశయుడు అప్రతిభుడై—"అవును, వారి కెంత దుఃఖం—" అంటూ వెళ్ళిపోయాడు. ఇక ఎవ్వరూ ఇతని దగ్గరికి రాలేదు. రెండు ఝాములయినా దేవదాసు అర్ధ మూర్ఛితావస్థలో ఉన్న తల్లి దగ్గరికి పోయి కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. ఆమెను చాలామంది స్త్రీలు చుట్టి ఉన్నారు. పార్వతి నాయనమ్మ కూడా అక్కడనే ఉన్నది. ఆమె శోకార్తురాలైన సద్యవిధవను భగ్న స్వరముతో సంబోధించి—"అమ్మాయీ! ఒకమాటు కళ్లు తెరచి చూడు, దేవదాసు వచ్చాడు" అన్నది.

దేవదాసు—"అమ్మా!" అని పిలిచాడు.

ఆమె ఒక్కమాటు కళ్లు తెరచి—"నాయనా!" అన్నది. తర్వాత మూసిన కనుకొలకుల నుంచి కట్ట తెగిన ప్రవహంలాగ అశ్రుధార ప్రవహించింది. స్త్రీలు ఒక్కమాటుగా గొల్లుమని ఏడ్చారు. దేవదాసు కాసేపు తల్లి కాళ్ళ మీద తల పెట్టి, తర్వాత నెమ్మదిగా తండ్రి చనిపోయిన గదిలోనికి పోయాడు. అతని కంట నీరు లేదు. శాంత—గంభీర మూర్తి, ఎర్రని కళ్ళతో పైవంక చూస్తూ నేలమీద కూర్చున్నాడు. అతని వాలకం చూస్తే అప్పుడు ఎవరైనా భయపడతారు. కణతల మీది నరాలు తాళ్ళవలె ఉబ్బినవి. సంస్కారం లేక వెంట్రుకలు నిక్కబొడుచుకున్నవి. దబ్బపండు వంటి శరీరం మీద సిరా పూసినట్టుగా ఉన్నది. కలకత్తాలోని అనాచారాలే కాక ఒక రాత్రల్లా జాగరణ చేశాడు: పైన తండ్రి చావు. ఒక సంవత్సరం క్రిందట చూసినవాళ్లెవరూ అతన్ని ఇప్పుడు చప్పున గుర్తించలేరు.

కొంచెంసేపయినాక పార్వతి తల్లి అతనిని వెతుకుతూ తలుపు తెరచుకొని లోపలికి వచ్చి—"దేవదాస్!" అని పిలిచింది.

"ఏమిటి, అత్తయ్యా?"

"ఇలా ఉంటే జరుగదు నాయనా!"

దేవదాసు ఆమెవైపుకుతిరిగి—"ఏంచేశానుఅత్తయ్యా?" అన్నాడు.

ఏమి చేసిందీ ఆమెకు తెలుసు. కాని జవా బివ్వలేకపోయింది. ఆమె దేవదాసు తలను దగ్గరికి తీసుకొని—"మా తండ్రివి కాదూ!"అన్నది.

"ఏమిటి అత్తయ్యా?"

"మా బాబువి కాదూ!"

దేవదాసు ఆమె హృదయంలో తల పెట్టి ఒక అశ్రు బిందువు రాల్చాడు.

దుఃఖపరివారాలకు కూడా కాలం గడుస్తుంది. క్రమంగా తెల్లవారింది. ఏడుపులూ మొత్తుకోళ్ళూ చాలావరకు తగ్గినవి. ద్విజదాసు ఒక్కమాటుగా మామూలు స్థితిలోకి వచ్చివేశాడు. వాళ్ళ తల్లి కూడా లేచింది—కళ్లు తుడుచుకుంటూ నిత్యకృత్యాలు చేసుకో నారంభించింది.

రెండు రోజులు గడిచినాక ద్విజదాసు తమ్ముని పిలిచి—"దేవదాస్! తండ్రిగారి శ్రాద్ధానికి ఎంత ఖర్చుపెట్టటం మంచిది?" అని అడిగాడు.

దేవదాసు అన్న ముఖం వంక చూసి—"మీకు ఉచితమని తోచినంత" అని అన్నాడు.

"కాదు భాయీ! ఇప్పుడు నా ఒక్కడి ఇష్టంతో పని జరగదు నీవూ పెద్ద వాడివయావు. నీ అభిప్రాయం తెలుసుకోవడం కూడా అవసరం."

"రొఖ్ఖం ఎంత నిలవున్నది?"

"ఉమ్మడివి లక్ష యాభై వేలు ఉంటవి. పది పన్నెండు వేలు ఖర్చు పెట్టితే సరిపోతుందని నా ఉద్దేశము. ఏమంటావు?"

"నాకెంత వస్తుంది?"

ద్విజదాసు సంకోచిస్తూ—"ఆఁ, నీకూ సగం వస్తుంది. పది వేలు ఖర్చు పెట్టితే నీకో డెబ్బయి వేలూ నాకో డెబ్బయి వేలూ మిగులుతవి."

"మరి తల్లికో?"

"తల్లి రొఖ్ఖం ఏమి చేసుకుంటుంది? ఈ ఇంటికి పెద్ద తల ఆమెయేనాయ. మనమే పోషిద్దాం."

దేవదాసు కాసేపు ఆలోచించి—"నీ వంతు అయిదువేలు నా వంతు ఇరవైఅయిదు వేలు ఖర్చు పెడదాము. మిగతా యాభై వేలలో నేను పాతిక వేలు తీసుకుంటాను, శేషించిన పాతిక వేలూ తల్లిగారి పేర జమ ఉంటవి. మీ అభిప్రాయం ఏమిటి?"

మొదట ద్విజదాసు సిగ్గు పడ్డాడు. తర్వాత—"చాలా మంచి సంగతి. నా సంగతి తెలుసుగా—భార్యా, కొడుకులు, కూతుళ్లూ – వాళ్ళకు ఒడుగులూ, పెళ్లిళ్లూ—బోలెడు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఉద్దేశం బాగానే ఉన్నది." అని కొంచెం సేపు ఆగి—"సరే, కొంచెం రాసుకుంటే—" అన్నాడు.

"రాత కూతలవల్ల వచ్చేదేమున్నది—నలుగురిలో నగుబాటు తప్పితే, డబ్బు వ్యవహారం గోప్యంగా జరిగి పోవటమే మంచిదని నా ఉద్దేశం."

"మంచిదే. కాని ఏ కాలానికి ఎలా ఉంటుందో—"

"సరే, నేను రాసిస్తాను." అని దేవదాసు ఆ రోజునే కాగితం వ్రాసి యిచ్చాడు.

మర్నాడు మధ్యాహ్నం దేవదాసు క్రిందకు దిగివస్తూ, పార్వతి మెట్లు ఎక్కివస్తూ ఉండటం చూసి, ఆగి పోయాడు. పార్వతి అతన్ని చూసింది. ఆమెకు కొంచెం దుఃఖం కూడా కలిగింది. దేవదాసు ఆమె దగ్గరికి వచ్చి శాంత గంభీర స్వరంతో—"ఎప్పుడొచ్చావు పార్వతీ?" అని అడిగాడు.

మూడు సంవత్సరాలు గడచినాక విన్నా అదే గొంతు!

పార్వతి తల వంచుకుని—"ఉదయమే వచ్చాను." అన్నది.

"చాలా రోజుల నుంచి చూడటం పడలేదు. కులాసాగా ఉన్నావా?"

పార్వతి తల తిప్పింది.

"చౌదరిగారు బాగున్నారా? పిల్లా జల్లా అంతా క్షేమమా?"

దేవదాసు

శరత్ బాబు

విరచితం

"అంతా క్షేమమే." అని పార్వతి ఒక మాటు దేవదాసు ముఖం వంక చూసింది. కాని అతను ఏ విధంగా ఉన్నదీ, ఏమి చేస్తున్నదీ ఒక్క ప్రశ్న కూడా అడగలేక పోయింది. అసలు నోటి వెంట మాటే రాలేదు.

"ఇంకా కొన్నాళ్లుంటావుగా?"

"ఆఁ."

"అయితే ఇంకేం—" అని దేవదాసు బయటకు వెళ్ళి పోయాడు.

శ్రాద్ధం సక్రమంగా జరిగి పోయింది. దాని వివరాలు ఎత్తుకుంటే చాలా వ్రాయవలసి ఉంటుంది. అందుకని దాన్ని వదిలివేస్తున్నాను. శ్రాద్ధం అయిన మర్నాడు పార్వతి ధర్మదాసును చాటుకు పిలిచి అతని చేతిలో బంగారపు గొలుసు పెట్టి—"ధర్మా, ఇది మీ అమ్మాయికి పెట్టుకో." అని అన్నది.

ధర్మదాసు ఆమె ముఖం వంక చూసి, అసలే తడిగా ఉన్న కళ్లల్లో నీరు తెచ్చుకుని—"ఆహా! నిన్ను చూసి ఎంత కాలమైంది! అంతా క్షేమమేనా తల్లీ?" అని అడిగాడు.

"అంతా క్షేమమే. నీ పిల్లలందరూ బాగున్నారా?"

"ఆఁ, బాగానే ఉన్నారు."

"నువ్వు బాగున్నావా?"

ఈమాటు ధర్మదాసు ఒక నిట్టూర్పు విడిచి— "ఇంకా ఏం బాగు! వారు కూడా పోయారు. నేను కూడా దాటిపోతే బాగుంటుందని అనుకుంటాను—"అని ధర్మదాసు శోకావేశంలో ఏమేమో చెప్పుకు పోతున్నాడు. కాని పార్వతి అడ్డు వచ్చింది. ఈ సంగతులన్నీ వింటానికి ఆమె హౌరం ఇవ్వలేదు.

"చక్రపాణి"

★ అనువాదం ★

"అదేమిటి ధర్మా, నువ్వు లేకపోతే దేవదాసును ఎవరు చూస్తారు?"

ధర్మదాసు తల బాదుకుని— "చిన్నవాడుగా ఉన్నప్పుడు ఎలానో చూశాను. ఇప్పుడు చూడకుండా ఉంటటమే మంచిది పారూ, బ్రతికిపోతాను!" అన్నాడు.

ఇంకా కొంచెం దగ్గరికి వచ్చి—"ఒక్క సంగతి నాకు నిజం చెప్పతావా, ధర్మా?" అని అడిగింది.

"ఎందుకు చెప్పను తల్లీ?"

"అయితే నిజం చెప్పు. దేవద ఇప్పుడు ఏం చేస్తున్నాడు?"

"ఏం జేస్తాడు? నా తలకాయ!"

"విప్పి చెప్పు ధర్మా?"

ధర్మదాసు ఇంకోమాటు తల బాదుకుని-"ఇంకా ఏమి విప్పి చెప్పేది తల్లీ? అవన్నీ చెప్పే సంగతులా! ఇప్పుడు తండ్రి కూడా లేడు—చేతికి బోలెడు డబ్బు వచ్చింది. ఈమాట్టు పట్ట పగ్గా లుంటవా?" అన్నాడు.

పార్వతి ముఖం ఒక్కమాటుగా మలినమైంది. వా డిచ్చిన సూచనల బట్టి ఆమె కొంత గ్రహించి, స్తబ్ధురాలై— "ఏమిటి నువ్వు చెప్పేది ధర్మా?" అని అన్నది.

మనోరమ వ్రాసిన ఉత్తరాన్ని బట్టి ఆమె కొంత తెలుసుకున్నది, కాని అప్పుడు నమ్మలేదు.

ధర్మదాసు చెప్పేది నిజమన్నట్టుగా తల తిప్పి చెప్ప నారంభించాడు:

"తిండి లేదు, నిద్ర లేదు, ఎప్పుడూ బుడ్లకు బుడ్లు బ్రాంది తాగుతూ ఉంటాడు. ఒకోమాటు నాలుగైదు రోజుల దాకా కనపడడు—ఎక్కడ పడి ఉంటాడో, అంతు తెలియదు. బోలెడు డబ్బు తగలేశాడు! ఎన్నో వేలవి నగలే చేయించాడని విన్నాను."

పార్వతి ఆపాద మస్తకమూ కంపించింట.

"ఈ సంగతి నిజమేనా ధర్మదాస్!" అని అడిగింది.

ధర్మదాసు వెనుకటి ధోరణిలోనే చెప్ప నారంభించాడు:

"బహుశా నీ మాట వింటా డనుకుంటాను. ఒకమాటు వారించకూడదూ! బంగారమంటి వళ్లు గుల్లయి పోయింది. ఇలా తిరుగుతూ ఉంటే ఇంకెన్నాళ్ళు బ్రతుకుతాడు! ఈ సంగతులు ఎవరికి చెప్పేది? తల్లీ, తండ్రీ, అన్నా వల్లకాదాయె!" అని ధర్మదాసు తల తప తప బాదుకుని— "తల పగులగొట్టుకుని చావబుద్ధేస్తున్నది పారూ. నాకు బతకాలనే కోరికే లేదు" అన్నాడు.

పార్వతి లేచి వెళ్ళిపోయింది.

నారాయణబాబు మరణ వార్త విని పార్వతి ఇక్కడకు పరుగెత్తుకొచ్చింది. ఈ ఆపత్సమయంలో దేవదాసు దగ్గరికి పోవటం ఉచితమని ఆమె తలచింది. కాని, ఆమెకు ప్రియమైన దేవదా ఇక్కడ ఇలా అయిపోతున్నాడు! ఆమెకు ఎన్నో సంగతులు జ్ఞాపకం రా నారంభించినవి. దేవదాసు కంటే తన్నే ఎక్కువ తిరస్కరించుకున్నది. తానుంటే దేవదాసు ఇలా అయిపోయేవాడా? అని ఆమె లక్షసార్లు అనుకున్నది. పూర్వం ఆమె తన చేత్తో తాను ఉరితాడు మెడకు తగిలించుకున్నది; ఇప్పు డది బిగుసుకున్నది. ఆమె దేవదాసు ఇక్కడ ఇలా పాడైపోతూ ఉంటే ఆమె పరుల కుటుంబం చక్కబెట్టటంలో నిమగ్నురాలై ఉంది! ఇక్కడ ఆమె సర్వస్వం తిండి లేకుండా మాడిపోతూ ఉంటే—అక్కడ పరులు తనవారనుకుని నిత్యం అన్నదానం చేస్తూ ఉంది! ఇవ్వాళ దేవదాసు కాళ్ళ దగ్గర తల పగులగొట్టుకు చావాలని ప్రతిజ్ఞ చేసుకున్నది.

పొద్దు ఏట వాలింది. పార్వతి దేవదాసు గదిలో ప్రవేసించింది. దేవదాసు పక్కమీద కూర్చుని లెఖ్ఖలు చూసు కుంటున్నాడు. పార్వతి మెల్లగా తలుపు వేసి నేల మీద కూర్చున్నది. దేవదాసు తెలెత్తి చూసి నవ్వాడు. అతని ముఖం విచారంగా ఉన్నప్పటికీ శాంతంగా ఉన్నది, దేవదాసు హఠాత్తుగా—"అపవాదు వస్తే?" కతుకంగా అన్నాడు.

పార్వతి మాట్లాడలేదు. సిగ్గు పడింది. నల్ల కలువల వంటి నేత్రాలతో ఒక మాటు అతని వంక చూసి తల వంచుకున్నది. ఆ చూపులతోనే "ఈ మాట నా హృదయంలో శూలంవలె ఎప్పటికీ గుచ్చు కున్నది. ఇంకా నన్నెందుకు హేళన చేస్తావు?" అని తెలిపింది. పార్వతి ఏమేమో చెప్పాలని వచ్చింది. కాని అంతా మరచి పోయింది. దేవదాసు దగ్గర ఆమె మాట్లాడలేదు. దేవదాసు మరల నవ్వుతూ—"నేను గ్రహించానులే, నేగ్రహించాను! సిగ్గు పడుతున్నావు కాదూ!" అన్నాడు.

పార్వతి అప్పటికీ మాట్లాడ లేకపోయింది. దేవదాసు మరల చెప్ప నారంభించాడు.

"దానికింకా సిగ్గు పడటం ఎందుకూ? ఇద్దరం కలిసి ఏదో కుర్రతనం చేష్టలు చేశాము—కాని మధ్యలో రసాభాసమయింది. కోపం వచ్చి నీ నోటికి వచ్చింది నీవన్నావు. నేనూ ముఖాన గుర్తు పెట్టాను. ఏం బాగా లేదూ!"

దేవదాసు మాటలలో శ్లేషకానీ, వ్యంగ్యంకానీ ఏ మాత్రమూ లేదు. ప్రసన్నుడై నవ్వుతూ నవ్వుతూ గడచిపోయిన దుఃఖ గాధ వినిపించాడు. కాని పార్వతి హృదయం పగిలి పోతూ ఉన్నది. ఆమె నోట గుడ్డ పెట్టుకుని, శ్వాస బిగబట్టి మనస్సులో—"ఈ మచ్చే నాకు ఓదార్పు దేవదా—ఇదే నా మూల ధనం! నీవు నన్ను చాలా ప్రేమతో చూసే వాడివి, అందుకనే మన బాల్య చరిత్రను నా నొసట రాశావు! ఇది సిగ్గుచేటు కాదు! నాకు గౌరవ చిహ్నం!" అని అను కున్నది.

"పారూ!"

పార్వతి నోటిమీద నుంచి గుడ్డ తియ్యకుండానే—"ఏమిటీ?" అని అడిగింది.

"నీ మీద నాకు చాలా కోపం వస్తుంది—" ఈ మాటు దేవదాసు కంఠ స్వరం కొంచెం మార నారంభించింది—"నాన్న గతించాడు, ఇప్పుడు నా కెంత కష్ట దినాలో చూడు. నువ్వుంటే నా కేమీ దిగులుండేది కాదు కదా! వదిన్ని నువ్వెరుగుదువు, ఇక అన్నయ్య స్వభావం నీకు తెలియంది కాదు, అమ్మను ఏం చెయ్య మంటావో నీవే చెప్పు! ఇక నా సంగతి అగమ్యగోచరంగా ఉన్నది. నువ్వు ఉన్నట్లయితే నిశ్చింతగా అంతా నీ చేతికి అప్పగించి—అదేమిటి పారూ?"

పార్వతి వెక్కి వెక్కి ఏడవ సాగింది.

"ఏడుస్తున్నావా? అయితే ఈ ప్రసంగం ఇంతటితో కట్టి పెట్తాను," అన్నాడు దేవదాసు.

పార్వతి కళ్లు తుడుచుకుంటూ—"కాదు, చెప్పు," అన్నది.

దేవదాసు ఒక్క క్షణంలో గొంతు మార్చుకుని—"పారూ, నువ్వు పక్కా గృహిణి వయావే!" అన్నాడు.

పార్వతి పెదవి కొరుక్కుని మనస్సులో—"గృహిణి కాదు. మన్ను! గన్నేరు పూలు దైవ పూజకు పనికి వస్తాయా?" అని అనుకున్నది.

దేవదాసు పక పక నవ్వుతూ—"నాకు బలే నవ్వు వస్తుంది పారూ! కాస్త దానివి. ఇప్పుడెంత పెద్ద దాని వయావు! పెద్ద మేడా, పెద్ద జమీందారీ, పెద్ద పెద్ద పిల్లలూ—ఇంకా చౌదరిగారూ—అందరూ పెద్దవారే, కాదు పారూ?" అని అడిగాడు.

పార్వతి మనస్సును రంజింప జేసే వాటిలో చౌదరిగారు కూడా ఒకరు. వారు తలపుకు రాగానే ఆమెకు నవ్వు వచ్చేది. అందుకనే ఆమెకు ఇటువంటి దుఃఖంలో కూడా నవ్వు వచ్చింది.

దేవదాసు కృత్రిమ గాంభీర్యంతో-"ఒక ఉపకారం చేసిపెట్టగలవా?" అని పార్వతిని అడిగాడు.

పార్వతి ముఖం ఎత్తి—"ఏమిటి?" అని అడిగింది.

"మీ దేశంలో మంచి పిల్లలు దొరుకుతారా?"

పార్వతి ఊట మింగి, ఒకమాటు దగ్గి—"మంచి పిల్లా? ఎందుకు? ఏమి చేసుకుంటావు?" అని అడిగింది.

"దొరికితే వివాహం చేసుకుంటాను. ఒకమాటు సంసారిని కావాలని ఉన్నది."

"మంచి చక్కనిదా?"

ఆఁ, నీమాదిరిది."

"మెత్తనిది కూడానా?"

మంచి బుద్ధిమంతురాలా?"

"మెత్తనిది లాభం లేదు. గడుసుది కావాలి! నీమాదిరిగా నాతో పోట్లాడాలి!"

పార్వతి మనస్సులో—"అలా ఎవ్వరూ పోట్లాడలేరు దేవదా. అలా పోట్లాడాలంటే నామాదిరిగా ప్రేమించినవారు కూడా కావాలి." అని అనుకుని, పైకి—"ఇక నా సంగతే చెప్పు! నా వంటి వాళ్ళు కొన్ని వేల మంది దొరుకుతారు నువ్వు కావాలంటే."

దేవదాసు నవ్వుతూ—"ఏదీ పారూ! కనీసం ఒక్క పిల్లనైనా మాట్లాడిపెట్టు, అని అడిగాడు.

"నువ్వు నిజంగా పెళ్ళి చేసుకుంటావా, దేవదా?"

"చెప్పితినిగా." అన్నాడు దేవదాసు.

కాని ఈ జీవితంలో నువ్వు మినహా నాకు ఏ స్త్రీమీదా కోరిక లేదని మాత్రం అతను విప్పి చెప్పలేదు.

'ఒక్కమాట అడగనా దేవదా?' అన్నది పార్వతి.

'అడగరాదూ?'

పార్వతి తన్ను తాను కొంత సంభాళించుకొని—'నువ్వు త్రాగుడు ఎందుకు నేర్చు కున్నావు?' అని అడిగింది.

'తాగటం కూడా నేర్చు కోవాలా?' అన్నాడు దేవదాసు నవ్వుతూ.

'అది కాదు; నువ్వు ఎందుకు అలవాటు చేసు కున్నావు?'

'ఎవరు చెప్పారు! ధర్మదాసా?'

'ఎవరైనా చెప్పనీ, నిజమా, అబద్ధమా!'

దేవదాసు దాచలేదు—'కొంత వరకు నిజమే.' అన్నాడు.

కార్మిక సమస్యలు

బెజవాడ తోళ్ల పనివారల సమ్మె?

బెజవాడ

తోళ్ళ పనివాళ్ళ సమ్మె.

బెజవాడ తోళ్లషాపులో పనిచేయు తోళ్ళ పనివారు సుమారు 70 మంది 4 వ తేదీని సమ్మె ప్రారంభించారు. సమ్మె చేయుటకు కారణములు: యజమానులు ఇంతవరకూ పెట్టుచున్న దుర్భర పరిస్థితులేకాక పండుగ మామూళ్ళు యిచ్చుటకు కూడ నిరాకరించారు. అందుచే సమ్మె ప్రారంభమైనది.

పనివారల కోర్కెలు.

1. ప్రస్తుతపు రేట్లుగాక పూర్వము రేట్లు ప్రకారం జీతాలు ఇవ్వాలి.

2. ఆదివారములు, గెజిటెడ్ సెలవు దినములు. సంవత్సరమునకు ఒక నెల క్యాజువల్ లీవు యివ్వాలి.

3. పనివారలను తిట్టటము, కొట్టటము వుండరాదు.

4. పనివారలకు ప్రస్తుతము యిచ్చుచున్న మాదిరిగా చెక్కా, నీరు, పండుగ మామూళ్ళు తదితర యీనాములు యిచ్చుచుండవలెను.

5. ధర్మము క్రింద జీతముగానుంచి ప్రస్తుతము 10 దినములకు మినహాయించుచున్న 0-0-6 యికనుంచి మినహాయించరాదు.

6. సంఘమును యజమానులు గుర్తించాలి

7. సమ్మె చేసిన రోజులకు జీతముయివ్వాలి

8. సమ్మె చేసిన వారిని పనినుండి తొలగించుటగాని, యింకా యే విధమైన శిక్షలు విధించుటగాని, జుల్మానాలు వేయుటగాని చేయకూడదు.

ఈ సమ్మెను నడుపుటకు కె. మోజెస్, పిల్లలమఱ్ఱి వెంకటేశ్వర్లు, యింటూరి వెంకటేశ్వరరావు తదితరులను స్ట్రయిక్ కమిటీగా ఎన్నుకొన్నారు.

5 వ తేదీ ఉదయము ఆ షాపు యజమానులు శ్రీ పిల్లలమఱ్ఱి వెంకటేశ్వర్లు, డాక్టర్ కె. మోజెస్‌గార్లతో పనివారల మెమట యీ క్రింది రీతిగా రాజీపడ్డారు.

1. పనివారలను కొట్టుట, తిట్టుట మాని వేయుట

2. వెంటనే పండగ మామూళ్ళిచ్చి ప్రస్తుతము యిచ్చుచున్న మామూళ్లు ఎప్పటివలెనే యిచ్చుట

3. ధర్మముక్రింద 10 దినములకు మినహాయించుచున్న 0-0-6 మినహాయించకుండుట

4. సమ్మె చేసినవారిని శిక్షించుటకాని, పని నుండి తొలగించుట కాని వుండదు.

5. సంఘము గుర్తించుటకు తమ అంగీకారము తెలియజేయుచూ యితర షాపుల యజమానులతో కూడా సంప్రతించి తెలియజేస్తామన్నారు.

6. పాతరేట్లు యిచ్చుటకు అన్ని షాపుల యజమానులు సమావేశమై 5 రోజులలో తెలియజేయుటకు అంగీకరించారు.

7. సమ్మె చేసిన రోజుల జీతమును గురించి కూడా 5 రోజులలో తెలియజేసెద మన్నారు.

5 వ తేదీ సాయంత్రము సుమారు 400 మంది తోళ్ళషాపు కార్మికులు సమావేశమై సంఘముగా ఏర్పడుటకు తీర్మానించుకొని, సంఘమునకు అధ్యక్షులుగా శ్రీ కాట్రగడ్డ నారాయణరావుగారిని, ఉపాధ్యక్షులుగా డాక్టరు కె. మోజెస్‌గారిని, ప్రధాన కార్యదర్శిగా శ్రీ పిల్లలమఱ్ఱి వెంకటేశ్వర్లుగారిని ఏకగ్రీవంగా యెన్నుకొన్నారు.

షరతులను యజమానులు అంగీకరించనందున పనివారల యూనియన్ తిరిగి సమ్మెను 11 వ తేదీనుండి ప్రారంభింప బడునని నోటీసు నిచ్చిరి.

కాకినాడ

బళ్ళవాళ్ళ సమ్మె విజయం.

కాకినాడలో బళ్ళవాళ్లు 1వ తేదీని సమ్మె ప్రారంభించిరి రెండవ తేదీని కాకినాడ మునిసిపల్ సంఘాధ్యక్షుని వద్దకుపోయి తమ కష్టాలను నివేదించుకొన్నారు. బళ్ళవాళ్లు చెల్లించ వలసిన లైసెన్సు ఫీజు రు 1-0-0 తగ్గించ వలసినదని తాము ప్రభుత్వమునకు వ్రాసితిమనియు ప్రభుత్వము 0-8-0 తగ్గించుటకే ఒప్పుకొన్నదనియు, బళ్ళగేటు వద్ద సాగే గేటు పన్ను వసూలు ఈ సంవత్సరానికి ఆపు చేయుట కష్టమనియు, లైసెన్సు చెల్లించవలసిన గడువుకాలం ఇంకొక రెండు నెలలు హెచ్చించుటకు మునిసిపాలిటీ అంగీకరిస్తుందనియూ చెప్పారు. కొందరు మునిసిపల్ సంఘ సభ్యులు యీ సమ్మె విషయమై చర్చించుటకు గాను కౌన్సిలు మీటింగు జరుపవలసినదని రిక్విజిషన్ పంపగా 4 వ తేదీని ఆ సమావేశము జరిగింది. ఆ సమావేశము వద్దకు సమ్మెదారులు కూడ వెళ్ళారు. బళ్ళవాళ్ళ సమస్య విషయములో తాను వెనుక చెప్పిన సమాధానాన్నే మునిసిపల్ ఛైర్మన్‌గారు చెప్పారు. సమ్మెదారులా షరతుల కంగీకరింపక అప్పటి నుండీ వెళ్ళిపోయారు. ఆనాడు కాకినాడ పట్టణంలోని యితర కార్మికులు కూడా ఈ సమ్మెలో సానుభూతిని చూపడానికి కలిశారు. 6 వ తేదీని గేటు పన్ను తాను, ఈ సంవత్సరానికి వసూలు చేయనని కంట్రాక్టరు అంగీకరించారు. లైసెన్సు ఫీజు రు 1-0-0 తగ్గించ వలసినదని ప్రభుత్వానికి రికమెండు చేయడానికిని, లైసెన్సు వసూలు చేసే గడువు రెండు నెలలు ఎక్కువ చేస్తామనియు ఛైర్మన్‌గారు అంగీకరించారు. అందుపై 6వ తేదీ సాయంత్రం 8 గంటలకు సమ్మె విరమింప బడింది.

మద్రాసు

బస్ వర్కర్లకు యజమానులకు సంభాషణలు.

మద్రాస్ బస్ వర్కర్సుకును, యజమానులకును మధ్య రాయబారాలు జరుగుచున్నాయి. రెండు పక్షాలవారూ ఈనెల 6 వ తేదీని సమావేశమైనారు. కార్మిక సంఘాధ్యక్షులయిన, పి. ఆర్. కె. శర్మగారు ఈదిగువ షరతులను ప్రతిపాదించారు.

1. క్రొత్తగా పనిలో చేర్చుకోబడిన వారిని తొలగించి వారిస్థానే పాతవారిని యథావిధిగా పనిలో చేర్చుకోవాలి.

2. క్రొత్తగా పనిలో చేరినవారిని యూనియన్ సభ్యులుగా తీసుకొనుటకు యూనియన్ వారంగీకరిస్తారు.

3. ఉద్యోగాలేవైన కాళీవస్తే యీ క్రొత్త వర్కర్లను ఆ పనులలో యజమానులు నియమించాలి.

4. మోటారు వర్కర్లు పనిచేసే గంటలు 9 గా మారుటచే, బస్సులు తిరిగే అదనపు టైములలో పనిచేయుటకు యీ క్రొత్త వర్కర్లను తీసుకోవాలి.

హిందుస్థాన్ ట్రాన్సుపోర్టుకో, జనరల్ పబ్లిక్ సర్వీస్‌కో, యజమానులు యీ రాజీ సంభాషణలలో పాల్గొనుట కంగీకరించారు. అందుచే కార్మికులు పికెటింగును మానివేశారు.

ఝరియా

సమ్మెలో మిలిటరీ బందోబస్తు.

ఝరియా బొగ్గుగనులలో పనిచేసే కూలీలు 2,000 మంది, ఎక్కువ కూలి కావాలని సమ్మె ప్రారంభించారు. ఇందుపై ప్రభుత్వము 144 సెక్షన్ జారీ చేసింది, మిలిటరీని కూడా గనుల వద్ద కాపలా వేసింది. ఒక పర్యాయం లాఠీ చార్జికూడా జరిగింది. బొగ్గు గనులవద్ద అలజడి చాలా ఎక్కువగా వుంది. గనులలో తాత్కాలికంగా పని ఆపుచేశారు. తమ కోర్కెలను తెలియజేయ వలసిందని కత్రాస్ గని యజమానులు కార్మికులను కోరారు కార్మికు లందుకు అంగీకరించారు. రాయబారాలు జరుగుచున్నాయి. కాని మిలిటరీ బందోబస్తును మాత్రం యింకా ప్రభుత్వం అల్లాగే వుంచింది.

అమృత బెంగాల్ ప్రధాని హక్కు ఉపన్యసిస్తూ తానిదివరలో కొందర పనులలో నిమగ్నుడై ఉండడంచేత కార్మికుల సదుపాయాలను చూడలేక పోయినాననియు, ఇకముందు నుండి ఆ ప్రయత్నాలు చేస్తాననియు కార్మికుల సభలో చెప్పారు. ఈవరకే స్టేయిన్ స్ట్రయిక్‌ను నిషేధిస్తూ ఆర్డరు వేశారు. ఇప్పుడు సమ్మె సమయంలో మిలిటరీ బందోబస్తును కూడా ఏర్పాటు చేయించారు. ఇదేనా కార్మికులకు మేలు చేయడానికి ప్రయత్నించడం?

కలకత్తా

పికెటర్ల అరెస్టు.

ఇసావి అగిపెట్టెల ఫ్యాక్టరీలో కొన్ని దినాలనుంచి సమ్మె జరుగుతోంది యజమానులు కొందరు కూలీలను ఏదో విధముగా పనిలోకి తీసుక వెళ్ళి పని చేయించుకో గలుగుతున్నారు. సమ్మెదారులు పికెటింగు చేస్తున్నారు. 5 వ తేదీని ముగ్గురు పికెటర్లు అరెస్టు చేయబడ్డారు.

20,000 మంది సమ్మె.

దుర్గా పూజకై, టిటాఘర్‌లోని జ్యూటు మిల్లు మూసివేశారు. యిందువల్ల తమకు కలిగిన నష్టాన్ని కూడదీసుకోడానికై శనివారము శలవు అయినప్పటికీ ఆ రోజున పనిచేస్తామని కార్మికులు యజమానులను కోరారు. యజమానులు నిరాకరించారు. అందుచే 20,000 మంది కార్మికులు 6వ తేదీని సమ్మె ప్రారంభించారు. యజమానులు మిల్లును మూసివేశారు.

44 కార్మికుల అరెస్టు.

కలకత్తాలో ఇతర పనులు చేసే కార్మికులు ఆదివారం శలవు ఏర్పాటు చేసుకోడానికి అనేక దినాల నుండి ప్రచారం చేసుకుంటున్నారు. సుభాస్ చంద్రబోసుగారు కూడా ఇందు విషయమై కార్మికుల తరఫున పనిచేశారు. కార్మికులు తమ ప్రచారాన్ని మామూలుగా సాగించుకొంటున్నారు. సభలు పెట్టుచున్నారు. ఈ సందర్భంలో 6వ తేదీనుండి 10 వ తేదీలోగా 44 కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు.

కోయంబత్తూరు

మిల్లు యజమానుల క్రొత్త ఎత్తు.

కోయంబత్తూరులో మురుగన్ మిల్లు యజమానులు అక్టోబరు 1వ తేదీనుండి రాత్రి డ్యూటీలను నిలుపుచేశారు ఈ విధంగా పనిలో నుండి కార్మికులను తొలగించుటకు ప్రారంభించారు. ఇందుపై తమ అసమ్మతిని తెలుపుతూ పగలు డ్యూటీలో పనిచేసే కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ సమస్య పరిష్కరించడానికై కార్మిక నాయకులు యజమానులు ప్రయత్నాలు చేస్తున్నారు.

బొంబాయి

బొంబాయి కార్మిక తగాదా బిల్లు పట్ల అసమ్మతిని తెలుపుతూ బొంబాయి రాష్ట్రంలోని కార్మికులందరూ అక్టోబరు 17 వ తేదీని జనరల్ స్ట్రయికు చేయవలసిందని బొంబాయి రాష్ట్ర కార్మిక సంఘం కార్మికులను హెచ్చరించింది. అఖిల భారత కార్మిక సంఘం కూడా దీనిని ఆమోదించింది. కార్మిక నాయకులిందుకై కృషి చేస్తున్నారు.

ఈ స్థితిలో బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు సంఘము బొంబాయిలో సమావేశమై బొంబాయి ప్రభుత్వము చేయుచున్న కార్మిక తగాదా బిల్లు కార్మికులకు చాలా ఉపయోగకారి అనియు, ఎన్నికల ప్రణాళికకు అనుగుణంగానే ఉన్నదనియు, కార్మిక నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారానికి మోసపోయి వృధాగా సమ్మెచేసి 1 రోజు కూలిని పోగొట్టుకో వద్దని కార్మికులను హెచ్చరించింది. బొంబాయి కార్మిక తగాదా బిల్లుకు అనుకూలంగా ప్రచారం చేసి కార్మికులను ఉద్ధరించ వలసిందని అన్ని జిల్లా కాంగ్రెసు కమిటీలకూ సర్క్యులరులను పంపింది.

ఇంకొక వంక బొంబాయి శాసన సభలో కార్మిక నాయకులు యీ బిల్లు తీవ్రంగా ఖండిస్తుంటే కార్మికులలో కాంగ్రెసుకే ఎక్కువ పలుకుబడి వుందో కార్మిక సంఘానికే ఎక్కువ పలుకుబడి వుందో గత శాసన సభా ఎన్నికలే చెప్పాయని మంత్రులు ప్రగల్భాలు కొడుతున్నారు.

యుద్ధానంతరం చైనా భవిష్యత్తు ఏమిటి?

సోషలిజం రాకతప్పదు.

శ్రీ నండూరి ప్రసాదరావు

ప్రపంచ చరిత్ర యందలి ఒక వీర గాథ ఇప్పుడు చైనాలో ప్రదర్శిత మౌతోంది. గొరిల్లా యుద్ధాలలో జపాన్ ముష్కరుల నెదుర్కొంటూ ఆత్మ సంరక్షణ చేసుకొంటున్న చైనా వీరుల కథయే అది. అనేక పుస్తకాలలోను, పత్రికలలోను దాన్ని అందరూ చదివే ఉంటారు. గాన తిరిగి ఇక్కడ చెప్పటం చర్వితచర్వణం. కథ మాత్రం ఎల్లరూ తెలిసికో దగినటువంటి సర్వాంగ శోభితమైనట్టిది. ప్రతీకారమింత తీక్ష్ణంగాను, ఇంత ఉన్నత భావగర్భితంగాను ప్రదర్శింపబడటం జగన్నాటకంలోనే చాలా అరుదు. జాతీయ చైనాచే తరిమి తరిమి కొట్టబడ్డట్టిన్ని, ఏదో భూతంక్రింద జమకట్టబడి దూషింపబడ్డట్టిన్ని. రెడ్ (కమ్యూనిస్టు) ఆర్మీ నేడు చీనా జాతికి దాని దీన దశలో పట్టుగొమ్మ అవటం అపూర్వ ఘటన! తమ పాత పగలన్నింటినీ రెడ్ ఆర్మీ (కమ్యూ[illegible]) విస్మరించుటచే ఈ ప్రతీకారం మరింత ఉన్నతమైనది. పైగా, గతాన్నంతా మరిచిపోవటమే గాక, నేడు తమపై గుప్పింపబడే బహుమానాల నైనా గమనించకుండా రెడ్ ఆర్మీ హృదయపూర్వకంగా జాతీయ సేనలతో కలిసిపోయింది. ఎంత అపూర్వము! ఎంత అద్భుతము! గూబ గుయ్యిమనేటట్టు ఈ చెంప మీద కొడితే, ఇంకా కొట్టమని రెండో చెంపను కూడా తిప్పటంలో ఉన్న గొప్పతనాన్ని గుర్తించగలిగినవారే జంగ్-కై-షేక్‌కు నేడు జరిగిన పరాభవాన్ని ఊహించగల్గుతారు.

రెడ్ ఆర్మీ విజయం

అయినా ఈ ప్రసక్తి యిక్కడ అక్కరలేదు. రెడ్ ఆర్మీ నేడు యుద్ధంలో పాల్గొంటున్న విషయం కన్నను ప్రాముఖ్యత గలది, అది సంపాదించిన్న విషయం మరొకటి యున్నది. చైనా రైతులు ఆయుధపాణులగుచున్నారు. రెడ్ ఆర్మీయొక్క పట్టుదలచే దాని పలుకుబడి క్రింద ఉన్న రాష్ట్రాలలోనే గాక ఇతర రాష్ట్రాలలో కూడా గొరిల్లా యుద్ధాలు సాగింపబడుతున్నాయి. ఉదాహరణకు ఒక్క ఛెకియాంగ్ రాష్ట్రంలోనే నెలకు 30,000 మంది రైతులు గొరిల్లా యుద్ధ నిపుణులుగా తయారౌతున్నారు. 3నెలల తర్ఫీదు పొందిన పిమ్మట వారిలో 10,000 మంది సైనికులు యుద్ధరంగానికి పోతారు; మిగతా 20,000 మంది తుపాకులు, తోటాలతో సహా ఇళ్లకు మరలుతారు. పైగా వీలయినప్పుడల్లా శత్రువుల తుపాకులు, మందుగుండు సామానులు, పట్టుకోవాలని వీరికి కఠినమైన ఉత్తరువులు ఉన్నాయి. క్రమ క్రమంగా అన్ని చోట్ల ఈపద్ధతి అవలంబింపబడుతోంది. అయితే, ఈ ఆయుధాలు తిరిగి ఇవ్వబడవు; శాశ్వతంగా రైతుల స్వాధీనంలోనే ఉండిపోతాయి. ఓహో, ఎట్టి అమూల్యమయిన హక్కు!

ఇదే జంగ్-కై-షేక్‌పై రెడ్ ఆర్మీ విజయం. వారికి బహుమానాలుగాని, పొగడ్తలుగాని ఏమీ అవసరం లేదు; రైతులకు ఆయుధాలు కావాలి. జంగ్-కై-షేకుకు ఇది అర్థం కాకపోలేదు. రైతులు సాయుధులయినారంటే క్రూర ప్రభువులు, ధనవంతుల పరిపాలన అంతమొందినదన్నమాట. ఆయుధ పాణులగు రైతులు పన్నుల భారాన్ని సహించరు గదా; తమపైకి పంపబడే సైన్యాలకు కూడా జడవరు. ఆయుధాల మహత్తు ఇదీ: చైనా జాతీయ ప్రభుత్వ మేర్పడినప్పటి నుండి జంగ్-కై-షేక్ తన స్వంత సైనికుల్ని వదలినాడు కాడు. ఆయుధాలున్నవాడే బలవంతుడని ఆతనికి తెలుసును. కాబట్టి ప్రజాస్వామ్య దేశానికి అధ్యక్షుడుగా నుండుట కంటే సర్వ సైన్యాధిపతిగానుండుటయే లాభకరమనుకున్నాడు. కాని, కూలికి వచ్చిన సైనికుల కన్న తమ ఆస్తి పాస్తుల్ని రక్షించుకుంటానికి సంసిద్ధులయిన సాయుధులగు రైతులు ఎక్కువ పట్టుదలతో పోరాడుతారు గదా!

కాబట్టే, జంగ్-కై-షేక్ ఆఖరు నిమిషంలోనే, తమ ఇళ్లు వాకిళ్లను, భూముల్ని కాపాడుకోటానికి కృతనిశ్చయులయిన రైతుల వల్లనే చైనా ఐక్యత కాపాడబడుతుందని స్పష్టంగా గ్రహించ గల్గినప్పుడే, గొరిల్లా యుద్ధాలు జరుపుటకు సమ్మతించాడు. తన బోటి నిరంకుశాధికారుల అధికారానికి సాయుధులగు రైతులయినా, జపాన్ చేతుల్లో ఓటమియైనా తనకు అపాయకరమే. అతడీ రెండింటిలోను ఏదో ఒక దానిని ఏరుకొనవలసి వచ్చింది. ప్రస్తుతపు చైనా స్థితి గతుల్ని చూస్తే జపాన్ చేతుల్లో ఓటమియే మరీ దారుణంగాను, మరీ సన్నిహితంగాను కన్పించింది. కాబట్టే రైతులకు ఆయుధాలిచ్చుటకు అంగీకరించాడు!

జపాన్ గనుక గెల్చిందా, రైతులచే అస్త్ర సన్యాసం జేయించు భారం దానిదే. దాన్ని జపాను చేయ గల్గుతుందో లేదో వేరే పెద్ద ప్రశ్న. నిజానికి రైతులు ఆయుధాల్ని దాచేస్తారు. దానివల్ల పోరాటం చాలా కాలం సాగుటయే కాక, యుద్ధానంతరం ఆర్థిక పునర్నిర్మాణం దుస్సాధ్య మవుతుంది.

అటుతరువాయి సమస్య

ఇక్కడ మనం ఇంకో విషయం ఊహించ వచ్చును. స్వయంగా యుద్ధంలో జయించుటవల్ల గాక పోయినా, చైనా, జపానును ఆర్థికంగా నిస్త్రాణం చేసి గెలవవచ్చు. అప్పుడు యుద్ధం ముగిసిన తర్వాత చైనాను ఎదుర్కొనే సమస్య, విప్లవం: ఇంత వరకు కని విని ఎరుగని అపూర్వమైన విప్లవం. అది వెంటనే జరుగుతుందా అనేది కూడా ఒక ప్రశ్నయే. బహుశ జరగక పోవచ్చు. చైనావంటి దేశంలో ఆకస్మికంగా ఏమీ జరుగదు. ఆ విప్లవం రక్తపాత పూరితమా, రక్తపాత రహితమా అనేది మరొక ప్రశ్న. బహుశః అది రక్తపాతం లేకుండానే జరగవచ్చు; ఎందుకంటే, చైనా దేశస్థులు జాగ్రదస్తులు. బలప్రయోగం కన్న తార్కిక బుద్ధికే ప్రాధాన్య మిస్తారు. ప్రజాపార్టీ దిక్కున చాలా తర్క బలం ఉంది-ఆయుధపాణులగు రైతులకుండే తర్క బలమంతా వారికి ఉంది. దీనికి సామ్యం తిరిగి అమెరికను చరిత్రలోనే దొరుకుతుంది. పూర్వపు రోజుల్లో అమెరికాలో రైతులు తమ వేట తుపాకుల బలంతోనే అమెరికా ప్రజాస్వామ్యాన్ని సృష్టించారు.

కాబట్టి యుద్ధానంతరం ఏర్పడే పరిష్కారంతో గొప్ప అంతఃకలహాని కేమీ తావులేదని మనం గ్రహించవచ్చు. సరి; విప్లవం పూర్తి యౌతుంది; ఇంతవరకు యుద్ధ పిశాచంచే పీడింపబడ్డ దేశం, నిజమైన ప్రజాపార్టీ యాజమాన్యాన మిక్కిలి త్వరలో, నవనవోన్మేషంగా వికసించటం చూసి ప్రపంచం దిగ్భ్రమ చెందుతుంది.

ఈ వికాసం ఎట్లా సాధ్యము? దీనికి జవాబు సులభం. ఆఖరికి ఒక పురుషాంతరంవరకైనా ప్రజాపార్టీ యొక్క కార్యక్రమం చాలా సులువుగా వుంటుంది. మొట్టమొదట వ్యవసాయం వైపు మళ్ళుతుంది; పంటల్ని పండించుతుంది; ఎవరి దగ్గరైనా డబ్బుంటే, తీసుకొని, ప్రజలకొరకు పంట విత్తనాల్ని, ఇతర అవసరాల్ని కొంటుంది. భూములు లేనివారికి భూస్వాములు తమ భూముల్ని పంచిపెట్టాలిలి. ఈవిధంగా వ్యవసాయమే పునర్నిర్మాణానికి ఆధారంగా ఉంటుంది.

రెండవది, రెడ్ ఆర్మీ దృష్టిలో మిక్కిలి ప్రాముఖ్యమైన విషయం రాజకీయ చైతన్యం. ఇదివరకు బోల్షివిక్కులు భావించినట్లుగా కమ్యూనిస్టు చైతన్యం కాదు. ఇది తరతరాల్నిబట్టి చెదురు చెదురుగా నివసించటాన్నిబట్టి వ్యక్తికే ప్రాధాన్యం ఇచ్చేదైనా, చాలాకాలం నుండి కుటుంబజీవనానికి, జాతి కట్టుబాట్లకు, గ్రామ స్వపరిపాలనకు అలవాటుపడ్డ ప్రజాతంత్ర బీజాలను కల్గినట్టి చైనా నాగరికతకు సన్నిహితమైన ఆచరణ సాధ్యమగు సోషలిజం. ఇందు, ఒక మనిషీ, వాని పొరుగువాడూ సమానమే. అతను శక్తికొలది సంపాదించుకుంటానికి అడ్డంకు లేమీ లేవు. కాబట్టి యుద్ధం పూర్తిగా ముగిసిన తర్వాత, కరువు కాటకాలు అంతమొందిన పిమ్మట, స్వయంగా కష్టించి పైకి రావడానికి ప్రతి వ్యక్తికి కొంత అవకాశ ముంటుంది.

యుద్ధానంతరం?

ప్రస్తుతపు ధీమంతుల ప్రభుత్వాన్ని గూర్చి చెప్పకోదగ్గదల్లా ఒక్కటే: పూర్వపు సామ్రాజ్యం యొక్క పతనానికీ, రాబోయే నిజమైన ప్రజాస్వామ్యానికీ మధ్య అది ఒక మెట్టు. కాని దీని పతనం కూడా దాదాపుగా సమీపించింది. భవిష్యత్తులో నిజమైన అధికారం చలాయించేది, నేడు స్వాతంత్ర్యానికై ఆయుధాలను ధరించిన రైతులే.

చిరకాలం నుండి ఈ రైతులు, బందిపోటు జీవనానికిని గొరిల్లా యుద్ధాలకు అలవాటు పడ్డారు. పన్నుల భారంచేత, నిరంకుశ పరిపాలనచేత క్రుంగిపోయే జీవనానికి అలవాటు పడ్డారు. కష్ట సహిష్ణుత వారి రక్త మాంసాలలో జీర్ణించుకు పోయింది. దీని నంతా వారు మెదలకుండా భరించటం వారికి ఆయుధాలు లేకపోవటం వల్లనే. "శాంతి" అని గొప్పగా చెప్పకొనే సుస్థితికై నేటి ప్రభుత్వం, పూర్వపు ప్రభుత్వముకూడా ఇతర దేశాల ప్రభుత్వాల వలెనే, రైతులకు ఆయుధాలందకుండా జాగ్రత్త పడుతూవచ్చింది. ఇక ముందో!

చైనా రైతులు ఇంకా చాలా కాలం పూరి గుడిసెల్లోనే కాపుర ముండవలసి వుంటుంది. వారు చదువు సంధ్యలు నేర్చుకొంటానికి చాలా కాలం పడుతుంది. బహుశ చాలా మంది నేర్చుకొననేలేరు. కాని, యుద్ధం పూర్తి అయ్యాక వారి కొక మనశ్శాంతి ఉంటుంది: తమ హక్కుల్ని సంపాదించుకుంటానికి, చరిత్రలో ఇదివరకు అనేక దేశాల ప్రజా సామాన్యం జరిపిన పోరాటాల స్థితిని ఒక్క దాటుతో గెంతివేసినట్లు సంతృప్తి పడ్డారు.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ

కార్యనిర్వాహక వర్గ సమావేశము.
ఈనెల 2, 3, 4, తేదీలలో బెజవాడలో సమావేశమై గావించిన తీర్మానములు.

1. కామ్రేడ్ అన్నపూర్ణయ్యగారు పార్టీ శ్రేయస్సుకొరకు వెంటనే తమ రాజీనామాను ఉపసంహరించుకొని యథావిధిగా నవశక్తి సంపాదకులుగను, పార్టీ సహాయకార్యదర్శిగను పనిచేయవలెనని ఈ కమిటీవారు హృదయ పూర్వకముగా వారిని కోరుచున్నారు.

2. కామ్రేడ్సు కామేశ్వరరావు, అల్లూరి సత్యనారాయణగార్లు కార్యనిర్వాహక సభ్యత్వమునకు ఇచ్చిన రాజీనామా ఉపసంహరించుకోమని కోరగా వారు ఉపసంహరించు కొనిరి [కామ్రేడ్ సత్యనారాయణ పత్రికలలో ఈ వరకు రాజీనామావార్త తప్పు అని ప్రకటించినారు. ఆయన ఉద్దేశము సాధారణసభ్యత్వమునకు ఇవ్వలేదనియే.]

3. సోవియటు పోస్టర్లను చూపించడానికి, బెంమాల్కర్‌ను ఆంధ్రరాష్ట్రములో ఒక నెల రోజులు పర్యటనము చేయుటకు ఆహ్వానించడమైనది.

4. డిసెంబరు 1వ తేదీనుండి పశ్చిమ గోదావరిలో వ్యాయామశిక్షణశిబిరము ఏర్పాటు చేయాలి. తాలూకాకు ఒకరినిపొ॥ ప్రతిజిల్లా పార్టీయు కేవలము యువజనపనినే చేయుటకు తయారైన వ్యక్తులను పంపాలి. స్కూలులో 125 మందికి మించకూడదు. నెలకు రు. 12-0-0 లు భోజనఖర్చులకు, డ్రెస్సులకు ప్రతివ్యక్తీ కట్టవలయును. ఏర్పాట్లుచేయుటకు అల్లూరి సత్యంను నియమించడమైనది.

5. కాశీపట్నంవిషయం ప్రతిజిల్లా పార్టీయు తీవ్రముగా ఆందోళనచేయాలి. రైతులయొక్క హక్కులను బలపరుస్తూ రైతులమీద కేసులను ఉపసంహరించుకొనవలసినదని ప్రభుత్వమును కోరుచూ తీర్మానము చేయించుటకు పార్టీ సభ్యులు పూర్తిగా కృషిచేయాలి.

6. పొన్నలగడ్డ రామలింగయ్య వెన్నెలకంటి రాఘవయ్యగారితో మాట్లాడి రాష్ట్ర వ్యవసాయకూలీసంఘము యెడల ఏ దృక్పథము వహించవలసినది రిపోర్టు మరుచటి కార్యనిర్వాహకవర్గముముందు పెట్టవలసినదిగా నిశ్చయించడమైనది.

7. పార్టీ ట్రేడుయూనియన్ పన్యు చూచి నసిపుటకు (1) పోలేపెద్ది నరసింహమూర్తి, (2) కె. యల్. నరసింహం, (3) పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గార్లను నియమించడమైనది. కన్వీనరు కె. యల్. నరసింహం.

8. రాయలసీమ రాజకీయ, ఆర్థికపాఠశాల 1938 డిసెంబరునెలలో కర్నూలుజిల్లాలో ఏర్పాటుచేయుటకు తీర్మానించడమైనది.

* * *

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వార్తలు

కాకినాడ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యనిర్వాహక వర్గ సభ సమావేశము, గాంధీ నగరములో ది 26-9-38 న గం॥ 4 లకు సాయంత్రము జరిగెను.

తీర్మానాలు.

(1) పందిరి మల్లికార్జునరావుగారు జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యత్వమునకు రాజీనామా యిచ్చి రెండు మాసములైనది. కారణాంతరములచే రాజీనామా నిచ్చుచుంటినని తెల్పిరి. రాజీనామా అంగీకరింప బడింది ఈ మధ్యను వార్తా పత్రికలలో ఆం. రా. కాం. సోషలిస్టు పార్టీ మీద ఆధారములులేని నేరారోపణలు చేయుచూ తమవంటి మార్కిస్టులకు పార్టీలో స్థానము లేదని ప్రకటించారు. తమకుగల సంప్లయింట్లు పార్టీ కార్యనిర్వాహక వర్గములో గాని, సాధారణ సభలలో గాని తెల్పకొనక బయటకు వెడలి కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ప్రతిష్ఠకు భంగము కలుగునట్లు గావించిన వర్తనను యీ సభ పూర్తిగా నిరసించుచున్నది

(2) కాకినాడ స్టీమరు పడవలలో పనిచేసే కూలీలు దాదాపు రెండు వేలు గలరు. వారి కష్ట సుఖములు తెలుసుకొని వారిని ఒక యూనియను క్రింద ఏర్పరచి వారి ఇబ్బందులను నెరవేర్చే విధానము ఏర్పాటు చేయుటకు ఒక కమిటీని ఏర్పాటు చేసిరి.

(3) కాకినాడ ప్రెస్ వర్కర్సు యూనియనును బలపరచ వలసినదిగా సభ తీర్మానిస్తూ ప్రెస్ వర్కర్ల ప్రతినిధులతో సంప్రతించుటకై ఒక కమిటీని ఏర్పాటు చేసినది.

(4) ఈ నెల 28 వ తేదీని ఢిల్లీలో కాంగ్రెసు ప్రధానులతో జరిగిన కాంగ్రెసు వర్కింగు కమిటీ మీటింగునందు మదరాసు కాంగ్రెసు ప్రధాని రాజగోపాలాచారిగారు క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టును ఉపయోగించుటను న్యాయమేయని వాదించుటను ఈ సభ పూర్తిగా ఖండించు చున్నది. సామ్రాజ్యవాదులు భారతదేశ శాసనసభ్యమునకై వినియోగించిన శాసనములతో కాంగ్రెసు మంత్రులు బాధ్యత పెట్టుకోరాదని ఈ సభ ఖండిస్తున్నది. ఇండియా ఆక్టు, రద్దు చేయుటకై ప్రజలకు వాగ్దానమిచ్చి శాసన సభల కేగిన కాంగ్రెసు ప్రతినిధి సామ్రాజ్యవాదుల క్రూర శాసనములు ఉపయోగించుట చాల దోషమని యీ సభ పూర్తిగా నిరసించు చున్నది.

(5) నేడు ప్రపంచ పరిస్థితి యుద్ధ వాతావరణలో నిండియున్నది. బ్రిటిషు ప్రభుత్వ యుద్ధ ప్రయత్నాలను భారతదేశ ప్రజలు ఎదుర్కొనుటకు కాంగ్రెసు మహాసభ సరియగు పద్ధతి నిర్ణయించాలి.

యం. వి. వీరయ్య.
సెక్రటరీ
సిటీ కాం. సో. పార్టీ.

* * *

పీరులపాడు కాం. సో. పార్టీసమావేశము.

10-9-38 న యేలెళ్ళ వెంకటసుబ్బయ్య గారి అధ్యక్షతను సమావేశమై ఈక్రింది తీర్మానములను గావించిరి.

(1) గాంధీగారు పికెటింగు హింసయని యిచ్చిన స్టేటుమెంటును కూలీలయొక్క సామాన్య పోరాటహక్కులను కూడా పోగొట్టుటయని భావిస్తూ ఆ స్టేటుమెంటును వెంటనే ఉపసంహరించు కోవలెనని.

(2) రాజగోపాలాచారి గారు క్రిమినల్ లాఅమెండు మెంటు ఆక్టును రద్దు పరచనందులకు ఖండిస్తూ

(3) యుద్ధాల బిల్లును నిరసిస్తూ

(4) చెర్వుకొమ్ము పాలెం, మునగాల, కాశీపట్నం రైతులకు సానుభూతిని తెలియజేస్తూ తీర్మానించిరి.

(5) ఫెడరేషను, యుద్ధములకు, వ్యతిరేకముగా తాలూకా అంతయు తిరిగి ప్రచారము చేయుటకు యీక్రింది వారిని ఒక కమిటీగా నియమించిరి.

1. వాసిరెడ్డి శివలింగ ప్రసాద్
2. యేలెళ్ళ వెంకటసుబ్బయ్య
2. రేపాల బుచ్చిరామశేషయ్య
4. పొట్లూరి సుందరం
5. వాసిరెడ్డి నారాయణరావు

వాసిరెడ్డి నారాయణరావు,
కార్యదర్శి.

కొత్తపేట తాలూకాలో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

తూ. గో. జిల్లా కొత్తపేట తాలూకాలోని మందపల్లి, దేవరపల్లి, ఈతకోట, పొడగట్లపల్లి, గంటి మొదలగు గ్రామాలలో కామ్రేడ్సు చింతం సత్యనారాయణరావు, పి. అనంతంగార్లు సంచారముచేసి కాంగ్రెసు ఉద్యమమును గురించియు, ఫెడరేషన్, సామ్రాజ్య యుద్ధములను గురించియు ప్రబోధం చేసిరి. ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణ యాత్రాదళము వారు సమర్పించిన మెమోరాండంలోని జమీను రైతుల కోర్కెల ననుసరించి వెంటనే ఎస్టేట్సు ల్యాండు సవరణ చట్టము ప్యాసు చేయవలసినదిగా మద్రాసు మంత్రివర్గము వారిని కోరుచూ ప్రతి గ్రామము నుండి మహజర్లు పంపబడినవి.

(ఒక విలేఖరి)

* * *

రేపల్లె తాలూకా కాం॥ సో॥ పార్టీ.

చెరుకుపల్లిలో డా॥ మృత్యుంజయరావుగారి అధ్యక్షతను సమావేశమై యీ క్రింది తీర్మానములను గావించెను.

1. రైతు భూములకు జాయంటు పట్టాలుగా యుండుటచే శిస్తు వసూలు సమయమున రైతులు చాలా కష్టపడు చున్నారు. గాన ప్రభుత్వమువారు జాయింటు పట్టాల నన్నిటిని, సబ్ డివిజన్ ఫీజు లేకుండనే, విడగొట్టి సింగిల్ పట్టాలు చేయించవలసినదిగా యీ సభవారు ప్రభుత్వము వారిని కోరుచున్నారు.

2. యీ తాలూకాలో మురుగువల్ల నష్టపడుచున్న భూముల విషయమై క్రిందటి నెల 26 న రేపల్లెలో జరిగిన యిరిగేషను కాన్ఫరెన్సులో చెప్పగా మురుగు కాల్వల మరమ్మతుగాను స్పెషల్ స్టాఫ్‌ను వేయదలచినట్లు యెగ్జిక్యూటివు యింజనీయర్‌గారు చెప్పినారు. ఆ సందర్భములో చేయవలసిన మరమ్మతు విషయమై యీ సభవారు చేయు సూచనలను అంగీకరించునట్లు స్పెషల్ స్టాఫ్‌వారికి ఆజ్ఞాపించ వలసినదిగా యీ సభవారు ప్రభుత్వము వారిని కోరుచున్నారు.

3. యుద్ధ ప్రతికూల, ఫెడరేషను ప్రతికూల ప్రచార సందర్భములో జిల్లా పార్టీవారి ఆదేశాను సారము యీతాలూకాలో ప్రచారము చేసి దానికి తగిన పని చేయగలందులకు యీ సంఘము తరుపున కార్యదర్శిని నియమించడమయినది.

4. మద్రాసు ప్రధాని కమ్యూనిస్టు పార్టీపై చేసిన ప్రకటనపట్ల అసమ్మతిని తెల్పుచునూ, క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టును మద్రాసు ప్రభుత్వము రద్దుచేయక సమర్థించుటను ఖండిస్తూ, ఇదివరలో నిషేధించిన గ్రంథాలపై నిషేధము తొలగించకపోగా, కొత్తగా "మన్యంలో రైతుల తిరుగుబాటు" అను పుస్తకాన్ని నిషేధించుటను నిరశిస్తూ, అవి తొలగించ వలసినదిగా తీర్మానాలు గావించిరి.

★ వివిధ సంఘ వార్తలు ★★

అక్టోబరు 17 వ తేదీ

బొంబాయి కార్మికులను అభినందించు దినోత్సవము.

ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గారు యిట్లు వ్రాయుచున్నారు:—

బొంబాయి శాసన సభలో కార్మిక హక్కులకు ప్రతిబంధకమగు కార్మిక బిల్లు ఆమోదింప బడబోవుచున్నది. కార్మిక నాయకులందరు ఈ బిల్లులోని లోటుపాటులను కాంగ్రెసు మంత్రి వర్గమునకు తెలియజేసిరి. ఈ బిల్లును వుపసంహరించు కొనవలసినదని, బాంబే ట్రేడ్ యూనియన్ కాంగ్రెసువారు కాంగ్రెస్ మంత్రి వర్గమును బ్రతిమాలుకొనిరి. కాని కాంగ్రెస్ మంత్రివర్గము కార్మిక నాయకుల కోర్కెను మన్నింప నిరాకరించినది. కనీసము ఈ బిల్లును సెలక్టు కమిటీకి పంపుటకు నైనను కాంగ్రెసు మంత్రివర్గము అంగీకరించలేదు. అందువలన కార్మిక వర్గమంతా తమ సర్వ సామాన్యమైన హక్కును నిలబెట్టు కొనుటకు ప్రత్యక్ష కార్యరూపము ద్వారా ఈ బిల్లును ఎదుర్కొనవలసి వచ్చినది. కార్మికోద్యమములో పాల్గొనుచున్న అతివాద మితవాదు లందరు ఈ బిల్లును యెదుర్కొనుటకు ఒక రోజు సమ్మె బొంబాయి రాష్ట్రమందలి కార్మిక వర్గమంతయు జరుపవలెనని నిశ్చయించుకొనిరి. బొంబాయి ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అక్టోబరు 17 వ తేదీ సోమవారము నాడు జనరల్ స్ట్రయిక్ చేయవలెనని నిశ్చయించినది.

ఆరోజున బాంబే రాష్ట్ర కార్మిక వర్గము ఈ కార్మిక బిల్లును ప్రత్యక్ష కార్యరూపము ద్వారా యెదుర్కొను చున్నందులకు వారిని అభినందించుచూ కాంగ్రెస్ మంత్రి వర్గమును ఈ బిల్లును వుపసంహరించు కొనవలెనని కోరుటకు మన రాష్ట్రమంతట ఊరేగింపులు, బహిరంగ సభలు జరుపవలెను. కనుక అక్టోబరు 17 వ తేదీ కార్మిక సంఘములు వూరేగింపులు, బహిరంగసభలు జరుపవలెనని కోరుచున్నాను.

★

చీరాల పొగాకు పనివారల సంఘ దినోత్సవం.

చీరాల పొగాకు పనివారలు యజమానుల చేతుల్లో పడుతున్న అన్యాయాలు, అత్యాచారాలు ఉంతింత కాదు. వారు కోరిన స్వల్ప హక్కులను యివ్వకపోగా, వారిపై యజమానులు పోలీసుల చేత లాఠీఛార్జీలు చేయించారు. బోలెడుమంది పనివారలను అరెస్టు చేయించారు. పనివారి నందరిని పనిలోనుంచి తీసివేస్తున్నారు. పనివారలకు అనేక బెదురులు పెట్టి లొంగదీస్తూ తమకు అనుకూలంగా ప్రవర్తించేటట్లు చేసుకుంటున్నారు. అట్లు లొంగకుండా సంఘ పక్షమున నిలబడుతున్న వారినందరిని నిర్దాక్షిణ్యంగా నిరుద్యోగులను చేసివేస్తున్నారు. సంఘంలో పనివారలకు గుమాస్తాలకు మధ్య చీలికలు కల్పించి సంఘాన్ని బలహీన పరచి తమకు అడ్డు అన్నది లేకుండా చేసుకొని తమ అన్యాయాలను పనివారలపై గుమాస్తాలపై నిర్భయముగా సాగించుకుంటూ [illegible] ద్వారా గవర్నమెంటు ఇవ్వమన్న కొద్దిపాటి హక్కులను కూడ పనివారలకు ఇవ్వకుండా వారిష్టం వచ్చినట్లు పనివారి శ్రమనంతా కొల్లగొట్టటానికి అనేక తంత్రాలు చేస్తున్నారు. వీటిఅన్నిటి ఫలితంగా పనివారల సంఘం రోజు రోజుకు యజమానులు సాగిస్తున్న నిరంకుశత్వాన్ని ధైర్యంగా యెదుర్కోవలసి వచ్చుచున్నది.

ఇట్టి పరిస్థితుల్లో చీరాల పొగాకు పనివారలకు తగిన ధైర్యము, ప్రోత్సాహము యిచ్చి, యజమానులు చేస్తున్న అన్యాయాలను యెదుర్కోటానికి గాను, ధైర్యోత్సాహముల తోటి పోరాటమును సాగించ గలందులకు పనివారలకు సంపూర్ణ సానుభూతిని బలాన్ని యివ్వాలి. ఎంతో ధైర్యంగా తమ హక్కులను రాబట్టుకోటానికి పోరాటము సల్పి మన రాష్ట్రములోని ప్రజా ఉద్యమానికి ఎంతో బలమిచ్చిన చీరాల కార్మికులకు సానుభూతిని చూపుటకై అక్టోబరు 17 వ తేదీని గుంటూరు జిల్లాలో చీరాల పొగాకు పనివారల సంఘ దినోత్సవాన్ని జరుపవలెను. రైతు సంఘాలు, కాంగ్రెసు కమిటీలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కూలీల సంఘాలు, విద్యార్థి సంఘాలు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీలు, క్రిమినల్ ట్రైబ్సు సంఘాలు కలిసి యీదినోత్సవమును మనజిల్లాలోని అన్నిప్రాంతాలలోను జయప్రదముగా జరుపవలెను. ఆ దినోత్సవానికి సంబంధించిన రిపోర్టు కాపీలను చీరాల పొగాకు పనివారల సంఘానికి, జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి, జిల్లా కాంగ్రెసు కమిటీకి, రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి, నేషనల్ ఫ్రంటు పత్రికకు పంపించవలెను.

ఇట్లు
గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ
" రైతు సంఘం
" వ్యవసాయ కూలీల సంఘం
" క్రిమినల్ ట్రైబ్సు సంఘం
" విద్యార్థి ఫెడరేషను
" కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

★

రామచంద్రపురం తాలూకా వ్యవసాయ కూలీ మహాసభ.

కపిలేశ్వరపురం, అక్టోబరు 4.

నేడు ఇచ్చట తాలూకా వ్యవసాయ కూలీ మహాసభ జరిగెను, ఉదయం గ. 8-0 లకు వర్షము కురియుచున్నను యువకులు గ్రామమంతయు కాంగ్రెసు, కార్మిక, కర్షక జండాలతో రైతు కూలీ గీతాలు పాడుచు గ్రామమంతయు ఊరేగింపు జరిపిరి. తరువాత గ. 1 లకు మహాసభ కార్యక్రమము ప్రారంభమైనది. అధ్యక్షులు గద్దం మహాలక్ష్మి గారు ప్రస్తుత వ్యవసాయ కూలీల దుస్థితిని గూర్చియు, వీరికి గల పిచ్చి నమ్మకాలవల్ల వీరు పొందుతున్న నష్టములను గూర్చియు విపులముగా తెలియజేస్తూ వారి కష్టములు పోవాలంటే అంతా సంఘాలలో చేరి సంఘశక్తిని వృద్ధిచేసుకోవాలని చెప్పిరి. తరువాత కామ్రేడ్ సూరిబొట్ల సూర్యనారాయణమూర్తిగారు వ్యవసాయ కూలీ స్థితినిగూర్చియు, కామ్రేడ్ ఫేన్మెత్స సూర్యనారాయణగారు వర్గ సంఘాల అవశ్యకత కాంగ్రెస్‌తో జాతీయ ఐక్య సంఘటనను గూర్చి [illegible] కౌలుదార్ల వ్యవసాయ కూలీల కనీసపు కోర్కెల గూర్చియు, కామ్రేడ్ చింతం సత్యనారాయణ రావుగారు రైతులు కూలీలు కలిసి వ్యవసాయపు కూలీ పారిశ్రామిక కూలీల పరస్పర సంబంధమును గురించియు పనిచేయవలసిన ఆవసరాన్ని గూర్చియు, కామ్రేడ్ పి. అనంతంగారు సోషలిజం, ఫెడరేషను యుద్ధాలు గురించియు కామ్రేడ్ చొప్పల నవరత్నంగారు రైతు కూలీ సామరస్యాన్ని గూర్చియు, కామ్రేడ్ యస్. అప్పలస్వామిగారు కామ్రేడ్ ఇనుగంటి నారాయణరావుగారు జమీందారీ విధానంలో కూలీలు, రైతులు పడుకష్టాలను గురించియు విపులముగా ఉపన్యాసాలు గావించిరి. (ఒక విలేఖరి)

★

మునగాల రైతు సంఘం

21-9-38 తారీఖున మునగాలలో శ్రీయుత నండూరి ప్రసాదరావు గారి అధ్యక్షతక్రింద మునగాల జమీన్ రైతుసంఘ సాధారణ సభ జరుపబడి ఆమోదింపబడిన తీర్మానముల సారాంశము

1. మునగాల జమీన్ రైతుసంఘము కృష్ణాజిల్లా రైతుసంఘమునకు అనుబంధ సంఘముగా నుండుటకు

2 జమీన్ రైతులు చెల్లించవలసిన శిస్తులు పంట ఫలసాయము చేతికివచ్చి తగు ధరలో అమ్మకంచేసుకొని చెల్లించ వీలగునట్లు జనవరి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నాలుగు సమాన వాయిదాలుగా వసూలు యిచ్చుటకున్ను యిలాగా రైతులయొక్క అమరకం ఖాతాలున్ను శిస్తు జాబితాలున్ను జమీ అన్ని గ్రామముల తాలూకువి జమీన్ రైతుసంఘ అధ్యక్షులగు శ్రీనల్లపాటి వెంకటరామ నర్సయ్య గారికి వెంటనే సప్లయి చేయించుటకున్ను శ్రీజమీన్ దారుగారిని కోరుట

3. రైతుల తాలూకు తాటి, ఈత చెట్లను రైతు అనుమతి చీటీ పొందేవరకు గీత గీయకూడదని కల్లుదుకాణ దారులను, అట్టిచెట్లకు మార్కింగు చేయకూడదని అబ్కారి డిపార్టుమెంటువారిని కోరుట.

మునగాల, 21-9-38 } న. వెం. రా. నర్సయ్య
ప్రసిడెంటు.
మునగాల జమీన్ రైతు సంఘము.

గుంటూరు జిల్లా రైతు సంఘము రైతు సోదరులకు విజ్ఞప్తి.

భారతదేశంలో రైతు వుద్యమానికి పుట్టినిల్లయిన గుంటూరు జిల్లా రైతు వుద్యమము యెడ చూపుచున్న విశ్వాసము ప్రశంసనీయము. 1937 సెప్టెంబరులో ఆంధ్రదేశ రైతు రక్షణయాత్ర వారికిచ్చిన అపూర్వ స్వాగతాలవల్ల, [illegible] బాధా నివారణ యాత్రలను జరుపుటవల్ల వివిధ జిల్లాలకు ఆదర్శప్రాయ మైనది.

కాని గత సంవత్సరం సభ్యుల సంఖ్యను బట్టి చూచిన, కొన్ని జిల్లాల కంటె మనము వెనుకబడినట్లు తెలియగలదు. ఈ లోటును తీర్చుటలో తీవ్ర కృషిసలిపి, ఏ జిల్లా కంటెనూ తీసిపోకుండునట్లు చేయాలి. యీ నెలాఖరు లోగా మన జిల్లా నుండి 2000 మందినైన చేర్పించాలని రాష్ట్ర సంఘమువారు నిర్ణయించారు. గనుక రైతు వుద్యమాభిమానులు తగినంత శ్రద్ధ తీసుకోవాలని, రైతులందరు సంఘములలో చేరవలెననియు కోరుచున్నాము.

జిల్లా రైతు సంఘ కార్యవర్గ సమావేశ తీర్మానం ప్రకారం యీ దిగువవారిని జిల్లా యందు, ఆయా తాలూకాలలో ఆర్గనైజర్లుగా యుండి ప్రచారం చేసి సంఘ సభ్యులను చేర్పించుటకు సంఘములు స్థాపించుటకు అధికారము యివ్వటమైనది.

(1) ఒంగోలు, బాపట్ల
బాచిన సుబ్బారావుగారు, చింతగుంపల్లె.
కె. రాధాకృష్ణయ్యగారు, మున్నంవారిపాలెం.

(2) రేపల్లె తాలూకా
కుడితపూడి సత్యనారాయణగారు, తాలూకా ఆర్గనైజరు, [illegible]

(3) నరసారావుపేట, సత్తెనపల్లి, పల్నాడు
శ్రీ గిరిరాజు సత్యనారాయణగారు, నరసారావుపేట.

(4) తెనాలి, రేపల్లె
కె. యల్. యన్. సింహాగారు.
వాశిరెడ్డి బుచ్చినాయుడుగారు.

అనంతవరం, } ఇట్లు
ధూళిపాళ్ళ కోటయ్య.
అధ్యక్షుడు.

రష్యాను పడగొట్టడానికి

శ్రీ పుచ్చలపల్లి


గత 15 దినాలలో ప్రపంచం చాల మారింది. జెకోస్లోవేకియాలోని సూడెటను ప్రాంతమంతా జర్మనీ ఆక్రమించుకొంది. నూటికి ఒక్క జర్మనీ వ్యక్తి చొప్పున కూడాలేనిపట్టణాలు బ్రిటిషు, ఫ్రెంచి, జర్మనీ ప్రతినిధులు గల అంతర్జాతీయ కమిటీ నిర్ణయ ప్రకారము జర్మనీకి ఇవ్వబడ్డాయి. టెస్చెన్ ప్రాంతాన్ని పోలెండు ఆక్రమించుకుంది. డాన్యూబు నదీతీరాన ఉన్న ప్రాంతాన్ని హంగరీ ఆక్రమించుకొంటూ ఉంది. ఇక మిగిలిన దేశములో మూడు జాతు లున్నాయి: జెక్కులు, స్లోవక్కులు, రసోస్కార్పేతియనులు. స్లోవక్కులు స్వతంత్ర రాష్ట్రాన్ని కోరారు. దానికి అంగీకరించక తప్పదు. జెక్కులకు ఒక పార్లమెంటు, స్లోవక్కులకు ఒక పార్లమెంటు, రసోస్కార్పేతియనులకు మరియొక పార్లమెంటు. ఈ మూడు స్వతంత్ర రాష్ట్రాలు కలసి, ఒక విధమైన ఫెడరేషనులో ఉంటాయి. అయితే ఈ "వికృత జెకోస్లోవేకియా"కు ఆర్థికంగా గాని, రాజకీయంగా గాని స్వతంత్రత ఉండదు. వారి ఫ్యాక్టరీలన్నిటిని, ఆయుధ సామగ్రి నంతటిని, ప్రధానమైన కోటల నన్నింటిని జర్మనీ, పోలెండు, హంగరీలు ఆక్రమించుకొన్నాయి. జెకోస్లోవేకియా ఇకనుండి కేవలము జర్మనీ క్రింద ఒక కాలనీ మాత్రమే. ఈసంగతి గ్రహించే, డాక్టరు బీనెస్ తన అధ్యక్ష స్థానానికి రాజీనామా నిచ్చాడు.

ఈగతికి కారణం

జెకోస్లోవేకియాకు ఈగతి పట్టడానికి కారణమేమి? ఫ్రాన్సు, బ్రిటనులు తమ వాగ్దానము ప్రకారము సహాయము చేయకపోవడము ప్రధాన కారణము. అంటే ఫ్రాన్సు బ్రిటను ప్రభుత్వాల ద్రోహము ప్రధాన కారణము. కాని సోవియట్ యూనియను సహాయము చేస్తానని చెప్తూ ఉండినా, జెకోస్లోవేకియా, బ్రిటిషు ఫ్రెంచి సూచనలకు సెప్టెంబరు 18 వ తారీఖున లొంగిపోవడము, తిరిగి హిట్లరు అల్టిమేటమునకు కూడ లొంగిపోవడము కూడ ఈ స్థితికి కారణమని చెప్పక తప్పదు. స్పెయిను ప్రధాని "మేము యే ప్రభుత్వమునుండీ సహాయము వస్తుందని ఆశపడి ఊరకుండలేదు. మాబలమును నమ్ముకొని మేముజయించే విశ్వాసంతో పోరాడుతాము" అన్నాడు. గత రెండు సంవత్సరాలుగా ఇటలీ జర్మనీలతో పోట్లాడుతున్నాడు. జెకోస్లోవేకియా కూడ ఆవిధంగా పోరాడితే తన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవడమే గాక సోవియటు ప్రభుత్వాన్ని ఈరోజు ఎదుర్కొంటూ ఉన్న విషమ స్థితిని రానివ్వకుండా చేసేది. ప్రపంచమం దంతా కర్షక కార్మికులు, ప్రజాతంత్ర ప్రజాసామాన్యము నేడు ఎదుర్కొనవలసిన విషమ స్థితిని, లేకుండ చేసేది.

బ్రిటిషు ప్రభుత్వము, ఫ్రెంచి ప్రభుత్వము, హిట్లరుకు ఈవిధంగా లొంగిపోడానికి కారణము? వారికి ఆయుధ బలము లేక గాదు. హిట్లరు ప్రాబల్యము ఎక్కువయ్యే కొలది తమ లాభాలకు నష్టము వస్తుందని గ్రహించకపోవడము కాదు. హిట్లరు ప్రాబల్యము ఎక్కువయితే, హిట్లరు ముసోలినీలను తృప్తిపరచడానికి, బ్రిటిషు ప్రభుత్వము, జర్మనీనుండి గత ప్రపంచ యుద్ధమున తీసుకొనిన కాలనీలను తిరిగి ఇచ్చివేయవలసి ఉంటుంది. ఫ్రాంసు ఆఫ్రికాలో ఇటలీకి కావలసిన సహాయముకూడ చేయాలసి ఉంటుంది. అయినా ఈ లొంగిపోడానికి కారణము, తమకు జర్మనీ నుండి నష్టము వచ్చినా సరే గాని హిట్లరు ముసోలినీలను పడిస్తే, జర్మనీ, ఇటలీ దేశాలలో సోషలిస్టు సోవియటు ప్రభుత్వాలు వస్తాయని భయపడ్డాయి. తమ వర్గ లాభాలకోసం, పెట్టుబడిదారీ ప్రభుత్వాలయిన బ్రిటను ఫ్రెంచి ప్రభుత్వాలు హిట్లరుకు లొంగిపోయాయి.

జెకోస్లోవేకియా పెట్టుబడిదారీ ప్రభుత్వముకూడ ఈ దృక్పథముతోనే బ్రిటను ఫ్రెంచి ప్రభుత్వాల సూచనల నంగీకరించి హిట్లరుకు దాసోహమన్నది. రష్యాపై దండెత్తడానికి జెకోస్లోవేకియా జర్మనీతో కలవాలి. ఈ వరకే ఆ విధంగా కలసిపోతే, జెకోస్లో



ఇటలీ నియంత ముసోలినీ

వేకియా బూర్జువా వర్గానికి (పెట్టుబడి దారులు ధనవంతులు) జర్మనీ ధనిక వర్గాన్నుండి నష్టము కలుగుతుంది. అందుచే ఫ్రెంచి పెట్టుబడిదారీ ప్రభుత్వము, బ్రిటిషు పెట్టుబడిదారీ ప్రభుత్వము తమకు సహాయము చేస్తాయనే నమ్మకముతో జర్మనీకి లొంగలేదు. కాని ఏనాడు ఫ్రెంచి, బ్రిటిషు ధనికవర్గాలు సోవియట్ యూనియన్‌పై హిట్లరు దాడికి అనుకూలించినాయో, ఆరోజు జెకోస్లోవేకియా బూర్జువాకూడ వారితో చేతులు కలిపింది. దేశ స్వాతంత్ర్యాన్ని, ప్రజా సామాన్యముయొక్క ఆర్థిక రాజకీయ హక్కులను, తమ స్వలాభాలను, అవి ఈ వరకు కన్న తక్కువే అయినను, జెకోస్లోవేకియా పెట్టుబడిదారులు అమ్మేశారు!

వివిధ ప్రభుత్వాల ఎత్తుగడలు

ఛాంబర్లేను ప్రభుత్వము జర్మనీతో ఒడంబడిక చేసుకుంది, ఒకరిపై నొకరు ఇక ముందెప్పుడూ యుద్ధము చేయమని. అట్టి ఒడంబడికనే జర్మనీ ఫ్రాంసులు కూడా చేసుకుంటాయని వార్తలు వస్తున్నాయి. ఇదివరలో ఇంగ్లండు ఇటలీలు చేసుకొన్న ఒడంబడికను అమలుజరుపుతారట. ఫ్రాంసు ఇటలీలు కూడ కలుస్తాయట! ఈ వరకే హంగరీ, యుగోస్లోవియా, రుమేనీయా, గ్రీసు, పోలండులు, జర్మనీ, ఇటలీల ప్రాబల్యము క్రిందకు వచ్చాయి. జపాను చైనాతో యుద్ధం చేస్తూ ఉంది. రష్యాతో యుద్ధానికి కాలు దువ్వుతూ ఉంది. ఈ దేశాలన్నీ సోవియట్ రష్యాపై ప్రపంచ మందలి ఏకైక కార్మిక కర్షక రాజ్యముపై దండెత్తడానికి ఒడంబడికలు చేసుకుంటున్నాయి.

"జర్నల్ డి మాస్కో" అనే రష్యా పత్రిక ఫ్రాంకో సోవియట్ ఒడంబడిక ఇక నామ మాత్రమే అని చెప్పింది. రష్యా ఫ్రాంసులు ఒకరి

కుట్ర



జర్మనీ నియంత హిట్లర్

కొకరు సహాయము చేసుకోడానికి అవకాశము కల్గించే జెకోస్లోవేకియా బలహీనమైనపుడు, ఫ్రెంచి సోవియట్ ఒడంబడిక చిత్తు కాగితమే అని ప్రకటించింది.

యుద్ధాన్ని ఆపు చేయడానికి, మేము ఈలాంటి షరతులకు గూడ అంగీకరించాము. జెకోస్లోవేకియాను కూడ నామ మాత్రంగా చేశాము: అని చెప్పడము కేవలము బూటకము. యుద్ధాన్ని రానివ్వకుండా చేయడమే నిజమయితే, ఇంగ్లీషు ప్రభుత్వము ఆయుధాలను పెంపొందించుకోవలసిన అవసర మేమిటి? ఇంకా యుద్ధాలు కావాలి, ఇంకా ఆయుధాలు కావాలి అని ఇంగ్లీషు పత్రికలన్నీ గోల పెట్టడములో అర్థ మేమిటి? ఈ యుద్ధ ప్రయత్నాలన్నీ దేని కోసం: జవాబు వేరే చెప్ప నవసరములేదు.

రష్యాపై యుద్ధము చేయడానికే.

స్పెయిన్‌లో ఇటలీజర్మనుల బూటకత్వాన్ని మరింత బట్ట బయలు చేయడానికి ప్రధాని నెగ్రిన్ అంతర్జాతీయ వాలంటీర్లను వారి వారి దేశాలకు పంపి వేస్తున్నాడు. ఫ్రాంకో ఏదో విధంగా స్పెయిన్ ప్రభుత్వ సైనికులను తమ వైపుకు త్రిప్పుకోడానికి బాంబులకు బదులు రొట్టెలను ప్రభుత్వ సైనికులపై విమానాలనుండి వేస్తున్నాడు. అయితే ప్రభుత్వము ఈ యెత్తులకు లొంగలేదు. యుద్ధం తీవ్రంగా సాగుతూంది. దీనిని పరిష్కరించడానికి ఇంగ్లండు ఇటలీలు లాలోచీచేస్తూ ఉన్నాయి.

చైనా మీద జపాను తీవ్రంగా యుద్ధము సాగిస్తూ ఉంది. చైనా దక్షిణమునసున్న కాంటను నగరముకూడ వశ పర్చుకోడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆఖరి వార్తలు.

ప్రజాసామాన్యపు కర్తవ్యం


ఈ పరిస్థితులలో, ప్రపంచము నందలి కష్టజీవు

యూరప్ రాజ్యాల కుట్ర.

సుందరయ్య

లందరి యొక్క కర్తవ్య మేమిటి? ప్రజా తంత్ర హక్కుల గోరే ప్రజా సామాన్యపు కర్తవ్య మేమిటి? రష్యాపై యుద్ధము చేయడానికి ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలన్నీ సన్నాహాలు చేస్తూ ఉంటే రష్యా ఎవరిమీద ఆధార పడిందో ఆప్రపంచ కష్టజీవుల కర్తవ్య మేమిటి?

దార్లు



బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేను

గత మహా యుద్ధములో (1914-18 లో) రెండవ అంతర్జాతీయ సోషలిస్టు పార్టీలు, తమ తమ పెట్టుబడిదారీ" ప్రభుత్వాలను బలపరచి ప్రపంచ కష్ట జీవుల కందరికి మహా ద్రోహము చేశాయి. యుద్ధము అయిపోయిన పిదప, జర్మనీ, ఆస్ట్రియా మొదలగు దేశాలలో కార్మిక విప్లవాలను, మర ఫిరంగులతో అణచివేశారు. ఈ ద్రోహానికి ఒడికట్టని సోషలిస్టులు, లెనిను నాయకత్వాన మూడవ అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభగా ఏర్పడి పని చేస్తూ వచ్చారు. వీరు కార్మికుల నందరిని కలిపి పోరాటాన్ని సాగించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాల నన్నింటిని రెండవ అంతర్జాతీయ సోషలిస్టు మహా సభకు చెందిన సోషలిస్టు నాయకులు, కార్మిక నాయకులు భగ్నం కావించారు. హిట్లరును ఎదుర్కొనడానికి కలసి పని చేస్తామని ఎన్ని పర్యాయాలు జర్మనీ కమ్యూనిస్టులు జర్మనీ సోషలిస్టులను కోరినా వారు నిరాకరించారు. హిట్లరు అధికారానికి రావడముతో, సోషలిస్టులు తమ పూర్వపు దృక్పధాన్ని మార్చుకొని కమ్యూనిస్టులతో కలసి, ఫాసిస్టులను ఎదుర్కొనడానికి తయారవుతారని అందరూ ఆశించారు. ఆ ఆశ కొంత వరకు ఫలించింది కూడ.

ఫ్రాంసులోను, స్పెయినులోను, కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలసి, పాప్యులర్ ఫ్రంటు (ఐక్యసంఘటన) ఏర్పరచి ఫాసిజాన్ని ఎదుర్కొన్నారు. ఇంతవరకూ జయప్రదంగా పౌరసత్వపు హక్కులను ప్రజాతంత్ర ప్రభుత్వాలను కాపాడుకోగలిగారు. కేవలము ఒక్క బ్రిటిషు లేబరుపార్టీ మాత్రము, కమ్యూనిస్టులతో ఎట్టి సంబంధమూ ఉండకూడదని పట్టుపట్టుతూ వచ్చింది.

సోషలిస్టుల వెనుకటి నాటకమే

రష్యాను చుట్టుముట్టి దానిపై దాడి వెడలడానికి జెకోస్లోవేకియాను హిట్లరు కబళిస్తూ ఉంటే, దానికి తోడ్పడిన దలదీరు ఫ్రెంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క కమ్యూనిస్టులే ఓటు చేశారు. సోషలిస్టు లందరూ దలదీరు ప్రభుత్వాన్ని బలపరుస్తూ ఓటుచేశారు. ఇంతకంటె మహాద్రోహము మరేమీ ఉండదు. తిరిగి యూరోపియను సోషలిస్టులు, తాము 20 యేండ్ల క్రితము ఆడిన నాటకాన్నే (పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు ఊతకొమ్మగా పని చేయడము) తిరిగి ఆడుతారా?

ఇంగ్లండులో లేబరుపార్టీవారు ఛాంబర్లేనుకు వ్యతిరేకంగా ఓటు చేశారు. వారికి మెజారిటీ లేనందున వారు తక్కువమంది కాన, వీరి ఓటు కన్న వీరి చర్యలు ప్రధానముగ తీసుకోవాలి. నేడు కమ్యూనిస్టులకు వ్యతిరేకముగా వారు గావిస్తున్న ప్రచారము చూచితే, సరియైన దృక్పధ మవలంబిస్తారని ఆశ లేదు.



ఫ్రెంచి సేనాని జనరల్ జోసెఫ్

బ్రిటిషు లేబరుపార్టీ ఫ్రెంచి సోషలిస్టు పార్టీలు స్పెయిను ప్రభుత్వానికి ద్రోహము చేశాయి. నేడు జెకోస్లోవేకియా ప్రభుత్వానికి ద్రోహము చేశాయి. ఇక హిట్లరు రష్యాపై యుద్ధము సాగించే రోజున వీరిపై ఇంకా నమ్మకము వహిస్తే....

కార్మిక పార్టీల కర్తవ్యం

ప్రపంచ కార్మికులెవరూ ఇక ఓపిక వహించ కూడదు. వెంటనే తమ తమ దేశాలలోని పెట్టుబడిదారీ ప్రభుత్వాల ఆటలను సాగనివ్వక పని చేయాలి. రష్యామీద యుద్ధము చేయడానికి ఎట్టి సన్నాహము చేసినా ఎదుర్కోవాలి రష్యా మీద యుద్ధము ప్రకటిస్తే, తాము జనరల్ స్ట్రయికుతో ఎదుర్కొంటామని ప్రకటించాలి.

ఈలోపల స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలను, ఆహార పదార్థాలను విరివిగా పంపడానికి, తాటస్థ్య విధానాన్ని రద్దు చేయడానికి తమ తమ ప్రభుత్వములపై బ్రహ్మాండమగు ఒత్తిడి తేవాలి. జపానుమీద శాంక్షనులు ప్రయోగించేటట్లు తమ ప్రభుత్వాలను ఒత్తిడి చేయాలి. వీనిని తమ ప్రభుత్వాలు చేయకపోతే దాని అర్థము, తమ ప్రభుత్వాలు రష్యాపై దండెత్తడానికి ప్రయత్నిస్తున్నట్లు భావించి, అవసరమయితే జనరల్ స్ట్రయికును ఆరంభించాలి.

రష్యా యొక్క బలము; ఆశ; ఒక్క రష్యా యొక్కయే కాదు మానవజాతి యొక్క ఆశ, ప్రపంచ కార్మికుల మీద, కష్టజీవుల మీద ఉంది. వారు సరియైన నాయకత్వాన, కమ్యూనిస్టు దృక్పథముతో, పని చేయడములోనే ప్రపంచ శాంతి, ప్రపంచ నాగరికత ఆధారపడి ఉన్నాయి.

సోవియటు రష్యా, కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభ, ప్రపంచ విప్లవానికి ద్రోహము చేస్తున్నాయనీ, పాప్యులర్ ఫ్రంటు విధానము, కార్మిక విప్లవాన్ని భగ్నము కావిస్తూ ఉందని ఇంగ్లండులో ఇండిపెండెంటు లేబరుపార్టీవారు, వారి ననుసరించి మన దేశములో కామ్రేడ్ మసానీ ప్రచారము సాగిస్తూవచ్చారు. కాని గత వారములో ఇండిపెండెంటు లేబరుపార్టీవారు ఛాంబర్లేనుకు వ్యతిరేకంగా కూడా ఓటువేయక, తటస్థంగా ఉన్నారు. కాని దానికి ముందు ఛేంబర్లేను శాంతిని కాపాడాడని పొగిడారు.

ఈ విషమ దశలో సరియైన దృక్పథముతో, ధైర్యముగా ఛేంబర్లేను, దలదీరుల ద్రోహాన్ని ఎదుర్కొన్న వారు కమ్యూనిస్టులే. నేటికైనా ప్రపంచ కష్టజీవులు, కొలదిమంది యూరోపియను సోషలిస్టు నాయకుల ననుసరించక రష్యాకు పూర్తిగ సహకారము చేయడానికి అహోరాత్రాలు అతి జాగరూకతతో ఉండాలి.

మన దేశములో మనము చేయాలసిన దేమిటి?

పరాధీన దేశమైనా, రష్యాకు మనము మిగిలిన దేశాల కన్న ఎక్కువ సహాయము చేయ గలము. రష్యాకు నేడు సహాయము నేయడమంటే ప్రపంచ శాంతిని కాపాడడము, మానవత్వాన్ని కాపాడడము, మన స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొనడమే. బ్రిటిషు ప్రభుత్వము రష్యాపై దండెత్తడానికి పూర్వము, తత్ప్రయత్నంగా మన దేశంలో ఫెడరేషనును నెలకొల్పడానికి పూర్తిగా ప్రయత్నిస్తుంది. ఫాసిస్టులతో కలసి మానవత్వాన్ని నాశనం గావిస్తూ ఉన్న బ్రిటిషు ప్రభుత్వముతో మన మెట్టి రాజీ పడరాదు. మన కెట్టి హక్కు లిచ్చినా, మనము లొంగ కూడదు. సంపూర్ణ స్వాతంత్ర్యము రానంత వరకు తృప్తి చెంద కూడదు. బ్రిటిషుప్రభుత్వము గాని, దాని ఉద్యోగస్థులుగాని గ్రామ గ్రామాల అనేక రూపాల డబ్బు వసూలు చేస్తారు. అనేక మాయ మాటలతో సైన్యాన్ని ప్రోగు చేస్తారు. గ్రామ గ్రామాన మన ప్రచారము సాగాలి.

1. బ్రిటిషు ప్రభుత్వానికి, దాని ఏజంట్లకు, ఒక దమ్మిడీకూడ అప్పు ఇవ్వకూడదు.
2. బ్రిటీషు సైన్యంలోగాని, పోలీసు దళములో గాని ఒకడూ కూడ చేర కూడదు.
3. యుద్ధము ప్రకటిస్తే జవహరిలాల్ చెప్పినట్లు వెంటనే పన్నుల నిరాకరణ ఆరంభించాలి.
4. స్వదేశ సంస్థానాలలో కూడ ఈ వరకే చెలరేగుతూ ఉన్న స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ప్రజ్వరిల్లజేయాలి.

దీనితో సైన్యముకూడ మనతో చేరుతుంది. 18 సంవత్సరముల వయస్సు వచ్చిన వారందరూ ఎన్నుకొనిన ప్రతినిధులతో కూడిన కాన్‌స్టిట్యూయంటు అసెంబ్లీ మన రాజ్యాంగ విధానాన్ని నిర్ణయిస్తుంది. మన స్వాతంత్ర్య పోరాటాన్ని ఎంత తీవ్రత చేస్తామో అంత ఎక్కువగా రష్యాకు, మానవ జాతికి, నడుమ మనకు మనమే సహాయము చేసుకొన్న వారమవుతాము.



మీ కుట్రలు నాకు తెలుసు!

—స్టాలిన్

ఈదశలో బ్రిటిషు ప్రభుత్వము రాజీ ప్రయత్నాలు చేయాలనేవాడు, చేసేవాడు, ఆప్రశక్తి యెత్తేవాడుకూడ దేశ ద్రోహి; ముమ్మాటికీ దేశ ద్రోహియే; అట్టి ద్రోహులకు మన పోరాటములోగాని, దేశములోగాని స్థానముండదు.

ఫిర్యాదులు

పల్లెటూళ్ళ బడి మేష్టర్ల కష్టాలు.

సాధారణంగా ప్రతి గ్రామంలో ఉపాధ్యాయుడూ, అధమం 8 వ ఫారం వరకేనా చదువుకుని వుంటాడు. అందేత వాళ్ళకుకూడా ఆత్మగౌరవం, అభిమానం తప్పకుండా వుంటవి గదా! పరీక్షాధికార్లూ, బోర్డుతావేదార్లు, వీళ్ళమీద చేసే అధికారం అవమానం, చెప్పటానికి వీలులేకుండా వుంటుంది ఆ నీచత్వాన్ని అనుభవించిన వాళ్ళకేగాని తెలియదు.

పరీక్షాధికార్లు స్కూళ్ళకు దయ చేస్తారు. "బళ్లో పటాలేమేనా వున్నాయా?" అని ముందుగానే అడుగుతారు. పట్నాల్లో అయితే స్కూళ్ళకు పెంకుటిళ్లుంటాయి. పెద్ద గ్రామాల్లో అయితే మిద్దిళ్లుంటాయి. అందేత అక్కడ మేష్టర్లు ఏ అవస్థలోపడి ఆకాస్త మొక్కు తీర్చుకుంటారు. కాని పల్లెటూళ్ళల్లో స్కూళ్ళకి భవనాలు వారపాకలేగా! ఆ పాకల్లో పటాలెక్కడ తగిలించాలో ఆ పరీక్షచేసే అధికారికే తెలియాలిగాని సామాన్యుడికి తెలియదు. వెంటనే కోపం. పరీక్షాధికారికి "నీకేమి శ్రద్ధ లేదంటూ" అనువుగా దొరికిన మేష్టర్ని కసురుతారు. పట్నాల్లో సరిగా వేళకు పిల్లల్ని తలిదండ్రులు పంపిస్తారు. కాని పల్లెల్లో అల్లాకాదు. పల్లెల్లోని ఆర్థిక పరిస్థితులే వేరు. కొంచం ఎదిగొచ్చిన ప్రతి పిల్లాడు గడ్డి తేసుకురావటానికో, గొర్రెలను కాయటానికో, పశువులను కాయటానికో, గంటి తీసుకు పోవటానికో పోతారు. అందేత ఉపాధ్యాయుడు వాళ్ళెక్కడున్నారో ఏమూలున్నారో వెదుక్కుని పట్టుకు తేసుకు రావాల్సొస్తోంది. ఈ లోపుగా ఏ అధికారో చటుక్కుని దిగుతారు. మేష్టరు సరిగా బడిలో వుండటంలేదని రాస్తారు. 154 హుకుం జారీ చేస్తారు. పోనీ అని బళ్లో కూర్చుంటే - పిల్లలురారు. యీ అవస్థల్లో కొట్టుకుంటూ వుంటా దయ్యగారు. యీ అవస్థలన్నీ కూడా తెలిసివుండీ, ఆ మేష్టరు ఇనస్పెక్టరు గారికి పొయిలోకి పుల్లలు పంపలేదనో, నెయ్యి సప్లయి లేదనో, మామూళ్ళివ్వలేదనో, కూరలు తేలేదనో, కోపంతో తెగరాస్తారు మేష్టర్లమీద.

ఇక బోర్డుల సంగతి చూడండి మాదంతా ద్వంద్వ పరిపాలన. మా ప్రాణాలు నిలబెట్టుకోవాలంటే, యీ ఉద్యోగాలు నిలుపుకోవాలంటే ఎల్లాంటి నీచత్వానికేనా తెగించి అవతల మెంబర్లనీ యివతల ఇనస్పెక్టర్లనీ తెగఆశ్రయించాలి. చిత్తం చిత్తం అంటూ వెనకాల తిరగాలి. వాళ్ళ పాదాల్కి మొక్కుతూ యీ దౌర్భాగ్యానికి సిద్ధపడితేనే మేష్టారుకు సీట్లుంటాయి. అలా చేసినా ఏ అయిదారు నెలలకో ఓ జీతమిస్తారు. తక్కినదంతా అపువే! మెంబర్ల అనుగ్రహము వున్నవాళ్ళే ఆ ఊళ్ళల్లో పాతుకపోయుంటారు నీచత్వాన్ని ఏవగించుకునే వాళ్లు నెలకు మూడు గ్రామాల చొ॥న తిరగాల్సిందే. "మహాప్రభో! డబ్బులేదు. దూరదేశం పోలేనంటే "ఒకసారి వేసిన ఆర్డర్లు మార్చటానికి వీలులేదుగా" అంటాడధికారి గర్వంగా. అందులోను జిల్లాబోర్డు పరిపాలన గదా! ఏ మెంబరైనా కోపం వచ్చిందంటే తాలూకాలు తాలూకాలనే దాటించి ట్రాన్స్ఫరు చేస్తారు. ఆ కొస నుండి ఈ కొసకు వచ్చే కష్టాలు మనవిచేసి కొనేందుకు అధికార్ల దగ్గరకెళితే **"You should hand over charge atonce. else you will be seriously dealt with"** అంటూ గర్జిస్తారు. మామీద. ఇదేం ఘోరమంటే కసురుతారు. ఇదేనా వెంటనే చెప్పరే! వాళ్ళ గుమ్మాల ముందు పది రోజులు పడిగాపులు పడ్డాక, బంట్రోతులు దగ్గర నుంచి గుమాస్తాల దాకా ముడుపులు చెల్లించాక దర్శనం దొరుకుతుంది. యీ ఖర్చులికి పెళ్ళాం మెళ్ళో వున్న పుస్తీ పూసా కాస్తా షావుకారు చేతుల్లోకి పోతాయి. యిక మిగిలింది టీచరుకు చీవాట్లు. యిక ఎవరికేనా జబ్బుచేస్తే 10 రోజులికి శలవ దిగితే నాలుగు నెలలు జీతం నష్టం మీద బలవంతంగా కట్టిపెడ్తారు శలవు. అది కేన్సిలు చేయించు కొనేందుకు అధికార్ల దగ్గర కెళ్ళితే "రేపురా మాపురా," అంటూ ఆఫీసు చుట్టూ వెయ్యిసార్లు తిప్పించుకుంటారు. అధమం యీ 50 లు యేనా ఖర్చు పెట్టిస్తారు. ఆ వొచ్చే 17 రూపాయల జీతంలోంచి. ఆఖరికి ఏం చెప్తారు? "త్వరగా ఆర్డరు పంపుతాంలే వెళ్లు అంటారు." సాధారణంగా రాదు. ఖర్మం కాలకొచ్చిందా? ఏ మూలకో పారేస్తారు. పోనీ ఖర్చులేనా యిస్తారా? ఊహూ! అదిలేదు. జీతాలిస్తే ఖర్చు లిచ్చినంత ఫలం. అధికార్లకి వండలకొద్దీ టీఏలుంటాయి. ప్రయాణపు ఖర్చులుంటాయి, బత్తెపు ఖర్చుంటుంది, గ్రామాల్లో సప్లయిలుంటాయి, అంతేనా? ఎన్నో ప్రయివేటు రాబడులుంటాయి. ఇలాంటి దోపిడీగాళ్ళకి. సరిగ్గా సంసారం సాగటానికేనా చాలనీ 17 రూపాయల జీతంతో ఉపాధ్యాయుడు పడే కష్టాలు ఏం వెలుస్తాయి. కడుపు గడవక ఈ ఉద్యోగం చేయడం. అందులో యిన్ని తిప్పలు. పోనీ ప్రోవిడెంటు ఫండులో నైనా అప్పు తెచ్చుకొందామంటే మా పాలిట (విశాఖపట్నం జిల్లాబోర్డులో మాత్రమే అనుకుంటా) ఇన్సూరెన్సు కంపెనీ వచ్చింది. వేలకొద్దీ సంపాదించే అధికార్లు స్వలాభం కోసం మాలాంటి వారి నోట్లో మట్టిగొట్టి ఆ ప్రోవిడెంటు ఫండు కాస్తా ఇన్సూరెన్సు కంపెనీకి కలిపేస్తారు. ఈ చాలీచాలని తిండిలో మేము చావకుండా వుంటే, ఆ ఇన్సూరెన్సు కంపెనీ దివాలా తీయకుండా వుంటే ఆ డబ్బు ఎప్పటికో చేరుతుంది. ముందు వస్తుందో పోతుందో గాని మాకు మట్టుకు ఇప్పుడు ఉన్న కాస్త ప్రాణాలు పోతున్నాయి. యీ మాదిరిగా 5 నెలల కొక జీతంతోటి నెలకు మూడు వూళ్ళ ట్రాన్స్ఫరుతోటి చస్తున్న మాకు యిన్సూరెన్సు కంపెనీ డబ్బుకంటె మరణమే ముందు వస్తుందని చెప్పడానికి సందేహం లేదు. ఇన్సూరెన్సుకు నన్నెలా బలవంత పెట్టిందీ వ్రాస్తాను రెండు ముక్కల్లో. 1936 మే 13 ని సర్క్యులరొకటి జారీచేశారు. మా సెంటర్ యావన్మంది టీచర్లనీ, స్టాఫు లిస్టులతోటి, అప్లైండెన్సు, అడ్మిషను రిజిష్టర్లతోటి హాజరు కావాలని, వేసవికి బడి మూసేముందు అధికార్లను చూడాలని అలా చెయ్యకపోతే కఠినంగా ఆలోచించబడు తుందని వ్రాశారు. తీరా వెళ్ళాం, ఏముంది సంగతి ఇన్సూరెన్సు కంపెనీ ఏజంటుగారు, డాక్టరుగారు, బోర్డు అధికార్లు హాజరు. "ఇన్సూరెన్సు చేస్తావా లేకుంటే నీతాడు తెంచమంటావా?" అని అడిగారు. ఆలోచించుకోమన్నారు. తిరిగి ఇంకో వూరు రమ్మని తాఖీదు చేశారు. ఏళ్ళు, గెడ్డలు దిగి తీరా ఆ వూరెళ్లితే మళ్ళీ మామూలు తంతే! మళ్ళీ భయపెట్టి ఆ ఇన్సూరెన్సు అమ్మవారికి వప్పజెప్పారు. మళ్ళీ ఈ మధ్య యింకో కంపెనీ లేచింది. కొందరిని కబళించింది గాని, ఇంతలో ఏవో అటంకాలు వచ్చి మేము మిగిలిపోయాము. ముందేం జరుగుతుందో. ముష్టిలో వీరముష్టన్నట్లు అధికార బంధువునికి ఉద్యోగాలు లేకపోతే వాళ్ళ వేలకొద్దీ వున్న రాబడిలో కొంత సర్దుకోవాలి గాని ఎలిమెంటరీ స్కూళ్ళ మాష్టర్లని యిల్లా చంపుకు తినటం న్యాయమేనా?

ఇట్లు,
విశాఖపట్నం జిల్లాబోర్డు ఉపాధ్యాయుడు.

విద్యావనం

5 మొ॥ 15 సం॥ వయసు వచ్చిన బాల బాలికల నివాస పాఠశాల,
నాగేశ్వరనగరం.

ఆధునిక విద్యా పద్ధతులపై విద్యగరపుచు మానసిక శిక్షణలతోపాటు శారీరక శిక్షణకు గూడ ప్రాముఖ్యతనిచ్చి పిల్లలను బలాఢ్యులు గను, బుద్ధిమంతులుగను, జ్ఞానవంతులుగను, నిరాడంబర జీవితమును గడపుచు స్వశక్తిపై నాధారపడి జీవయాత్ర గడుపుకొనగల శక్తివంతులుగను, స్వాతంత్ర ప్రియులుగను తయారుచేయు నుద్దేశ్యములతో అక్టోబరు 15వ తేదీ నుండి ప్రారంభమగును.

రాజకీయ బాధితుల పిల్లలకు ఉచితముగాను కొంత రుసుము తగ్గించియు, వీలునుబట్టి చేర్చు కొందుము. ఉత్తర ప్రత్యుత్తరము లీ అడ్రెసుకు జరుపవలెను.

అన్నాప్రగడ సరళాదేవిరావు,
విద్యావనం,
పోస్టు మంతెనవారి పాలెం.
(వయా) పొన్నూరు. గుంటూరు జిల్లా.

దేవుడిచ్చినా పూజారి యివ్వడు !
ఎస్టేటు నౌకర్ల రొష్టు.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్న సామెత మా చల్లపల్లి ఎస్టేటులో అమలులో కొచ్చింది.

రైతు రక్షణార్థమై రైతు సేవకులు బయలుదేరారు. రైతు ఋణ నివారణ చట్ట మమలులో బెట్టబడింది. కాని చట్టరీత్యా కూడా రైతులు లాభాన్ని పొందే రోజులింకా రాలేదట్టుందీ యెస్టేటులో!

ఋణచట్ట ప్రకారం 1347 వ ఫసలీకి శిస్తు కట్టుకోమని సముద్దారుగారిని కోరేము. నాకు పట్టా వివరాలు తెలియవు కరణంగారు కూడా ఉండాలన్నారు. కరణంగారి వద్ద కెళ్ళేసరికి సముద్దారుగారు లేరు కాబట్టి వల్లకాదన్నారు.

ఇలా పదిసార్లు తిరిగేము. ఒకడు ఉండి, ఒకడులేక కాలయాపన చేయబడింది. ఒకనాటెలాగో ఇద్దరూ ఒకేచోట నుండడం సంభవించింది మేము వెళ్లేసరికి, శిస్తు కట్టుకోవల్సిందిగా కోరేము. సరే... యిద్దరూ అంగీకరించేరు, సాయంత్రము వరకూ కాలయాపన చేశారు. సాయంత్రమయ్యే సరికి యివ్వాళకాదు రేపన్నారు. రోజురోజూ ముఖం తప్పించడ మారంభించేరు. ఒకరోజున సముద్దారు గారిని శిస్తు కట్టుకోవలసిందని ఖచ్చితంగా అడిగేము. ఆయన సమాధానము మా కాళ్ళర్యాన్ని కలిగించింది. "1347 వ ఫసలీకి శిస్తు కట్టుకోమని నాకింకా ఆర్డరు రాలేదు. లోగడ ఫసలీల బకాయి యిస్తే కట్టుకుంటానన్నారు.

30 వ తేదీలోపల శిస్తు చెల్లించాలి. గత్యంతరం లేకపోయింది. 28—9—38 వ తేదీన 10 మంది రైతులము బందరుపోయి కలెక్టరు గారి ఆఫీసులో జమకట్టి వచ్చేము. బందరు వెళ్ళినందుకు ఖర్చు రు 30-0-0.

జమీన్ రైతుల కింక రక్షణ యెప్పుడు?

లంకల ఫిర్కా రైతు సంఘం కిష్కింధపాలెం } కొడాలి వీరయ్య, ఆర్గనైజరు.

★ ★ ★

బందరు పాకీపనివారి సంఘం.

పై సంఘం ఈ క్రింది కనీసపు కోర్కెలతో కూడిన ప్రకాశికను ప్రకటించింది. పాకీవారికి నెల 1కి 12-0-0 లకు మించి జీతములుండ కూడదని తెలియజేయు ప్రభుత్వ నిబంధనను రద్దుచేసి, కాంగ్రెసు మంత్రులు నెల 1కి 20-0-0 చొప్పున జీతము ఏర్పాటు చేయుట, ప్రావిడెంటు ఫండు, పెన్షన్ ఏర్పాట్లు, గర్భిణీ స్త్రీలకు రెట్టింపు జీతముపై 2 నెలల సెలవు. పనిపిల్లలను పోషించుటకు క్రీచెస్, బాల, బాలికలకు ఉచిత విద్య, వయోజనులకు రాత్రి పాఠశాలలు; ఆరోగ్యము రక్షించుకొనుటకు rubber gloves, చెప్పులు మొదలైన సాధనములు; ఉచిత వైద్య సహాయము; క్యాజువల్ లీవు ఒక నెల, ప్రివిలేజ్ లీవు, సిక్ లీవ్ ఒక నెల (జీతంతో సహా); ఇండ్లు లేనివారికి ఉచిత గృహములు, వీధికి ఒకటి, రెండు పంపులు, గూడెములో ఎలెక్ట్రి దీపములు; వర్షాకాలంలో వర్షము నుండి కాపాడు కోట్లు; బాగుచేయ వలసిన దొడ్లు ఒక్కొక్కనికి 30 మించి ఉండకూడదు; నిరుద్యోగులకు పనులు; బహు కుటుంబీకులకు ఎలవెన్సు; 50 రూపాయల లోపలి అప్పులను రద్దు చేయుట; పాకీ గూడెం వద్ద మురుగు కాల్వపై వంతెన.

కార్యదర్శి,
పట్టణ పాకీపనివారి సంఘం, బందరు.

20 వ ఆంధ్ర మహా సభ

సర్. యస్. రాధాకృష్ణయ్యగారి అధ్యక్షతను మద్రాసులో జరిగెను

అధ్యక్షోపన్యాసం

20 వ ఆంధ్ర మహాసభ ఈ నెల 8, 9 తేదీలలో మద్రాసులో సర్. సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారి అధ్యక్షతను జరిగినది. అధ్యక్షోపన్యాసములోని ముఖ్యమైన భాగములు మాత్ర మీ దిగువ నిచ్చు చున్నాము.

ప్రపంచ పరిస్థితులు.

యుద్ధము వచ్చి పడుచున్నదని ఈ మధ్య చాలా కలత పుట్టినది. ఆఖరుకు ఏదో రాజీ పడినామన్నారు. ఈ రాజీ, "మొట్టేవానికి మ్రొక్కి దుర్మార్గానికి కట్టుబడితే ఈ ప్రపంచంలో ఎంతైనా దొరకును." అనే సామెతను రుజువు చేసింది. అయితే ఇల్లు అలుకగానే పండగ కాలేదు. మాటి మాటికి సంభవించుచున్న ఈ యుద్ధాలకు మూల కారణం ఆలోచించ వలెను. కొన్ని పరిపాలించు దేశములు, మరికొన్ని పరిపాలింపబడునవి ఉండుటయే ఆ మూల కారణము.

భారత సమస్య.

బ్రిటిష్ కామన్‌వెల్తు ఎన్ని చెప్పిననూ అంతర్యమునకు ఇంపీరియలిస్టే. వారు శాంతి పన్నములు చెప్పుచుండుట, అంతరంగము మారుటచే కాదు: పరిస్థితులు మారుట వల్లనే! భారత దేశమునకు స్వరాజ్యము నేర్పరుచుట భారత దేశమునకే కాక, ప్రపంచమునకే శ్రేయస్కరం.

సాంఘిక విషయము

జనులకు కావలసిన వస్తువులు తయారు చేయు సాధనములు, ఆ తయారైన వస్తువుల నందరికీ పంపకము చేయు సాధనములు వ్యక్తులు తమవని అనుభవించకుండా చేయవలెను. ప్రభుత్వము వశము చేసుకొనవలెను.

సంఘములో రైతే అంతటికీ మూలాధారము సాగు ఫలితముపై వ్యవసాయదారునకు సంపూర్ణమైన హక్కు ఉండవలెను. అందుచే ప్రస్తుతము రైతుకు జమీందారుకు ఉన్న సంబంధము కొంత మార్చవలెను. "భూమి దున్నేవానిదే ఫలసాయముమీది పూర్తిహక్కు" అని ఒప్పుకుంటే, ప్రమాదము లేకుండ తప్పును.

నూతన ఇండియా చట్టము

భారతదేశములో రాజకీయాభివృద్ధి కుల తత్వముల మీద నడుపవలెనని నూతన ఇండియా చట్టములో స్థిరపరచినారు. ఆ చట్టములోని అన్ని లోపముల లోనికి ఇది ప్రబలమైనది.


సంస్థానములు

సంస్థానములలో ప్రజలు నేడు గవర్నమెంటు సంస్థలలో ప్రాతినిధ్యము కావలెననుచున్నారు. ఆందోళన చేయుచున్నారు. అందుచే ఊరక పెనుగులాడక సంస్థానములవారు ప్రజలకు ప్రాథమిక హక్కుల నిచ్చి ప్రాతినిధ్య సంస్థలను వెంటనే స్థాపించుట మంచిది, లేకున్న ఈ రాజ్యములకు మొదటికే మోసము రావచ్చును.

ఆంధ్రరాష్ట్రం

ఆంధ్రరాష్ట్రము కావలయునను ఆందోళన హఠాత్తుగా పుట్టినది కాదు. 1913 వ సం॥ నుండియు సాగుచునే యున్నది. ఆంధ్రదేశమంతా ఒక భూభాగముగా నున్నది. చాల వైశాల్యము కలిగి యున్నది. మనకందరికి ఒక జాతి, ఒక భాష సాంప్రదాయములు, ఒక్కటే పరిశ్రమల నేర్పరచుకొని, ఆర్థికముగ అభివృద్ధి చెందుట కెన్నియో అవకాశము లున్నవి.

మద్రాసు మంత్రివర్గమువారు ఆంధ్ర రాష్ట్రమునకు అనుకూలముగా వ్రాసినారని వినుట సంతోషదాయకము. కాని మద్రాసు శాసనసభలో జరిగిన తీర్మానము నాకు నచ్చలేదు. అందు విశేష మేమియు లేదు. ఒక స్పష్టమైన కోరికతో ప్రారంభమై ఒక సిద్ధాంతముతో అంత మగుచున్నది. సిద్ధాంతముతో పాటు ఆంధ్రరాష్ట్రము కావలెనని కూడ చేర్చవలసినది.



"ఆంధ్ర రాష్ట్రోద్యమము తీవ్ర రూపము పొందుచున్న ఈ సమయంలో వీరు లేక పోవుట మన దురదృష్టం."
—యస్. రాధాకృష్ణయ్య.

తీర్మానాలు

ఆంధ్ర రాష్ట్ర తీర్మానం.

"చిరకాలమునుండి ఆంధ్రులు వ్యాపకము చేయుచున్న భాషా ప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతమును ఈ మద్రాసు శాసన సభలు రెండును మార్చి మాసములో ఏకగ్రీవముగా అంగీకరించినందులకు, మద్రాసు గవర్నమెంటువారు ఆంధ్రరాష్ట్రమును గూర్చి ఇండియా మంత్రికి వెంటనే చర్య గైకొనుమని సిఫారసు చేసినందులకును ఈ సభవారు వారలకు హృదయ పూర్వక వందనము లర్పించుచు, ఇండియా మంత్రిగారు అచిర కాలములోనే తగు చర్యను గైకొని ఆంధ్రరాష్ట్రమును వెంటనే స్థాపించెదరు గాక యని ఈ సభవారు కోరుచున్నారు."

రాయలసీమ క్షామ నివారణము.

ప్రభుత్వమునకు వ్యయకారియు, ప్రజలకు వినాశకారియునగు క్షామమును రాయలసీమ-నెల్లూరులనుండి పోద్రోలుటకు త్వరలో తుంగభద్రా ప్రాజెక్టును, ఇతర నీటి పారుదల ప్రాజెక్టులును అవసరం. కనుక మద్రాసు ప్రభుత్వమువారు వెంటనే ఆ ప్రాజెక్టుల నిర్మాణమునకు ఋణము చేసియైనను పూనుకోవలెననియు, అందులకై శాసన సభ్యులు కృషి చేయవలసిన దనియు ఈ సభవారు తీర్మానించుచున్నారు.

విశ్వకళా పరిషత్తు-రాయలసీమ,

రాయలసీమ వారికిని, ఉత్తరాంధ్రులకును ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు విషయమై లోగడ కలిగిన తగాదాలను వారించి, రాయలసీమను ఆంధ్ర యూనివర్సిటీలో చేర్చు కొనుటకు వెంటనే శాసన సభలో ఆంధ్ర సభ్యులు ప్రతిపాదించి అందులకు వలసిన ఉత్తర్వులను 1939 మార్చి లోపల తెప్పించవలెననియు, ఆంధ్ర మహా జనులందరు ఈ ఏక కారణమునకు వలసిన కృషి చేయవలసిన దనియు ఈ సభవారు కోరుచున్నారు.

స్థానిక సంస్థలు
మాతృ భాషలో వ్యవహరించుట.

ప్రజా హిత పరిపాలన కావలెనని కాంగ్రెసు సంస్థ పాటుపడుచు రాష్ట్రములలో కాంగ్రెసు మంత్రివర్గము లేర్పడి భాషల ననుసరించి రాష్ట్రముల విభజన చేయవలె ననుచూ అన్ని సంస్థలూ మాతృభాషలో వ్యవహారము జరుపవలెనని ఆందోళన జరుగుచున్న సమయంలో పాలకొల్లు పురపాలక సంఘమువారు గవర్నమెంటువారికి మాతృ భాష యగు తెనుగులో లేఖ వ్రాయగా మద్రాసు గవర్నమెంటువారు నిషేధించుచు 1921 సంవత్సరపు జి. ఓ. ను చూడమని ఉత్తర్వు నిచ్చినందుకు విచారమును తెలుపుచు, ఇక నైనను స్థానిక సంస్థలు వారి వారి మాతృభాషలో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకొనుటకు అనుమతించునట్లు వెంటనే ఉత్తర్వు చేయవలెనని మద్రాసు గవర్నమెంటువారిని ఈ సభవారు కోరుచున్నారు.

బందరు జాతీయ కళాశాల పరీక్షలు

బందరు జాతీయ కళాశాల మున్నగు విద్యా సంస్థలందు పూర్వము గాని- యిక ముందు గాని సర్టిఫికెట్లు పొందినవారికి గవర్నమెంటు రికగ్నైజుడు పాఠశాలల వారికి వలె సమాన ప్రతిపత్తులు కలుగజేసి, ఉద్యోగార్హులను చేయవలెనని ఈ సభవారు మద్రాసు ప్రభుత్వమును కోరుచున్నారు.

బర్మా ఆంధ్రులు.

బర్మాలో ఆంధ్రులను వారు పడే కష్టములనుండి రక్షించ వలసినదిగా చెన్నపురి ప్రభుత్వం వారిని, భారత ప్రభుత్వం వారిని ఈ సభవారు కోరుచున్నారు.

కౌలుదార్ల కనీసపు కోర్కెలు

శ్రీ కొండపాటి పట్టాభిరామయ్య

బ్రిటిష్ పెట్టుబడిదారులు దేశంలో ప్రవేశించి నప్పటినుంచి పరిశ్రమలన్నియు క్షీణించినవి. వ్యవసాయపు వృత్తిపై వత్తిడి ఎక్కువ అయినది. 50% నుండి 85% వరకు వ్యవసాయదారుల సంఖ్య పెరిగింది. సాగుఅయ్యే భూమి మాత్రము అంతగా పెరగలేదు. పెంచుటకు ప్రభుత్వం ఎట్టి ప్రయత్నములు చేయలేదు. దేశం మొత్తంమీద నేడు 34 2% మాత్రమే వ్యవసాయం చేయబడు చున్నది. 35.2% సాగుకు వీలులేదు. 30.6% యింకను సాగు చేయవలసిన, సాగుకు లాయికీ యైన భూమిగలదు. అట్లుసాగుకు లాయికీమై, సాగు చేయకుండా యున్న భూమి మన రాష్ట్రంలో 1.98.78000 యకరములున్నది. పోనీ పంటలేమైనా ఎక్కువగా పండించుటకు అవకాశములు కల్పించుచున్నారా? అంటే—అదీ లేదు. తాత ముత్తాతలనాటి పద్ధతులే. సైన్సు ఎంత అభివృద్ధి చెందినను సామ్రాజ్యవాదులు చేయుచున్న సహాయము సున్న.

కాని పన్నులవారం, ఋణబాధ రైతును గ్రసించివేశాయి. ధరల పతనం, పంటలుపండక పోవడం రైతును దిబ్బచేశాయి. ఉద్యోగుల లంచాలు, మామూళ్లు అపారంగా అభివృద్ధి అయ్యాయి. సాంఘిక ఖర్చులు శిలా శాసనాలయ్యాయి. కోర్టు ఖర్చులు మితిమీరాయి. భూస్వాములకు చెల్లించవలసిన శిస్తులు పోటాపోటీంతో విపరీతంగా పెరిగాయి. ఈ అన్ని కారణాల చేతను రైతులు భూములు కోల్పోయి కౌలుదార్లుగను, కౌలుదార్లు వ్యవసాయపు కూలీలుగను మారుచున్నారు. దున్ని వ్యవసాయం చేసుకునే వ్యవసాయ దారులను వదలిన భూమి యావత్తు, వ్యవసాయం అంటే ఏమిటో యెరుగని జమీందార్ల, వడ్డీ వ్యాపారస్తుల, వర్తకుల, ప్లీడర్ల, ఉద్యోగుల వశమై పోయింది. అందుచే నిజమైన సేద్యగాండ్రు తమ వృత్తిని వదలలేక యీ భూస్వాముల నాశ్రయించి భూమిని కౌలుకు దున్నవలసి వచ్చింది. సామాన్యంగా అట్టి కౌలుదార్లు చిన్న రైతులు, వ్యవసాయపు కూలీలు అయి యున్నారు. చిన్న రైతుకు తన స్వంత వ్యవసాయము తన కృషికి చాలకపోవుటచేతను, వ్యవసాయపు కూలీ తనకు పని లభించక పోవుటచేతను, తాను, తమ పెద్దలు తరతరముల నుంచి చేయుచున్న వృత్తి వ్యవసాయపు వృత్తియే అగుటచేతను, తమకు యీ వృత్తి తప్ప వేరొకటి చేతకానందునను, యితర పరిశ్రమలను ప్రభుత్వము ప్రోత్సహించ నందునను గత్యంతరములేక ఏదోవిధముగ భూమి కౌలుకు దున్నవలసిన పరిస్థితులు ఏర్పడుచున్నవి. అట్టివారి సంఖ్య నేడు విపరీతముగా పెరిగిపోయినది అందువలనను, వారిలో సరియగు చైతన్యము లేనందునను పోటీలుపడి పండే పంటకంటె ఎక్కువ శిస్తుకే కౌలుకు తీసుకొని, పెట్టుబడి యావత్తు అప్పుదప్పులు అందులోనే కొంత నష్టము అనుభవించి, తమకున్న కొద్ది భూమి, కొంప, చరాస్తి కోల్పోయి, పిమ్మట భార్యల చేతను, బంధువుల చేతను, కౌలు ఖాయించి, వారి అస్థులుకూడ అఖయచేసి తుట్టతుదకు పరపతికూడా పోగొట్టుకొని పరపలగుచున్నారు.

కాంగ్రెసువారు తమ ఎన్నికల ప్రణాళికలో భూమి కౌలు పద్ధతులను సంస్కరించెదమనియు, వ్యవసాయపు వృత్తి నుద్ధరించెదమనియు వాగ్దానములు చేసిరి. భూమి హక్కు దున్ని వ్యవసాయం చేయువారిదే యన్న సంగతిని ఎల్లరు అంగీకరించ వలసినదే. అట్టి తరి మన మద్రాసు ప్రభుత్వము కృంగి కృశించి పోవుచున్న కృషీవలులగు కౌలుదార్ల రక్షణకై వెంటనే చట్టము చేయకపోవుటయే గాకుండా మిక్కిలి ఆతృతతో ఆశించుకొని యున్న ఈ అమాయికపు ప్రజలను నిరుత్సాహ పరచుటకు ఇప్పట్లో "భూమిహక్కు నిర్ణయ చట్టము" ఏమియు తెచ్చుటలేదని ప్రకటించింది. దీనిని చూచి భూస్వాములు, తమ దోపిడీ విధానం ఇంకా కొంత కాలము సాగించుకొమ్మని, యింతట్లో ప్రభుత్వమేమీ అడుగ తలచుకొనలేదని హామీ యిచ్చినట్లు భావిస్తున్నారు. అయితే యీ పీడిత కౌలుదార్ల గతి యింతేనా? వ్యవసాయపు వృత్తి క్షీణించ వలసినదేనా? కాదు. కౌలుదారులు, వారి శ్రేయోభిలాషులు, పీడిత ప్రజల కాపాడుటకై కంకణము కట్టుకొన్న ప్రతి సంస్థ ఈ దిగువ కనీసపు కోరికల ననుసరించి మన మద్రాసు ప్రభుత్వం వెంటనే చట్టము చేయుటకై తీవ్ర ఆందోళన చెయ్యాలి.

ఆంధ్ర రాష్ట్ర ప్రెస్ వర్కర్సు
తృతీయ మహాసభ
ఈ నెల 30 వ తేదీన
ఏలూరులో జరుగును.
అధ్యక్షులు :
ఆచార్య రంగాగారు

కనీసపు కోర్కెలు.

1 (a) రాష్ట్రములోని. 1.98.78.000 యకరముల సాగుకు లాయికీమై సాగుచేయకుండా యున్న భూమి, లంకలు మొదలగు వేలం భూములు, జమీందార్ల సేరీ భూములు, దేవస్థానములు, మసీదులు (చెర్చిల) సత్రముల తాలూకు భూములు అమ్ముకునే హక్కు లేకుండా సమిష్టి పద్ధతులపై వ్యవసాయం చేసుకొనుటకై భూమిలేని వ్యవసాయదారుల (తాను, తన కుటుంబములోని వారు, యిరుగు పొరుగువారి పరస్పర సహాయముతో వ్యవసాయము చేయు రైతులు, వ్యవసాయపు కూలీలు) సంఘముల కివ్వవలెను.

(b) ఆ భూములున్న ప్రాంతములు వాసయోగ్యంగా మార్చాలి — అచ్చటికి రహదారీ సౌకర్యములు ఏర్పరచాలి — మాగాణీ వసతులు కల్పించాలి. ప్రధమములో వడ్డీ లేకుండా పెట్టుబడి సప్లయి చెయ్యాలి. నూతన వ్యవసాయ పద్ధతులు నేర్పాలి. క్రొత్త ఎరువులు, రకరకపు విత్తనాలు చౌక ధరలకు యివ్వాలి. క్రయ విక్రయ సంఘములు స్థాపించాలి.

(c) ఇట్టి వ్యవసాయదారులపై వ్యవసాయపు ఖర్చులు, పనిచేయు వారి జీవిత ముఖ్యావసరములు పోను మిగిలిన దానిపై వృద్ధి క్రమానుసారముగా పన్ను విధించాలి.

2. మద్రాసు ఎస్టేటు ల్యాండు ఆక్టు సవరణపట్టంలో భూమిహక్కు దున్ని వ్యవసాయం చేసే వ్యవసాయదారుకే సంక్రమింప జేసి రైత్వారీ గ్రామాలలో నిర్ణయింపబడు యీ దిగువ సూత్రముల ననుసరించి శిస్తు, పట్టాదారుకు, జమీందారుకు కలిపి యివ్వవలెను.

3 (a) వ్యవసాయం క్రమ పద్ధతులపై శ్రద్ధతో చేసి, ప్రకృతి నుంచి పూర్తి పంటను తృప్తి చేయుటకు కృషి చేయక, నిర్లక్ష్యముగా వ్యవసాయము చేయుచు భూమి తమ ఆధీనములో ఉంచుకో వలెనసే ఆశ తప్ప వ్యవసాయము యెడల ఎట్టి శ్రద్ధలేని వ్యవసాయదారుల భూములు కూడా కౌలుకు యిచ్చి తీరాలి. (శ్రద్ధ ఉన్నది, లేనిది నిర్ణయించు అధికారం వ్యవసాయ శాఖావారి కుండాలి.)

4. కౌలు కనీసము 5 సం॥ ములకైన యివ్వాలి.

5 (a) గవర్నమెంటు ఫారమ్ లెక్కల ననుసరించి తర్కింపబడిన పెట్టుబడి పన్ను, (కౌలుదారు కూలి వగైరా. హెచ్చు పన్నులు సహా) నీటి పన్ను, మొత్తము రాశిపంటలో నుంచి తీసివేసి మిగిలినది భూస్వామి, కౌలుదారు సమముగ పంచుకోవాలి. అదే విధముగ నష్టము వచ్చినను అనుభవించాలి.

(b) పంపకము చేనులోనో, లేక దగ్గర కళ్ళంలోనో జరగాలి. అచ్చటి నుండి ఎవరి ఖర్చులతో వారే తీసుకు వెళ్ళాలి.

(c) యీనాందారుకు అనుమానం యుండి కాపలాకు పెట్టుకున్న ఖర్చు యీనాందారే ప్రత్యేకంగా భరించాలి.

(d) ఎండుగడ్డి, గట్లపై పచ్చగడ్డి కౌలుదారే అనుభవించాలి. అందులకై గట్లు, దిబ్బలు వగైరా వేయు స్థలం ఎ 1 కి 10 సెంట్లకన్న మించరాదు. దానికి ప్రతిఫలంగా దున్నలేక దమ్ముచేయు ఎడ్లు కూలి పెట్టుబడిలో నుంచి తీసివెయ్యాలి.

(e) కబురు చేసిన మూడు రోజులలో యీనాందారు వచ్చి తన భాగం తీసుకు వెళ్ళకున్న పెద్ద మనుష్యుల పరంగా పంచివేసి యీనాందారు భాగము గ్రామ పంచాయితీకి యీనాందారు ఖర్చులమీదనే వప్పచెప్పాలి. నష్టము వచ్చిన నోటీసు యిచ్చి ఖర్చులతోసహా పంచాయితీవారే రాబట్టి కౌలుదారుకు యివ్వాలి.

(f) సర్వే ఖర్చులు, సరిహద్దు రాళ్ళ ఖర్చులు యీనాందారే భరించాలి.

(g) కౌలు వ్రాయించి రిజిస్ట్రేషన్ ఖర్చులు రశీదు ఖర్చులు యీనాందారే భరించాలి.

(h) ఫలము లివ్వని చెట్లు పోషణకగు ఖర్చు, వాటివల్ల కలుగు నష్టములో సగము యీనాందారు, కౌలుదారుకి ముదరా యివ్వాలి.

(i) చేను మెరక పల్లములు సరాసరి చేయించిన, శాశ్వతపు కాలువలు, నూతులు, చెరువులు ఏర్పాటుచేసిన పూర్తిఖర్చు యీనాందారే భరించాలి. తాత్కాలికపు గుంటలు బోదెలు త్రవ్విన ఖర్చు పెట్టుబడిలో లెక్కించాలి.

6. ధరావత్తు పుచ్చుకొనుట శిక్షార్హము చెయ్యాలి.

7. వెట్టిచాకిరీలు నిరోధించాలి.

8. కౌలుదారు అనంతరం కౌలు భూమిపై హక్కు వారి కుటుంబములోని వారికి, కౌలుదారు కుటుంబ పోషణకై తోడ్పడు వారికి వ్యవసాయంచేసే హక్కు ఉండాలి.

9. చేలో ఏపంట వేయవలసినది నిర్ణయించుకునే హక్కు కౌలుదారుకే యుండాలి.

భీమవరం తాలూకా ప్రజలకు హెచ్చరిక

మన తాలూకాలో జిల్లాబోర్డు ఎన్నికల సందర్భములో అప్పుడే కొంతమంది స్వార్ధపరులు, కులతత్వముల మీద ఆధారపడి ఆర్భాటాలు ప్రారంభించారు. కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు ఋణచట్టము వగైరా ప్రజాహిత కార్యములు నెరవేర్చి ఉన్నారు. ఇంకనూ అనేక ప్రజోపకరములైన కార్యములు తలపెట్టి ఉన్నారు. స్థానిక సంస్థలలో ప్రవేశించుట కూడా స్వాతంత్ర పోరాటములో ఒక భాగమైఉన్నది. ఏనాడు స్థానిక సంస్థలకు కాంగ్రెసు మెంబర్లను పంపి స్వార్ధపరులకు, కులతత్వ వాదులకు స్థానము లేకుండా చేయుదమో అప్పుడే మనము సాగించే స్వాతంత్ర పోరాటమునకు కొంత బలము చేకూర్చిన వారమగుచున్నాము. ఒకప్పుడు స్వాతంత్ర పోరాటములో స్త్రీలను, వృద్ధులను, యువకులను బ్రిటిషు నిరంకుశ లాటీలకు, జైళ్ళకు వందల కొలది ఆహుతిచేసి, ముందంజ వేసిన భీమవరం తాలూకా ప్రజలే ఈనాడు కూడా కాంగ్రెసు అభ్యర్థులను దిగ్విజయముగా గెలిపించి స్వార్ధపరులకు కులతత్య వాదులకు ఈ తాలూకాలో స్థానము లేకుండా చేయగలరని నమ్ముచున్నాం. ఎన్నికల సందర్భమున కాంగ్రెసు తరపున ప్రచారము గావించుటకు భీమవరంలో వాలంటీరు శిబిరము ఏర్పాటు చేయుచున్నాము. కాన వాలంటీర్లుగా పని చేయువారు మాకు తెలియబర్చవలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు,

భీమవరం, 8-10-38.

గొ. వెంకట్రామరాజు, భీమవరం తాలూకా కాంగ్రెసు సంఘ కార్యదర్శి.

కృ. వెంకటేశ్వరరావు, భీమవరం రైతు సంఘ కార్యదర్శి.

నవశక్తి
రష్యా సంచిక
లో
ప్రకటనలు చేయండి.

ADVERTISE
IN
Soviet Number
OF
NAVASAKTI

అందమైన చిత్రాలతో! అమూల్యమైన వ్యాసాలతో!!

రష్యా ప్రత్యేక సంచిక —

నవంబరు 7వ తేదీ
సోవియట్ యూనియన్ 21వ వార్షికోత్సవం నాటికి
వెలువడుతుంది.

★

సోవియట్ శాంతి సందేశం

సమిష్టి వ్యవసాయం

న్యాయ నిర్వహణ

సోవియట్ విధానం

పారిశ్రామికాభి వృద్ధి

ఉత్పత్తి విధానం

భీమా సౌకర్యాలు

యువజనోద్యమం

బాల-బాలికలు.

★

సారస్వతం — కళలు — విజ్ఞానం — ఇంకా ఎన్నో సమస్యలపై వ్యాసాలు ఉంటాయి.

100 పుటలు, **20** పూర్తి పేజీ బ్లాకులు.

గత 21 సంవత్సరాలలో సోవియట్ యూనియన్ పొందిన వికాసాన్ని వెల్లడించే అమూల్యమైన సంచిక

విడి ప్రతి: నాలుగు అణాలు. ఏజంట్లు కాపీలకు ముందే వ్రాయండి.

—మేనేజరు, 'నవశక్తి'

END OF ISSUE